# రేపటి కోసం

తెలుగు దినపత్రిక

బుధవారం 4-6-2025 | Repatikosam, Published From Guntur | పేజీలు : 12 | వెల. రూ.6.00 | సంపుటి: 8, సంచిక: 45





బ్రాహ్మీ : ఉ04.06-04.50, చంద్రోదయ : మ01.03, చంద్రాస్తమ : రా 01.21, శు.నవమి రా11.54, ఉత్తర రాతె 03.35, కన్యా చంద్ర ఉ07.36 వర్జ్యం ఉ08.58-10.44, దుర్ము మ11.40-12.32, అమృత ఉ07.36-09.23, వజ్రయోగం ఉ08.29, బాలవకరణం ఉ10.51, రా.కా. మ12.06-01.44, అభిజిత్ : లేదు, అపరాహ్ణం:మ01.24-04.01, నక్షత్రపాద ప్రారంభాలు: ఉత్తర 2ఉ 07.36, ఉత్తర 3మ 02.13, ఉత్తర 4, రా 08.54, హస్త 1రాతె 03.36, పితృతిథి: శు.నవమి, మహేష్ నవమి


## విశాఖ జూ అభివృద్ధిపై సింగపూర్ ప్రతినిధుల చర్చలు



**విశాఖపట్నం, రేపటి కోసం :** సింగపూర్‌కు చెందిన మాండై వైల్డ్ లైఫ్ గ్రూప్ ప్రతినిధులు విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్‌ను మంగళవారం సందర్శించారు. ఈ పర్యటనకు విశాఖ పార్లమెంట్ శ్రీభరత్ ఆహ్వానంపై వచ్చారు. ఈ సందర్భంగా, మాండై ప్రతినిధులు జూ అభివృద్ధి, నిర్వాహణ, - మిగతా 2లో

## తుని రైల్వే కేసు రీ ఓపెన్ చేసేది లేదు




**విశాఖపట్నం, రేపటి కోసం:** తుని గతంలో జరిగిన రైలు దగ్ధం కేసు విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ కేసును రీఓపెన్ చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లే యోచన లేదన్న సర్కార్ రైల్వేకోర్టు ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లడంపై స్పష్టత ఇచ్చింది. హైకోర్టులో అపీలు చేసే ఆలోచనను విరమించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సున్నితమైన అంశాల్లో అలసత్వం వద్దన్న ప్రభుత్వం హోం శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేయించింది.

# మేలో జీఎస్టీ మోత


- ఏపీకి రూ.2,714 కోట్ల నికర ఆదాయం
- జీఎస్టీ చరిత్రలో మే నెలకు గరిష్ఠ వసూలు
- పన్నుల కట్టుబాటు, విస్తృత ఆదాయ స్థాయి ఫలితాలు




**అమరావతిబ్యూరో, రేపటికోసం:** ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ ఆదాయంలో మే నెలలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. రాష్ట్రానికి నికరంగా రూ.2,714 కోట్లు జీఎస్టీ వసూళ్లు లభించాయి. 2017లో ఏపీ జీఎస్టీ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత మే నెలలో ఇదే అత్యధిక వసూళ్లు కావడం విశేషం. అంతేగాక, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ ( ఐజీఎస్టీ ) సెటిల్మెంట్ ద్వారా అదనంగా రూ.1,524 కోట్లు లభించాయి. ఈ ఏడాది ఏప్రిల్-మే మధ్యకాలంలో ఏపీ ప్రభుత్వ పన్నుల - మిగతా 2లో

## పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను

# రాష్ట్ర సంపదగా తీర్చిదిద్దాలి



- తొలిదశలో కుప్పం, దగదర్తి, అమరావతి, శ్రీకాకుళం ఎయిర్ పోర్టుల నిర్మాణం
- పీపీపీ విధానంలో రద్దీకి అనుగుణంగా రాష్ట్ర రహదారుల విస్తరణ
- జాతీయ రహదారులతో అన్ని రాష్ట్ర రహదారులు అనుసంధానం
- పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వచ్చే ఏడాదికి 4 పోర్టులు, 4 హార్బర్లు సిద్ధం చేయండి
- త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు

**అమరావతి, రేపటికోసం:** రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మచిలీపట్నం, రామయపట్నం, మూలపేట పోర్టుల మొదటి దశ పనులు, అలాగే కాకినాడ గేట్ వే పోర్టు పనులు వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని... మరోవైపు జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల మొదటి దశ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు మన రాష్ట్ర సంపదని, వాటి నిర్మాణం త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి - మిగతా 2లో

# విద్యుత్ రంగంలో నైపుణ్యాభివృద్ధి

- ఇంధన మంత్రి గొట్టిపాటితో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ ప్రతినిధుల భేటీ
- ఉమ్మడి కార్యాచరణతో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు హామీ



**అమరావతి, రేపటికోసం:** కూటమి ప్రభుత్వం పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి చాలా ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. మంగళవారం ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సిలైజకి, డిప్యూటీ జనరల్ డేవిడ్ ఈగిల్సన్‌లు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. సోలార్‌తో పాటు పునరుత్పాదక విద్యుత్ రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి ఉన్న అవకాశాలపై ఈ భేటీలో చర్చించారు. దీనితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీలో ఉన్న అపార అవకాశాలను పైన చర్చించారు. ఆస్ట్రేలియా - మిగతా 2లో

## మరోసారి భూ సమీకరణకు రెడీ

- రెండో దశలో 40 వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్‌కు చర్యలు
- ఇప్పటికే 36 వేల ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సిద్ధం
- రాజధాని గ్రామాల్లో వరుస సమావేశాలు
- అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ ,స్మార్టు ఇండస్ట్రీస్ కోసమే



**అమరావతి, రేపటికోసం :** రాజధాని అమరావతి కోసం రెండో విడత విడత భూ సమీకరణకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాజధాని అమరావతికి మొదట భారీగా భూసమీకరణ చేశారు. దాదాపు 33 వేల మంది రైతులు ముందుకొచ్చి స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూలన పడిన అమరావతి పనులు గాడిన పడ్డాయి. రాజధాని పునర్నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చి శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో - మిగతా 2లో

## చంద్రబాబుపై నోరుజారితే గుణపాఠం చెబుతాం

- కూటమి ప్రభుత్వం అన్ని హామీలూ నెరవేస్తోంది
- పథకాల అమలుపై చర్చకు సిద్ధమా!
- మంత్రి సవిత సవాల్



**అమరావతి,రేపటికోసం:** నీతి, నిజాయితీకి నిలువెత్తురూపమైన సీఎం చంద్రబాబు నాయుడును నోటికొచ్చిన మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని - మిగతా 2లో

# వెన్నుపోటుకి బ్రాండ్ అంబాసిడర్ జగన్

- వెన్నుపోటు,గొడ్డలి వేటు, పేటెంట్ జగన్ దే
- ప్రజాదృష్టిని మళ్లించడానికి ధర్నాలు, ఆరోపణలు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

**అమరావతి, రేపటికోసం:** రాష్ట్ర ప్రజలనే కాకుండా, సొంత తల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచిన సంస్కృతి జగన్మోహన్ రెడ్డి దని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ మాట్లాడుతూ తీవ్రంగా విమర్శించారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ రాష్ట్ర ప్రజలను మోసగించిన ఘన చరిత్ర జగన్ రెడ్డి దేనని ఆక్షేపించారు. సుపరిపాలనే ధ్యేయంగా సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లను విమర్శించే నైతిక హక్కు జగన్ కు లేదన్నారు. జగన్ పరిపాలనలో ఏడాదిలో 10 శాతం హామీలు కూడా అమలు - మిగతా 2లో



## 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగాపై సీఎం సమీక్ష




ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం సన్నద్ధతపై ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష జరిపారు. మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ , వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి , సత్యకుమార్ యాదవ్ , సీఎస్ విజయానంద్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర అధికారులు.. -రేపటికోసం, అమరావతి


## హాస్టళ్లకు సరుకుల సరఫరా దళితులకే కేటాయించాలి

విదసం కన్వీనర్ డాక్టర్ బూసి డిమాండ్ 2లో

## మంగళగిరి ఎయిమ్స్‌లో త్వరలో

# బోన్ మెరో ట్రాన్స్‌ప్లాంట్

- రాష్ట్ర వ్యాప్తంగా 2,129 మంది చిన్నారుల్లో తలసేమియా
- విశాఖ కెజిహెచ్‌లో తొలి జీన్ ల్యాబ్
- తలసేమియా పిల్లల రక్త మార్పిడికి ప్రత్యేక కిట్లు




**అమరావతిబ్యూరో, రేపటికోసం:** చిన్నారుల్లో సాధారణంగా కనిపించే తీవ్రమైన రక్త సంబంధిత వ్యాధి తలసేమియాకు శాశ్వత పరిష్కారంగా భావించే బోన్ మెరో ట్రాన్స్‌ప్లాంట్ (బి ఎంటి) చికిత్సలు త్వరలో మంగళగిరి ఏఐఐఎంఎస్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ సేవలు దేశంలో - మిగతా 2లో

## అమరావతిలో మెగా శిల్పారామం..?

- 50 ఎకరాలో అమరావతి ప్రాంత చారిత్రక, వారసత్వ వైభవాన్ని చాటిచెప్పేలా ప్రణాళికలు
- రాష్ట్రంలో ఆధునిక వసతులతో పార్కులు ఏర్పాటు చర్యలు
- కర్నూలు, చిత్తూరు, రాయచోటి, అన్నమయ్య శ్రీకాకుళంలో కూడా శిల్పారామాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో ఏర్పాటు

**అమరావతి, రేపటికోసం :** ప్రపంచ గమ్యస్థానంగా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసింది. వివిధ మత, ఆధ్యాత్మిక, తీర ప్రాంత పర్యావరణ వెల్నెస్ అనుభవాలతో స్థానిక ప్రజలకు సాధికారత కల్పించటం ఐకానిక్ ల్యాండ్ మార్క్ గా ప్రసిద్ధ నగరాలను తీర్చిదిద్దేందుకు శిల్పారామాల విస్తరణ తప్పనిసరని భావిస్తోంది. నూతన - మిగతా 2లో



# రహదారుల అభివృద్ధికి అడుగులు

- ఎన్‌డీబీ ప్రాజెక్టుల పునఃప్రారంభానికి సీఎం చంద్రబాబు నిర్ణయం
- రూ.200 కోట్లు విడుదల
- మొదటి దశలో 900 కి.మీ. పనులు పూర్తి చేయనున్న ప్రభుత్వం

**అమరావతిబ్యూరో, రేపటికోసం:** రాష్ట్ర రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నూతన దిశగా అడుగులు వేస్తోంది. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) సహకారంతో చేపట్టిన భారీ రహదారి ప్రాజెక్టులు మళ్లీ ఊపందుకోనున్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మౌఖికంగానే పరిమితమైన ఈ ప్రాజెక్టుకు ఎన్డీఏ ప్రభుత్వం నూతన ఊపునిచ్చింది. తాజాగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును సమీక్షించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటివరకు టెండర్లు పూర్తయిన, లేదా - మిగతా 2లో



# ప్రతిష్టాత్మకంగా మత్స్యకారుల యోగా

- పూడిమడకలో వందల మంది మత్స్యకారుల యోగా ప్రదర్శన
- జిల్లా మత్స్యశాఖ అధికారి పి ప్రసాద్

**అనకాపల్లి, రేపటి కోసం:** యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం మండలం పూడిమడక ఫిషింగ్ హార్బర్ పార్క్ వద్ద జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో జిల్లా మత్స్య శాఖ అధికారి పి. ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం 300 మంది మత్స్యకారులతో యోగా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు దొర్రం నాయుడు, డాక్టర్ సౌభాగ్య లక్ష్మిలు కార్యక్రమాన్ని నడిపిస్తూ యోగాలోని ఆసనాలు, బ్రీతింగ్ టెక్నిక్స్ చేసి చూపించి మత్సకారులందరితో చేయించారు. ఈ - మిగతా 2లో



రేపటి కోసం
తెలుగు దినపత్రిక
www.Repatikosam.com

# మేలో జీఎస్టీ మోత

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మెరుపులు మెరిపించింది. గతేడాది మేతో పోలిస్తే ఈ మేలో నికర వసూళ్లు పెరిగాయి. ఇది పన్నుల కట్టుబాటు పెరగడం, సెటిల్మెంట్లలో స్పష్టత రావడం, రాష్ట్రంలో విస్తృత పన్ను ఆధారిత వృద్ధిని సూచిస్తోంది. 2024 నవంబర్, డిసెంబరులో కనిపించిన వెనుకడుగు ధోరణిని ఏపీ తిరగదీసింది. 2025 తొలి త్రైమాసికంలో ఆదాయ వృద్ధిలో నిలకడ సాధించింది. ఏప్రిల్ నెలలో అత్యుత్తమ వసూళ్లు నమోదయ్యాయి. దీంట్లో మే నెల కూడా ప్రతిష్టాత్మక స్థానం సంపాదించుకుంది.

**పన్నుల పరిపాలన ఫలితమే ఈ విజయానికి మూలం**

స్థిరంగా పెరుగుతున్న ఆదాయ వృద్ధి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలాన్ని, పన్నుల కట్టుబాటును పెంచేందుకు తీసుకున్న చర్యల విజయాన్ని తెలియజేస్తోంది. నికర వసూళ్లే రాష్ట్ర ఖర్చులకు అందే వాస్తవ ఆదాయం కావడం విశేషం.మొత్తం జీఎస్టీ వసూళ్లు ఈ మే నెలలో -2.24శాతం తగ్గాయి. ముఖ్యంగా సెస్, ఎస్‌జీఎస్టీ, సీజీఎస్టీల్లో వరుసగా రూ.52 కోట్లు (-20.02శాతం), రూ.51 కోట్లు (-4.11శాతం), రూ.40 కోట్లు (-4.01శాతం) తగ్గుదల నమోదైంది. కానీ, ఇవి రాష్ట్ర నికర ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపలేదు.

జీఎస్టీ నెట్‌వర్క్ (జీఎస్టీఎన్)సమాచారం ప్రకారం ఏప్రిల్-మే 2025లో కేంద్ర పన్ను వసూళ్లు 7.2శాతం తగ్గగా, రాష్ట్రాల వసూళ్లు మాత్రం 3.2శాతం పెరిగాయి. కేంద్ర వసూళ్లు తగ్గిన ప్రభావంతో మొత్తం జీఎస్టీ వృద్ధి రేటు లెక్కల్లో క్షీణించింది. కానీ రాష్ట్రం మాత్రం నిలకడగా ఆదాయ వృద్ధి కొనసాగిస్తూ గడ్డు కాలాన్ని దాటింది. రాష్ట్ర స్థాయి పన్నుల పరిపాలన ప్రభావంతో నికర వసూళ్లు గట్టిగా నిలిచాయి. ఇది ఆర్థిక పరంగా పెద్ద బలమైన సూచిక.

# విద్యుత్ రంగంలో నైపుణ్యాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

కాన్సులేట్ జనరల్ సిలైజకి పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఉన్న అవకాశాలను ఆస్ట్రేలియన్ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటికి వివరించారు. అదే విధంగా మహిళలకు, గిరిజన ప్రాంత యువతకు ఉమ్మడి కార్యచరణతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తాము పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి గొట్టిపాటికి కాన్సులేట్ జనరల్ తెలిపారు. వీటితో పాటు గిరిజన ప్రాంత విశ్వ విద్యాలయాలకు ఆర్థిక సహాయం చేస్తామని పేర్కొన్నారు.

# వెన్నుపోటుకి బ్రాండ్ అంబాసిడర్ జగన్

(మొదటిపేజీ తరువాయి)

చేయలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలో 70 శాతం హామీలను నెరవేర్చడం జరిగిందన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ జగన్ అండ్ పార్టీ అన్నారు. ఎత్తుకొని పెంచిన సొంత బాబాయిని గొడ్డలి పోటుతో హత్య చేసిన వారిని కాపాడుతూ బాబాయ్ కుటుంబానికి వెన్నుపోటు పొడిచారని, మద్యపాన నిషేధంపై మాట తప్పి విషపూరితమైన నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలను హరించారని, మెగా డీఎస్సీపై మాట తప్పి నిరుద్యోగ యువతకు వెన్నుపోటు పొడిచారన్నారు. రూ. 2684 కోట్ల రూపాయలతో దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా సరఫరా చేస్తున్నామని అధికారం చేపట్టిన వెంటనే రూ.1200 కోట్లతో 20 వేల కిలోమీటర్ల రోడ్లపై గుంతలు పూడ్చి రోడ్లు బాగు చేసామన్నారు. మత్స్యకారులను దెబ్బతీసే 217 జీవోని రద్దుచేసి మత్స్యకారుల సేవ పథకం ద్వారా రూ. 20 వేల ఆర్థిక సహాయం కింద రూ. 259 కోట్లు ఇప్పటికే అందించామన్నారు. 203 అన్నా క్యాంటీన్లుపునః ప్రారంభించి, 21 దేవాలయాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, చెత్తపన్ను రద్దు చేశామని, ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్లలో బీసీలకు రూ. 47,456 కోట్లు కేటాయించి నాయిబ్రాహ్మణులకు 25 వేల రూపాయల వేతనం పెంచామన్నారు. ఏడాదిలోనే హామీలను నెరవేర్చిన ప్రభుత్వ మరొకటి లేదన్నారు. అమరావతి ఏకైక రాజధానిగా సరా వేగంతో అభివృద్ధి చేస్తూ త్వరలోనే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తు సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని ప్రశంసించారు. జగన్ వెన్నుపోటు రాజకీయాలు, ధర్నాలు ప్రజలు గమనిస్తున్నారని, జగన్ ముఠా దుష్ప్రచారాలు కుట్రలు కుతంత్రాలను ప్రజలు తిప్పి కొట్టి రాష్ట్ర అభివృద్ధి సంక్షేమలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. జగన్ ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ ఆపాలని, దమ్ముంటే ప్రజాక్షేత్రంలోకి వచ్చి మంత్రి లోకేష్‌తో డిబేట్‌కు సిద్ధమా అని సవాల్ విసిరారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన పాపం జగన్‌దేనన్నారు.

# మంగళగిరి ఎయిమ్స్‌లో త్వరలో బోన్ మెరో ట్రాన్స్‌ప్లాంట్

(మొదటిపేజీ తరువాయి)

కేవలం 11 పేరున్న ఆసుపత్రులకే పరిమితమై ఉండగా, ఇప్పుడు మంగళగిరిలోనూ అందుబాటులోకి రానుండడం రాష్ట్రానికి మైలురాయిగా నిలవనుంది.

ప్రస్తుతం తలసేమియా బాధితులందరికీ రక్త మార్పిడి, ఐరన్ నియంత్రణ చికిత్సలే అందుబాటులో ఉన్నాయి. కానీ, ఇవి శాశ్వత పరిష్కారం కావని వైద్య నిపుణులు చెబుతున్నారు. పూర్తిగా సరిపోయే దాతను కనుగొనగలిగితే బోన్‌మెరో ట్రాన్స్‌ప్లాంట్‌తో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు," అని ఏఐఐఎంఎస్ వర్గాలు తెలిపాయి.ఈ శస్త్రచికిత్సల ఖర్చు రూ.8 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ ఉంటుంది. సామాన్య కుటుంబాలకు ఇది అందని ద్రాక్షగా మారుతోంది. పూర్తి సరిపోయే సోదరుడు లేకుంటే 'హాప్లో-ఇడెంటికల్' దాతలతో కూడిన పద్ధతులకూ డిమాండ్ పెరుగుతోంది.

**రాష్ట్రవ్యాప్తంగా 2,129 మందికి తలసేమియా**

తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా 2,129 మంది పిల్లల్లో తలసేమియా ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. తీవ్రమైన స్థాయిలో ఉన్న చిన్నారులకు బోన్‌మెరో ట్రాన్స్‌ప్లాంట్ వలన జీవన ప్రమాణం మెరుగవుతుందని నేషనల్ హెల్త్ మిషన్ అధికారి అన్నారు.

**విశాఖలో తొలి జీన్ టెస్టింగ్ ల్యాబ్**

విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో తొలి జీన్ పరీక్షాల ప్రయోగశాల త్వరలో ఏర్పాటు కానుంది. తలసేమియాఉన్న పిల్లల తల్లులు మళ్లీ అలాంటి పిల్లల్ని పొందే అవకాశం ఉందా అన్నది ఈ పరీక్షల ద్వారా ముందుగానే తెలుసుకోవచ్చని వైద్యులు తెలిపారు.

**కర్ణాటకలో ఆరోగ్యసేవ పథకం**

ఇతర రాష్ట్రాలనూ కేంద్రం ప్రోత్సహిస్తోంది. కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే 'కర్ణాటక ఆరోగ్య సేవ' పథకంతో బోన్‌మెరో చికిత్సలను అమలు చేస్తోంది. బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆసుపత్రిలో తొలిదశలో ఏడుగురు పిల్లలకు చికిత్స అందింది.

# చంద్రబాబుపై నోరుజారితే గుణపాఠం చెబుతాం

(మొదటిపేజీ తరువాయి)

జగర్ రెడ్డిని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత హెచ్చరించారు. రౌడీ షీటర్లకు, గంజాయి గ్యాంగ్ కు పరామర్శ చేసి నైతికంగా పతనమైన రాజకీయ నాయకుడివని మండిపడ్డారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు జగన్ రెడ్డి రాజ్యాంగం, చట్టం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు.2014-19లో అమలు చేసిన 27 పథకాలను, దళిత యువతకు స్వయం ఉపాధి పథకాలను నిలిపేశారని మండిపడ్డారు. జగన్ పాలనలో గతంలో ఎన్నడూ లేనంతగా దళితులపై దాడులు జరిగాయన్నారు. దళిత మహిళలపై అఘాయిత్యాలు సైతం చోటుచేసుకున్నాయన్నారు. ఇన్ని జరిగినా ఏనాడూ దళితులను పరామర్శించిన పాపాన జగన్ పోలేదన్నారు. అయిదేళ్లలో ఎంతమంది దళితులను జగన్ రెడ్డి పరామర్శించాడో చర్చించడానికి సిద్ధమా..? అని మంత్రి సవిత సవాల్ విసిరారు. జగన్ రౌడీ షీటర్‌లను పరామర్శించడం అంటే అరాచకాలను ప్రోత్సహించడమే అని మంత్రి సవిత తెలిపారు. జగన్ పరామర్శించిన చేబ్రోలు జాన్ విక్టర్‌పై 9, నవీన్ అలియాస్ కిల్లర్‌పై 11, దోమ రాకేష్‌పై 8 కేసులు ఉన్నాయన్నారు. అటువంటి క్రిమినల్స్‌ను పరామర్శించడం జగన్ s చెల్లిందన్నారు. తండ్రి శవాన్ని పక్కనబెట్టుకుని, కుర్చీ కోసం పాకులాడరన్నారు. బాబాయిపై గొడ్డలిపోటు వేసి, నారా వారి రక్త చరిత్ర అంటూ తప్పుడు కథనాన్ని ప్రచురించి, సానుభూతి రాజకీయాలు చేశాడన్నారు. అన్నమయ్య జిల్లాలో డ్యాం కొట్టుకుపోయి 42 మంది చనిపోతే ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచింది జగన్ కాదా..? అని ప్రశ్నించారు. ప్రజలు ఎందుకు బుద్ధి చెప్పారో జగన్ ఇప్పటికైనా తెలుసుకోవాలని హితవు పలికారు. వైఎస్ వివేకా హత్య కేసులో ఎందుకు న్యాయం చేయలేదని నిలదీశారు.

# అమరావతిలో మెగా శిల్పారామం..?

(మొదటిపేజీ తరువాయి)

అన్వేషణలు, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించి ప్రపంచ పర్యాటకుల దృష్టిని ఆకర్షిం చటంతో పాటు పెట్టుబడులకు మార్గం సుగమం చేసే దిశగా కార్యాచరణను పర్యాటకశాఖ నిర్దేశించుకుంది. అందులో భాగంగా రాష్ట్రం లో శిల్పారామాల విస్తరణతో పర్యాటక రంగానికి కొత్త ఊపు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతిలో ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో మెగా శిల్పారామం ఏర్పాటుకు పర్యాటక శాఖ అధికారులు పరిశీలన జరుపుతున్నారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో అమరావతి ప్రాంత చారిత్రక, వారసత్వ వైభవాన్ని చాటిచెప్తూ మెగా శిల్పారామం పార్కును అన్ని రకాల హంగులతో నిర్మించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.ప్రస్తుతం అనంతపురం, కడప, పులివెందుల, తిరుపతి, విశాఖ పట్నం, విజయనగరంలో శిల్పారామాలు మను గడలో ఉన్నాయి.. రాజమండ్రి, కాకినాడలో నిర్మాణం పూర్తయింది. రాజధాని ప్రాంతంలో విజయవాడ భవానీ ఐలండ్లో ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదనలు వచ్చాయి. యర్రబాలెం వద్ద అటవీ భూముల్లో నిర్మించేందుకు పరిశీలన జరుగుతోంది. ఇక్కడ 50 ఎకరాల మేర అటవీ భూములు నోటిఫై చేసి ఉండటంతో పాటు రాజధాని నగర పరిధిలో ఉన్నందున అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వంభావిస్తోంది. హైదరాబాద్లో శిల్పారామం కంటే మరింత ఆధునికంగా నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందుకు రూ.50 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.. అయితే ఇంటీరియర్ డెకరేషన్, ఇతర పార్కు అభివృద్ధికి అదనపు ఖర్చు తప్పదని చెబుతున్నారు. ప్రాథమికంగా 50 కోట్లకు గాను ప్రభుత్వం ఇప్పటికే రూ.10 కోట్లు బడ్జెట్ లో కేటాయింపులు జరిపింది. కృష్ణా నదీ తీరంలో సర్వాంగ సుందరంగా పార్కును తీర్చిదిద్దితే విదేశీ పర్యాటకులు సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు.ప్రస్తుతం ఉన్న శిల్పారామాల ఆస్తులను అభివృద్ధి చేయటంతో పాటు అదనపు సౌకర్యాల సృష్టి పీపీపీ మోడల్లో అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్లకు పర్యాటక శాఖ కసరత్తు జరుపుతోంది. కొత్తగా కర్నూలు, చిత్తూరు, రాయచోటి, అన్నమయ్య జిల్లాలతో పాటు శ్రీకాకుళంలో కూడా శిల్పారామాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. మార్కెటింగ్ ఈవెంట్ల నిర్వహణ, సదుపాయాల ద్వారా జీవనో పాధికి ఉపకరించే ప్రదర్శనలు, మేళాలు, చేతివృత్తుల వారికి అవకాశాలు కల్పించేం దుకు శిల్పారామాలను ఆధునీకరించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం పర్యాటక శాఖ ద్వారా గ్రాస్ వాల్యూ అడిషన్ 4.6 శాతం ఉంది దీన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో 5 శాతానికి పెంచటంతో పాటు ఉపాధి కల్పన 12 నుంచి 13 శాతానికి చేర్చటం విదేశీ పుట్ఫాల్లో 16వ స్థానంలో ఉన్న టూరిజంను ఈ ఏడాది 14వ ర్యాంక్ సాధించేదిశగా అడుగులు వేస్తోంది.

# మరోసారి భూ సమీకరణకు రెడీ

(మొదటిపేజీ తరువాయి)

మరో 40 వేల ఎకరాలను సమీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. అంతర్జాతీయ విమానాశ్రాయం. స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ఈ భూములు అవసరమవుతాయని భావిస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ టెక్నో ఫిజిబిలిటీ నివేదికను సిద్ధం చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఈ నివేదికను కేంద్రానికి పంపనుంది. క్రికెట్ స్టేడియం, విమానాశ్రయానికి అవసరమైన భూములను అందించిన రైతులకు తొలివిడత మాదిరిగానే విలువైన ప్లాట్లను ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు వరుసగా అమరావతి రాజధాని ప్రాంతంలో సీఆర్డీయే అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లాలో పెదకూర పాడు మండలం బులుసుపాడు. కంభంపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో తమ డిమాండ్లను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, అధికారుల రైతులు తీసుకువచ్చారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు సానుకూలత తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం ఉంగుటూరు, నరుకుళ్ల పాడు, మండెపూడి, నెమలికల్లు గ్రామాల్లో ప్రజాప్రతి నిధులు, అధికారులు గ్రామసభలు నిర్వహించారు. మెజార్టీ రైతులు భూ సమీకరణకు సానుకూలంగా ఉండగా, కొందరు అభ్యంతరాలు చెప్పారు. అమరావతిలో ఐదు వేల ఎకరాల్లో అంతర్జాతీయ ఎయిపోర్టును, 2,500 ఎకరాల్లో స్మార్టు ఇండస్ట్రీస్ ను మరో 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ క్రీడా సిటీని నిర్మించేందుకు దాదాపు 10 వేల ఎకరాల భూమి కావాల్సి ఉంది. ఇందుకు కావాలసిన భూమిని రైతుల నుండి భూసేకరణ చేయాలా లేదా ల్యాండ్ పూలింగ్ ద్వారా సేవకరించాలా అనే నిర్ణయాన్ని ఇప్పటి వరకూ స్పష్టత రాలేదు. ఈ గ్రామ సభలో రైతులు ల్యాండ్ పూలింగ్‌కే మొగ్గుచూపుతున్నారని, ఇప్పటికే దాదాపు 36 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇచ్చేందుకు పలువురు రైతులు ముందుకు వన్నారు. ప్రభుత్వానికి కావలసిన 10 వేల ఎకరాలకు గాను రైతుల నుండి దాదాపు 40 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాల్సి ఉంది. ఇప్పటికే అమల్లో ఉన్న ల్యాండ్ పూలింగ్ చట్టంలోని నియమ నిబంధనల మేరకు 217 చ.కి.మి. కే అనుమతి ఉందని, ఈ పరిధిని మరింత పెంచేందుకు నేడు జరిగిన అథారిటీ సమావేశంలో ఆమోదం పొందారు. సీఎంను కలిసి రైతుల అభ్యంతరాలు తెలియజేస్తామని, అందరికీ సానుకూలంగా ఉండేలా నిర్ణయం తీసు కుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అమరావతి మండలం మండేపూడి గ్రామ సభలో స్థానిక ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొని రైతుల అనుమానాలు నివృత్తి చేశారు. చంద్రబాబు సారథ్యంలో ప్రజా రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రెండో దశ ల్యాండ్ పూలింగ్ ను కూడా పూర్తిచేసి అభివృద్ధి పర్చనున్నారు.

# పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర సంపదగా తీర్చిదిద్దండి

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పోర్టుల ఆపరేషన్-మెయింటెనెన్స్‌పైనా అధికారులతో చర్చించారు. మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా...ఆ ప్రాంతానికి మరింత ఆదాయం సమకూర్చేలా ఫిషింగ్ హార్బర్లను మైనర్ పోర్టులుగా అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

**గిరిజన ప్రాంతాల్లో హెలీ పోర్టులు**

రాష్ట్రంలో కొత్తగా నిర్మించ తలపెట్టిన కుప్పం, దగదర్తి, అమరావతి, శ్రీకాకుళం(పలాస) ఎయిర్ పోర్టుల నిర్మాణం ముందుగా చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. రాష్ట్రంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు మొత్తం కలిపి 20కి తగ్గకుండా, అలాగే 14 ఎయిర్ పోర్టులు ఉండేలా చూడాలని చెప్పారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రాష్ట్ర రహదారుల విస్తరణ చేపట్టాలని, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని ముఖ్యమంత్రి సూచించారు. పీపీపీ విధానంలో వీటిని అభివృద్ధి చేయాలన్నారు. రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధే లక్ష్యంగా ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి చెందేలా హెలీ పోర్టుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

**శరవేగంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం**

మచిలీపట్నం పోర్టు మొదటి దశ పనులు 43.25 శాతం పూర్తి కాగా వచ్చే ఏడాది నవంబర్ నాటికి మొత్తం పనులు పూర్తికానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. రామయపట్నం పోర్టు మొదటి దశ పనులు 63.89 శాతం, మూలపేట పోర్టు మొదటి దశ పనులు 46.59 శాతం, కాకినాడ గేట్ వే పోర్టు పనులు 29.92 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మొదటి దశ నిర్మాణం పనులు 97.72 శాతం, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 81.17 శాతం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 69.20 శాతం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 78.94 శాతం పూర్తయ్యాయని అధికారులకు సీఎంకు తెలియజేశారు.

# రహదారుల అభివృద్ధికి అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

పనులు కొనసాగుతున్న ప్రాజెక్టులపైనే దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.పనులు ప్రారంభంకాని ప్రాజెక్టులను తొలగించాలనిస్పష్టం చేశారు.

**పాత వాయిదాలు తీర్చేందుకు చర్యలు**

2021లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో మొత్తం 1,300 కి.మీ. ఒంటిరైపు రహదారులను ద్విరైపుగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటివరకు కేవలం 71 కి.మీ. పనులు మాత్రమే పూర్తయ్యాయి. రాష్ట్ర వాటా నిధులు విడుదల కాకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును పునఃప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు టెండర్లు పూర్తయిన, పనులు మొదలైన వాటికే ప్రాధాన్యత, ఇంకా ప్రారంభం కాని పనులను ప్రాజెక్టు నుంచి తొలగింపు,పెండింగ్ బిల్లుల చెల్లింపుకు రూ.200 కోట్ల విడుదలకు ఆమోదం.మొదటి దశలో 900 కి.మీ. పనులు పూర్తి లక్ష్యం,రెండో దశ ప్రణాళికకు బ్లూప్రింట్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు.

**రెండో దశ ఖర్చు రూ.3,200 కోట్లు**

రెండో దశలో మరో రూ.3,200 కోట్ల వ్యయంతో రహదారులు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తాత్కాలికంగా రూ.500 కోట్లు ముందస్తుగా విడుదల చేసే అవకాశం ఉంది. 2025-26లో రెండో దశ ప్రారంభించేలా ప్రణాళికలు వేస్తున్నారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల వరకు ప్రయాణ వ్యవస్థ మెరుగుపడి, గ్రామీణ ప్రాంతాలకు వేగవంతమైన రవాణా అందుబాటులోకి రానుంది. అభివృద్ధి దిశగా రాష్ట్రానికి ఇది మరో మెరుగైన అడుగుగా పరిశీలిస్తున్నారు.

# ప్రతిష్టాత్మకంగా మత్స్యకారుల యోగా

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా జిల్లా మత్స్య శాఖ అధికారి పి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టకంగా నిర్వహిస్తున్నదని తదనుగుణం ఈ రోజు 300 మంది మత్స్య కారులతో పూడిమడకలో యోగేంద్ర నిర్వహించడం జరిగినదని , మత్సకారులు ప్రతి రోజు యోగ చేయడం వలన అనారోగ్య పరిస్థితులు తలెత్తవని ఉల్లాసంగా ఉంటారని అయన తెలిపారు.

యోగా ప్రదర్శనలో కార్యక్రమంలో పతంజలి యోగ సమితి అధ్యక్షులు శౌభాగ్యవతి, ఆయుష్ శాఖ అధికారి మెరుగ బాబు నాయుడు, పూడిమడక మాజీ సర్పంచ్ మేరుగ ప్రవీణ్ కుమార్, జనసేన అధ్యక్షులు, స్థానిక ప్రజా ప్రతినిధులు , మత్స శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ జూ అభివృద్ధిపై సింగపూర్ ప్రతినిధుల చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

పర్యాటక ప్రమోషన్, వన్యప్రాణుల సంరక్షణపై లోతుగా అవగాహనతో పలు సూచనలు చేశారు. పార్క్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్ క్యూరేటర్ మంగమ్మ జూ ప్రస్తుత సౌకర్యాలు, ప్రాజెక్టులు, భవిష్యత్తు అవసరాలపై వివరంగా చెప్పారు.

ఈ సందర్శనలో పాల్గొన్న మాండై ప్రతినిధుల మైక్ బార్కే, మార్క్ క్రెమెడ్స్, సుభాష్ చంద్రన్, కెరిన్ ఎన్జ్ కాయిలకు పర్యాటక ఆకర్షణగా విశాఖ జూను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఎంపీ శ్రీభరత్ ఈ సందర్భంగా వివరించారు. సింగపూర్ మాండై జూ వంటి అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక కేంద్రంగా విశాఖ జూను తీర్చిదిద్దే దిశగా పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలతో విశాఖ జూ అభివృద్ధికి తోడ్పాటు కల్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

# గాజువాకలో రాజీవ్ క్రీడా ప్రాంగణం ప్రారంభం

**విశాఖపట్నం, రేపటి కోసం:** గాజువాక ప్రాంత ప్రజలు ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరంగా ఉండేలా క్రీడలను ప్రోత్సహిస్తూ ,క్రీడాకారులకు, ప్రజలకు అనుకూలంగా అన్ని హంగులతో 65 వ వార్డు వికాస్ నగర్ రాజీవ్ క్రీడా ప్రాంగణంలో రాజీవ్ ఇండోర్ స్టేడియం,



స్విమ్మింగ్ పూల్, కళాక్షేత్రం 9 కోట్ల రూపాయల జీవీఎంసీ సాధారణ నిధులు, శాప్ నిధులతో అభివృద్ధిపరిచి గాజువాక ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచడమైనదని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు ,65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు తో కలిసి రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అభివృద్ధి పరిచిన రాజీవ్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ లను పునః ప్రారంభోత్సవం చేశారు.

ఈ ప్రారంభోత్సవం చేసి రాజీవ్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోర్టు ను ప్రారంభించి అందరూ కలిసి బ్యాడ్మింటన్ గేమ్ ను ఆడి అందరికీ స్ఫూర్తినిచ్చారు. ఈ సభలో మేయర్ మాట్లాడుతూ గాజువాక పారిశ్రామిక ప్రాంతం అయినందున ప్రజలకు ఆహ్లాదకరంగా, ఆరోగ్యపరంగా, వినోదాత్మకంగా క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్ది క్రీడలకు సంబంధించిన బ్యాడ్మింటన్ కోర్టులను, స్విమ్మింగ్ పూల్ ను, కళాక్షేత్రమును , వ్యాయామం కొరకు వాకింగ్ ట్రాక్ ను జీవీఎంసీ 9 కోట్ల నిధులతో అభివృద్ధిపరిచి గాజువాక ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచిందని, ఈ క్రీడా ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, నిత్యం వినియోగించుకుంటూ ఆరోగ్య పరిరక్షణకు అందరూ దోహదపడాలని మేయర్ తెలిపారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం శ్రీభరత్ మాట్లాడుతూ ఇటువంటి మంచి స్టేడియం గాజువాక ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉన్నందుకు ఆనందం వ్యక్త పరుస్తూ , ఈ ప్రాంగణంలో త్వరలో పికిల్ బాల్ కోర్టు కూడా ఇక్కడ ఏర్పాటు చేయాలని మేయర్ కు సూచించారు. సమాజంలో ప్రజలు సెల్ ఫోన్‌కు అంకితమైపోయి నడకకు, వ్యాయామానికి, మానసిక ప్రశాంతత కు,ఆరోగ్య రక్షణకు, శారీరక శ్రమకు దూరమైపోయి అనారోగ్యానికి గురవుతున్నారని , ఇకపై ఇటువంటి క్రీడా ప్రాంగణంలో మానసిక ఉల్లాసంతో ,శారీరక శ్రమతో క్రీడలను అలవరచుకుంటూ, తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలపై ప్రోత్సాహాన్ని చూపించాలని, ఆరోగ్యానికి క్రీడలు చాలా దోహదపడతాయన్నారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ క్రీడా ప్రాంగణం ప్రారంభ కర్త మాజీ మేయర్ పులుసు జనార్దనరావు అని గుర్తు చేస్తూ, మరలా ఈ క్రీడా ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి పరిచి ప్రజలకు అందించినందుకు మేయర్ కు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల కొరకు అత్యాధునిక వసతులతో క్రీడా సదుపాయాలు కనిపిస్తుందని చెప్పారు.అనంతరం 65 వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహం పాత్రుడు మాట్లాడారు.

# హాస్టళ్లకు సరుకుల సరఫరా దళితులకే కేటాయించాలి

## విదసం కన్వీనర్ డాక్టర్ బూసి డిమాండ్

**విశాఖపట్నం, రేపటి కోసం:** రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో నడిచే వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి , పంచాయితీ రాజ్, మంచి నీటి సరఫరా, విద్యుత్ ప్రాజెక్టులు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల కు అవసరమయ్యే సరుకుల సరఫరా టెండర్లు దళితులకే కేటాయించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండు చేశారు.

అంబేద్కర్ భవన్‌లో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో మంగళవారం ఉదయం వెంకటరావు మాట్లాడుతూ 25 - 26 బడ్జెట్లో ఎస్సీ సబ్ ప్లాన్ 20,281 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని దీనిలో స్కూల్ ఫీజులు, అమ్మవడి, సామాజిక పెన్షన్ వంటి డి బీ టి పద్దుకు 9 వేల కోట్లు కేటాయించి మిగిలిన 11 వేల కోట్ల లో వివిధ శాఖల ద్వారా ఎస్సీల కోసం చేపట్టే ప్రాజెక్టులు వ్యవసాయ శాఖకు 1289 కోట్లు, గ్రామీణ దళితుల అభివృద్ధి కీ 1,144 కోట్లు, ఎస్సీల ఇళ్ల నిర్మాణానికి 1257 కోట్లు , రేషన్ పంపిణీకి 1118 కోట్లు, దళితుల ఆరోగ్యానికి 1500 కోట్లు, మంచినీటికి 562 కోట్లు, దళిత వాడల్లో అంగన్వాడీ కి 372 కోట్లు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల ఆహారానికి కూడా నిధులు కేటాయించారని ఇవన్నీ సబ్ ప్లాన్ నిధులే అయినప్పటికీ వాటిని ఖర్చు చేసే ప్రాజెక్టులు ఏవీ కూడా దళితుల చేతుల్లో లేవని ఆవేధన వ్యక్తం చేసారు.. మా నిధులతో మా ఇళ్ల ముందు వేసే రోడ్లు, నేటి ట్యాంకులు, పైపుల నిర్మాణ



టెండర్లు , ఇళ్ల నిర్మాణం, విద్యుత్ లైన్ల నిర్మాణం దళితులకే ఇవ్వాలని డిమాండు చేసారు..

రాష్ట్రంలో ఉన్న 750 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 50 రెసిడెన్షియల్ స్కూళ్ల లో ఉన్న లక్షా నాలుగు వేల మంది విద్యార్థులకు బోజన సరుకులు పప్పులు, నూనెలు, కూరగాయలు, గుడ్లు, మాంసం సరఫరా నిమిత్తం కాంట్రాక్టర్లకు ప్రభుత్వం 150 కోట్లు చెల్లిస్తుందని ఈ సరఫరా దారుల్లో ఒక్కడు కూడా దళితుడు లేదని .. ఈ టెండర్లు అన్ని దళిత నిరుద్యోగ యువకులకు మాత్రమే కేటాయించాలన్నారు .రాష్ట్రంలో దళిత వాడల్లో 12 వేల అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని వాటికి గుడ్లు, చెక్కీలు, పప్పులు నూనెలు సరఫరాకు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులనుండి 150 కొట్లు కేటాయిస్తే ఆ కాంట్రాక్టు కూడా అగ్రకులాల చేతుల్లో ఉన్నాయని అంగన్వాడీ లకు సరుకులు సరఫరా టెండర్లు ఎస్సీలకు ఇస్తే 600 నుండి 1000 కుటుంబాలకు జీవనోపాధి కల్పించ వచ్చని అన్నారు..

జాజి ఓంకార్ మాట్లాడుతూ, పంచాయితీ రాజ్ , వ్యవసాయ శాఖ , వైద్య ఆరోగ్య శాఖ , విద్యా శాఖ, విద్యుత్ శాఖ లలో సబ్ ప్లాన్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు కాంటాక్టులు దళితులకు కేటాయిస్తే వేల దళిత కుటుంబాలు ఆర్థికంగా పురోగమిస్తాయని ఇవన్నీ కేవలం 7 వేల కోట్ల ఎస్సీ నిధులతోనే ఎస్సీ కాంట్రాక్టులను తయారు చేందుకు , దళితుల సంపద సృష్టికి ఇదొక కొత్త ప్రణాళిక అన్నారు.. కూటమి సర్కారు ఈ దిశగా ఆలోచించి సబ్ ప్లాన్ సక్రమ వినియోగానికి శ్రీకారం చుట్టాలని సూచించారు . ఈ కార్యక్రమంలో సోడా దాసి సుధాకర్, బూల భాస్కర రావు, గుడివాడ ప్రసాద్, కే చిన్నా రావు, డి నిర్మల, రవి శేఖర . సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు

## పుష్పగిరిలో పురాతన శ్రీమృత్యుంజయస్వామి విగ్రహం గుర్తింపు

కడప బ్యూరో రేపటి కోసం



కడప జిల్లా వల్లూరు మండలం లోని అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ అయిన పంచమనది పుణ్యక్షేత్రం పుష్పగిరి లో శ్రీ వైద్యనాథ స్వామి దేవాలయం కు అతి సమీపంలోని పురాతనమైన శ్రీ మృత్యుంజయ స్వామి విగ్రహం ఉండటాన్ని గుర్తించినట్లు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మంగళవారం మీడియాకు తెలిపారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం కొండ నుంచి ఖాజీపేటకు వెళ్లే రహదారిలో చింతలపత్తూరుకు అతి సమీపంలో ఓ దుర్గ గుడి ఉండేదన్నారు. ఆ గుడి ప్రాంగణంలో బహిర్గతంగా సుమారు 15 సంవత్సరాల క్రితం ఒక శివుని విగ్రహం పానమట్టం ఉండేవని తెలిపారు. వాటిని పుష్పగిరి ప్రాంతానికి చెందిన కురుమద్ది రమణమూర్తి, గ్రామస్తులు కట్టెపుల్లలు తెచ్చుకోవడానికి వెళ్లిన సమయంలో రమణమూర్తి ఆ విగ్రహాన్ని, పానమట్టం కనుగొని అక్కడి నుంచి శ్రీ వైద్య నాదస్వామీ ఆలయం కు సమీపంలో ఉండే పాతాళ గణపతి ఆలయ ప్రాంగణంలోకి చేర్చి ఆ విగ్రహానికి రమణమూర్తి మృత్యుంజయ స్వామి అని పేరు పెట్టినట్లు రచయిత వివరించారు. విగ్రహం విషయాల గురించి రమణమూర్తి బంధువు రాజేష్ తనకు చెప్పారని రచయిత వెల్లడించారు. దీనిపై మరింత పరిశోధన చేయనున్నట్లు రచయిత తెలిపారు.

## జగన్ ట్వీట్లన్నీ అవాస్తవాలే

**బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్**

అమరావతి, రేపటి కోసం



ఆర్థిక పరిపాలన గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని, ఆయనకు ఆర్థిక నిర్వహణపై ఏమి తెలుస్తుందని ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలయపాలెం విజయ్ కుమార్ విమర్శించారు. మంగళ వారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...జగన్ వరుసగా నాలుగు ఐదు ట్వీట్లు చేశారు. వాటిలో ఒక్కటి కూడా వాస్తవం లేదన్నారు. వైసిపి తమ ఐదేళ్ల పాలనలో ఆర్థిక రంగాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశామని భ్రమలో ఉన్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పది నెలల్లో అప్పులు చేస్తోందన్న ఆరోపణల్లో అసలు ఆధారాలేమీ లేవని తెలిపారు. "ఒక్కో ట్వీట్‌కు నిజమైన సమాధానం ఇస్తాం" అని చెబుతూ, టీడీపీ కూటమి ప్రభుత్వం ఆర్థిక పరిపాలనను సమర్థవంతంగా నడుపుతోందని స్పష్టం చేశారు. వైసిపి ట్వీట్లు చేసే ముందు ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ కాలంలో జీఎస్‌డీపీకి సగటు లోటు నిష్పత్తి 4.08%గా ఉండగా, టిడిపి కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలో 5.12%కి పెరిగిందన్న వాదన పూర్తిగా అవాస్తవం అని చెప్పారు. రెండు నెలల్లో రూ.22 వేల కోట్లు అప్పులు చేసింది వైసీపీ ప్రభుత్వం కాదా? దీనిపై సమాధానం చెప్పాలని విజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## రౌడీ మూకలకు జగన్ పరామర్శ సిగ్గుచేటు

**టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్**

అమరావతి, రేపటి కోసం

గంజాయి అమ్మే రౌడీ ముకలను పరామర్శించేందుకు తెనాలి వెళ్లిన జగన్ సిగ్గుపడాలని టీడీపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు అమరావతిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సంఘవిద్రోహ శక్తులు అని తెలిసి జగన్ తెనాలి వెళ్లి క్రిమినల్స్ ను పరామర్శించడం దుర్మార్గం అన్నారు. గంజాయి ముఠాను పరమర్శించడం గంజాయి బ్యాచ్ జగన్ ప్రోత్సహిస్తున్నారా ఆయన ప్రశ్నించారు. జగన్ పాదంలో ఎంతో మంది మహిళలపై అత్యాచారాలు హత్యలు జరిగాయని వారిని జగన్ ఎందుకు పరామర్శించలేదన్నారు. శవం కనబడితే చాలు వైసిపి నాయకులు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం, ఉనికిని చాటు కోవడం కోసమే జగన్ రౌడీమూకలకు కొమ్ము కాస్తున్నారని ధ్వజమెత్తారు.

## రాక్షస పాలన అంతమై ఏడాది

**జనసేన నేత మాదాసు మురళి**



ప్రొద్దుటూరు (కడప జిల్లా), రేపటి కోసం

ఏపీలో రాక్షస పాలన, రౌడీయిజం అంతమై ఏడాది పూర్తయిందని జనసేన పార్టీ నాయకులు మాదాసు మురళి పేర్కొన్నారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రజలు సంక్రాంతి దీపావళి ఏ విధంగా పండుగలు జరుపుకుంటామో ఒకేరోజు రెండు పండగలు జరుపుకునేంత ఆనందంగా సంవత్సరం పాలన సాగిందని ఆనందం వ్యక్తం చేశారు. రాక్షస పాలన అంతమై ఏడాది అయిన సందర్భంగా జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతి ఇంట సంక్రాంతి రోజు ఏ విధంగా ముగ్గులు వేసుకొని ఇల్లు అలంకరించుకుంటామో అలా ప్రతి ఒక్క ఇంటి ని ముగ్గులు వేసి అలంకరించుకోవాలని పిలుపుచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రొద్దుటూరు వీర మహిళలు, జన సైనికులు, కూటమి సభ్యులు నిర్వహించి సోషల్ మీడియాలో అప్లోడ్ చేయాలని కోరారు. నాయకులు రామయ్య రాయల్, సంజీవ, హరీష్ కుమార్, కేశవ, రమణ, చంద్ర పాల్గొన్నారు.

## దోమల పై అప్రమత్తత అవసరం

బ్రహ్మంగారిమఠం(కడప జిల్లా), రేపటి కోసం



దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిహెచ్ఓ సాంబశివారెడ్డి సూచించారు. మంగళవారం బ్రహ్మంగారిమఠం పిహెచ్‌సిలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ రాబోవు వర్షాకాలంలో దోమల బెడద ఉన్నందున గ్రామంలోని ప్రజలు మలేరియా, డెంగ్యూ రాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ నరసింహారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రవణమ్మ, హెల్త్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వెన్నుపోట్లు, గొడ్డలివేట్లు జగన్ కే చెల్లు

**టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి ధ్వజం**

అమరావతి, రేపటి కోసం



వెన్నుపోట్లు, గొడ్డలివేట్లు జగన్ కే చెల్లు అని పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 2024 జూన్ 4 లో టీడీపీ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. దీంతో రేపటితో సంవత్సరం కాబోతోందన్నారు. అదే రోజు వెన్నుపోటు దినమంటూ జగన్ ఒక కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. వరు ఎవర్ని వెన్నుపోటు పొడిచారో చెప్పాలంటే చాలా ఉంది. వైఎస్ ఫ్యామిలీ వెన్నుపోట్లకు పేటెంట్ రైట్ గా తీసుకొందని ధ్వజమెత్తారు. గొడ్డలిపోట్లు జగన్ కే చెల్లు..ఇవన్నీ చూస్తుంటే దొంగే దొంగ దొంగ అని అరచినట్లుందన్నారు. వెన్నుపోట్లు జగన్ నాన్న, తాత కాలం నుండి ప్రారంభమయ్యాయని తెలిపారు. జగన్ తాత రాజారెడ్డి వెంకట నరసయ్య అనే వ్యక్తి వద్ద మంగంపేట మైన్స్ లో పనిచేసేవాడని..యజమానినే హత్య చేసి మంగంపేట మైన్స్ ను లాక్కున్నది వెన్నుపోటు కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అంతపెద్ద పొజిషన్ ఇస్తే అప్పటి ప్రధాని పీవీ నరసింహరావుపై చెప్పులు వేయించారని..ఇది వెన్నుపోటు కాదా? అని ప్రశ్నించారు. జగన్.. తన చెల్లెలి ఆస్తులు లాక్కొని ఆమెను నడిరోడ్డుపై వదిలేయడం వెన్నుపోటు కాదా? అని ప్రశ్నలు సంధించారు. జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డిని హత్య చేసినవారు యథేచ్ఛగా తిరుగుతుంటే వారిని రక్షించిన వ్యక్తి జగన్ అని ఆరోపించారు. అన్ని రకాలుగా వ్యక్తి గతంగా వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్ ది అని..5 సంవత్సరాలపాటు అధికారం ఇస్తే ప్రజల్ని వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకుం టోందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 70 శాతం హామీలు అమలు చేసిందని ఆయన వివరించారు.

# బొబ్బిలి గ్రోత్ సెంటర్ అభివృద్ధికి వినతి

బొబ్బిలి (విజయనగరం), రేపటి కోసం



బొబ్బిలి గ్రోత్ సెంటర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి టి. జి. భరత్‌ను, మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు కోరారు. విజయవాడలో మంత్రిలో ఆయన భేటీ అయ్యారు. విజయనగరం జిల్లాలో పరిశ్రమల స్థితిగతులను, పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను మంత్రికి వివరించారు. ప్రధానంగా బొబ్బిలి గ్రోత్ సెంటర్ అభివృద్ధిపై చర్చించారు. ప్రస్తుతం బొబ్బిలి గ్రోత్ సెంటర్ లో ఉన్న అనుకూల వసతులను మంత్రికి సుజయ్ తెలిపారు. గతంలో భూములు పొంది కాలయాపన చేస్తున్న యాజమాన్యాలను గుర్తించి వారితో కుదుర్చుకున ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. పరిశ్రమలు స్థాపించకుండా విలువైన పారిశ్రామిక వాడను నిర్వీర్యం చేస్తున్నారని సదరు యాజమాన్యాలను సహించొద్దని మంత్రికి తెలిపారు. అనేక మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు గ్రోత్ సెంటర్ లో పరిశ్రమలు పెట్టేందుకు తనను సంప్రదిస్తున్నారని వారికి భూములు ఇవ్వాలని మంత్రిని సుజయ్ కోరారు. అతిత్వరలో విజయనగరం జిల్లాలో పర్యటించాలని ఆహ్వానించారు. అనంతరం మంత్రికి సుజయ్ వినతి పత్రాన్ని అందజేశారు. సుజయ్ కృష్ణ రంగా రావు అభ్యర్థనపై మంత్రి సానుకూలంగా స్పందించారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్ తాజా పరిస్థితులపై సమగ్ర సమాచారం అందజేయాలని ఆదేశించారు. తమ అభ్యర్థనపై మంత్రి భరత్ ను కలిసి తమను ప్రోత్సహిస్తున్న సుజయ్‌కు పారిశ్రామిక వేత్తలు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో బొబ్బిలి గ్రోత్ సెంటర్ అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# భూకబ్జాలు, దౌర్జన్యాలపై వినతుల వెల్లువ

అమరావతి, రేపటి కోసం



చినతోపు గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ లేబూరు మల్లిఖార్జున తన అవసరాల నిమిత్తం రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నారని, ఆ డబ్బును తిరిగి అడిగినందుకు అర్ధరాత్రి సమయంలో తన ఇద్దరు కొడుకులతో కలిసి తమ ఇంటికి వచ్చి తనపై దాడి చేశారని నెల్లూరు టౌన్‌కు చెందిన జి.సంధ్య టీడీపీ ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో తన గోడును వెళ్లగక్కారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్‌లకు ఆమె అర్జీ ఇచ్చారు. తనకు న్యాయం చేయడంతోపాటు, మల్లిఖార్జున వద్ద నుండి రావాల్సిన డబ్బు తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

గ్రామంలోని కొంతమంది రోడ్డును ఆక్రమించారని, ఆ విషయాన్ని ప్రశ్నించినందుకు తన కొడుకును, అల్లుడిని బెదిరిస్తున్నారని, తమపై తప్పుడు కేసులు పెట్టి దాడులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకొని తమకు న్యాయం అనకాపల్లి జిల్లా, యస్. రాయవరం మండలం, పిట్లపాలెం గ్రామానికి చెందిన పోలరౌతు రామునాయుడు చేయాలని కోరారు.

తాను తెలుగుదేశం పార్టీ కార్యకర్త అయిన కారణంగా, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న ఇంటికి సంబంధించిన బిల్లులను ఆపేసి తీవ్రమైన ఇబ్బందికి గురిచేశారని ఈ ప్రభుత్వంలో తనకు న్యాయం చేయాలని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గురిజేపల్లి గ్రామానికి చెందిన లింగాల జయలక్ష్మీ విజ్ఞప్తి చేశారు.

1978లో ఉన్న భూమికి సంబంధించిన పట్టా ఇంటి నిర్మాణ సమయంలో మిస్ అయిందని ఆ భూమికి పట్టా మంజూరు చేయాలని నేతల్ని తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం లోకమాతపురం గ్రామానికి చెందిన కె. మైలమ్మ కోరారు.

తన మామగారు కానుకగా ఇచ్చిన భూమిని మైదు హరిబాబు ఆక్రమించారని, ఆ భూమిని తిరిగి పొందేందుకు అధికారులు, నేతలు సహకరించాలని కాకినాడ రూరల్ మండలం చొల్లంగిపేటకు చెందిన అయిల నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు.

తన కుమారైకి, అల్లుడితో విడాకులైన 5 ఏళ్లు అయినప్పటికీ, కోర్టు ఆదేశించిన మెయింటెనెన్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని కృష్ణా జిల్లా గుడివాడ మండలం బేతవోలు గ్రామానికి చెందిన గుర్రాల సుబ్బారావు చెప్పారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తన పేరిట ఉన్న 4 సెంట్ల భూమిని అధికారులు ఆన్లైన్ రికార్డుల నుంచి తొలగించారని, తిరిగి తన పేరుతో నమోదు చేయించాలంటూ కర్నూలు జిల్లా నందవరం మండలం, మెట్టసోమాపురం గ్రామానికి చెందిన ఈ. ఉరుకందు గౌడ్ ఫిర్యాదు చేశారు.

# గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా చర్చ జరగాలి

**ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**

తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా), రేపటి కోసం



గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా, ప్రజల సమస్యలే అజెండాగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పి.శేషులత అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి గురువారానికి ఏడాదిగా కావస్తుందని ఇప్పటివరకు నియోజకవర్గంలో రోడ్లు నిర్మాణంతో పాటు గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ప్రజా ప్రయోజనకర నిర్మాణాలను పునర్నిర్మించామన్నారు. ప్రజలు ఉచితాలను కోరుకోవడం లేదనేది గత ఎన్నికల్లో తేటతెల్లమైందని ప్రజలకు ఉపాధి అవకాశాలు చూపించి ఉద్యోగాలు కల్పించాలి తప్ప వారిని ఉచితలకు అలవాటు చేయకూడదనేది తన సిద్ధాంతం అన్నారు. అయినా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో ప్రజలకు ఏది అవసరం అది నూరు శాతం చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఎవరైనా అధికారుల వల్ల గాని నాయకులు వల్ల గాని ఇబ్బంది పడితే నిర్మొహమాటంగా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, వైస్ ఎంపీపీ సూర్పన రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

# వైసిపి పాలనలో ప్రజలకు తీరని ద్రోహం

**నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.హేమంత్ కుమార్**

విశాఖపట్నం, రేపటి కోసం



జూన్ 4న ధర్నాలు నిర్వహించే ముందు, మీ ఐదు సంవత్సరాల పనితీరు ప్రజలకు ద్రోహం చేయలేదని బహిరంగ చర్చ ద్వారా నిరూపించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.హేమంత్ కుమార్ డిమాడ్ చేశారరు. మంగళవారం విశాఖలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, 2019 ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగులకు, స్థానిక ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, కానీ వాటిని నెరవేర్చడానికి బదులుగా, మిమ్మల్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టారని అన్నారని గుర్తు చేశారు. కష్టపడి పనిచేసి, అంకితభావంతో పనిచేసే పోలీసు సిబ్బందికి సకాలంలో లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వకపోవడం ద్రోహం కాదా? ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని మీరు నెరవేర్చారా? అని ప్రశ్నించారు. మీరు ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. మీరు డిజిటల్‌ప్రతి గ్రామ సచివాలయంలో లైబ్రరీలు ఏర్పాటు చేసి లైబ్రరీ ఉద్యోగాలను భర్తీ చేశారా? అని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం పోలీసు అమరవీరుల దినోత్సవం నాడు మీరు 6,500 పోలీసు ఉద్యోగాలను భర్తీ చేస్తారా? మీరు టిటిడి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగాలకు దరఖాస్తులు తీసుకున్నారు కానీ పరీక్షలు నిర్వహించారా? అని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయాలలో గెస్ట్ ఫ్యాకల్టీని రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు కానీ వారిని ఉద్యోగాల నుండి తొలగించారని చెప్పారు.

## ఎడ్ల బండ లాగుడు పోటీలు ప్రారంభం



బ్రహ్మంగారిమఠం (కడప జిల్లా),రేపటికోసం

మండల పరిధిలోని పలుగురాళ్లపల్లెలో వేళంగిణి మాత ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలను టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ప్రారంభించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సొంత పంచాయతీ పలుగురాళ్లపల్లె లోని వేళాంగిణి మాత ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలను చుట్టుపక్కల ప్రాంత ప్రజలు వచ్చి ఆసక్తిగా తిలకించారు. అనంతరం సుబ్బారెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో లగసాని వీరయ్య, పూజా శివయ్య యాదవ్, రిటైర్డ్ వార్డెన్ ప్రభాకర్, మేకల సుధాకర్ యాదవ్, పలుగురాళ్లపల్లె సర్పంచ్ పాల్గొన్నారు.

## జవాన్ రఫీకి ఘన సన్మానం



దువ్వూరు (కడప జిల్లా) రేపటి కోసం

మండల కేంద్రమైన దువ్వూరు కు చెందిన వీర సైనికుడు షేక్ మహమ్మద్ రఫీ మంగళవారం ఉదయం మైదుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేసుల శివ ప్రసాద్ ఘనంగా సన్మానం చేశారు. అడ్వకేట్ ఇమామ్ భాష కుమారుడు షేక్ మహమ్మద్ రఫీ భారత్-పాకిస్తాన్ యుద్ధం లో పూంచ్ సెక్టర్ సమీపంలో యుద్ధంలో పాల్గొన్న భారత్ జవాన్ అని శివప్రసాద్ కొనియాడారు. వీర జవాన్ రఫీ మాట్లాడుతూ తనకు దేశ సేవ యుద్ధం ద్వారా లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అడ్వకేట్ సోమేసుల యశ్వంత్ రాయల్, మాజీ సైనికుడు అంద్రోతు రామచంద్రుడు, ముఖంది వేంకటరమణ, చవాన్ ఠాకూర్ హనుమాన్ సింగ్, లా స్టూడెంట్ వి. దేవకుమార్ పాల్గొన్నారు.

## 'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ



వేముల (కడప జిల్లా), రేపటి కోసం

వేముల గ్రామంలో మంగళవారం జూన్ 4న వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' పోస్టర్ ను వైసిపి మండలం కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి కోకాటం వెంకట బయపురెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా వెంకటనారాయణ, మండల నాయకుడు హేమాద్రి,కో ఆప్షన్ సభ్యులు మండి మాఫిర, వైసిపి నియోజవర్గం వికలాంగుల అధ్యక్షుడు చాగలేటి భాస్కర పాల్గొన్నారు.

## టిడిపిలోకి వైసిపి ఎంపీపీ ?

బ్రహ్మంగారిమఠం(కడపజిల్లా), రేపటికోసం

బ్రహ్మంగారిమఠం ఎంపీపీ, వైసిపి సీనియర్ నేత వీరనారాయణరెడ్డి టిడిపిలోకి వెళుతున్నారని ఈ మధ్య స్థానికుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో మండల వైసిపిలో ముసలం ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంద. ఇటీవల మాజీ ఎమ్మెల్యే రఘురాం రెడ్డి ఆధ్వరంలో నిర్వహించిన సమావేశానికి వీరనారాయణరెడ్డి గైర్హాజరుతో స్థానికుల్లో కొంత అనుమానం రేకెత్తిస్తుంది. దీంతో వైసిపి ఆధ్వర్యంలో బుధవారం జరగనున్న వెన్నుపోటు దినం నిరసన, ర్యాలీ కార్యక్రమాలకు బి.మఠంలో ముందుండి నడిపించే నాయకుడు ఎవరా అని వైసిపి శ్రేణలు చర్చించుకుటున్నాయి.

## 'వెన్నుపోటు దినం' నిరసనకు తరలి రావాలి

**మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి**

బ్రహ్మంగారిమఠం (కడప జిల్లా), రేపటి కోసం

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఎన్నికల సందర్భంలో చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం మైదుకూరులో నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9.00 గంటలకు మైదుకూరులోని వనిపెంట రోడ్డులోని అంకాలమ్మ గుడి వద్దకు చేరుకుని, అక్కడి నుండి ర్యాలీగా కడప రోడ్డులోని ఎమ్మార్వో అందజేస్తామని తెలిపారు. మైదుకూరు నియోజకవర్గ వైసిపి శ్రేణులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కరోనా నివారణకు జాగ్రత్తలు అవసరం

ద్వారకాతిరుమల (ఏలూరు జిల్లా), రేపటి కోసం



మండలంలో ప్రస్తుతం కరోనా పాజిటివ్ కేసులు ఎక్కడ లేవని మండల ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో ప్రతినిత్యం వేలాదిగా భక్తులు ఇక్కడ వస్తారని ఆలయ సంబంధిత ఉద్యోగులు, వ్యాపారస్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని అన్నారు. జ్వరం లేదా చలి, అలసట, గొంతు నొప్పి, రుచి వాసన కోల్పోవడం, వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా స్థానిక ప్రభుత్వాసుపత్రి సిబ్బందిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

## సంపాదకీయం


# సరిహద్దు ప్రజలకు కేంద్రం భరోసా

పాకిస్తాన్ ఇటీవల జరిపిన దాడులతో జమ్మూకశ్మీర్లో ముఖ్యంగా పూంచ్ జిల్లాలోని ఇళ్లు, దుకాణాలు, ప్రార్థనా మందిరాలు తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ధ్వంసమైన ఈ నివాసాలను పునరుద్ధరించుకోడానికి కేంద్రం త్వరలో పరిహార ప్యాకేజీని ప్రకటిస్తుందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రకటించడం సరిహద్దు నివాసాల ప్రజల్లో ఆశాకిరణం ఉదయించింది. పుంచ్‌ల్లోని బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. పాక్ ఎలాంటి దాడులు చేసినా సరిహద్దు ల్లోని ప్రజలే మొదట గురవుతున్నారన్న విషయాన్ని కేంద్రమంత్రి అమిత్ షా సరిగ్గానే గుర్తించారు. సరిహద్దు వెంబడి గత పదేళ్లలో ఇప్పటిదాకా 0500కు పైగా బంకర్లు నిర్మించామని, పాక్తో సంఘర్షణల సమయంలో మూడు రోజులపాటు స్థానికులకు రక్షణ కల్పించడంలో ఇవి కీలకపాత్ర పోషించాయ న్నారు. సరిహద్దుల్లో నివసించే ప్రజలకు పాక్ దాడులనుంచి రక్షణ కోసం అండర్ గ్రౌండ్ షెల్టర్లు భారీ స్థాయిలో నిర్మించడానికి కేంద్రం యోచిస్తోంది. జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఈ నష్టాలను అంచనా వేసే ప్రక్రియలో ఉంది. పూంచ్ జిల్లాకు జరిగిన కష్టనష్టాలపై బిజెపి నియమించిన కమిటీ హెూం మంత్రిత్వశాఖకు ప్రాథమిక నివేదిక సమర్పించింది. పాక్ బాంబుల దాడికి పూంచ్లో 600, యురిలో 534 మొత్తం 1500 ఇళ్లు ధ్వంసం అయ్యాయని, మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోగా, ఒక్క పూంచ్లోనే 14 మంది మృతి చెందారని నివేదికలో పేర్కొంది. పూంచ్, బారాముల్లా, కుప్వారా, రాజౌరీప్రాంతాల్లోని పట్టణాలపై పాక్ బాంబుల దాడులు జరిగాయి. పౌరుల కనీస మౌలిక సౌకర్యాలు బాగా దెబ్బతిన్నాయి. శుక్రవారం అమిత్ షా ఈ బాధిత ప్రాంతాలన్నీ పర్యటించి ప్రజలకు సంఘీభావం తెలిపారు. మృతుల కుటుం బాలకు చెందిన వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అంతకు ముందు లోక్సభ విపక్ష నాయకుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తృణ మూల్ కాంగ్రెస్ ప్రతినిధులు బాధితులను పరామర్శించారు. ఈ విధంగా ప్రభుత్వంనుంచి, విపక్షాలనుంచి ప్రతినిధులు వచ్చి భరోసా ఇవ్వడంతో కొంతవరకు తమకు నిబ్బరం కలిగినట్టు సరిహద్దులోని ప్రజలు భావిస్తు న్నారు. అలాగే భారత్- పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణకు ఎలాంటి గడువు తేదీ లేదని భారత్ ఆర్మీ ప్రకటించడం మరింత నిబ్బరం కలిగించింది. పాక్ బాంబు దాడులకు చెల్లాచెదురైన సరిహద్దులోని ప్రజలు తమ నివాసా లకు తిరిగి క్రమంగా చేరుకొంటున్నారు. జీవితాలు సాధారణ స్థితికి వస్తు న్నాయి, బాధిత కుటుంబాల డిమాండ్లను నెరవేర్చడానికి జమ్మూకశ్మీర్ ప్రభుత్వం సతమతమవుతోంది. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.1.2 లక్షల వంతున సహాయం అందించడానికి ప్రయత్నిస్తోంది. అయితే ధ్వంసమైన తను కాంక్రీట్, బహుళ అంతస్తుల భవనాలను తిరిగి నిర్మించుకోడానికి ఈ మొత్తం ఏమాత్రం సరిపోదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆందోళన నెలకొన్న సమయంలో అమిత్ షా రిలీఫ్ ప్యాకేజీ విషయంలో ఇచ్చిన హామీ బాధితులకు ఆశాకిరణంలా కనిపించింది. మొత్తం 9500 బంక ర్లలో జమ్మూ డివిజన్లో 8000, కశ్మీర్ వ్యాలీలో 1500లను కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు నిర్మించడం గమనార్హం. అయితే ముఖ్యంగా కశ్మీర్ లోయలో చాలా తక్కువగా ఉన్న జనావాస ప్రాంతాల్లో ఆకస్మాత్తుగా పాక్ బాంబుల దాడి జరిగితే తక్షణం సురక్షిత స్థావరాలకు చేరుకోవడానికి వీలుగా వ్యక్తిగత బంకర్లు నిర్మించాలన్న డిమాండ్ బాగా వినిపిస్తోంది. పహ ంలో పాక్ వత్తాసుతో ఉగ్రవాదుల దాడి జరిగిన తరువాత ఆపరేషన్ సిందూర్ తో భారత్ బలగాలు గట్టిగానే దాయాదికి బుద్ధి చెప్పాయి. అయితే దీంతో నిబ్బరం పనికిరాదు. పాకిస్తాను అన్నివిధాలా అండదండలు అందిం చడానికి చైనా సంసిద్ధమవుతోంది. అయిదోతరం స్టెల్త్ ఫైటర్ జెట్లను నలభై వరకు చైనా పాకిస్తాన్కు అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు బంగ్లాదేశ్ కూడా చైనా సాయం కోరుతోంది. సరిహద్దుల్లో పొంచి ఉన్న ఈ ముప్పును బలంగా ఎదుర్కోవడానికి భారత్ నిరంతరం అప్రమత్తం కావ లసిన సమయం ఏర్పడింది. రణవ్యూహాలే కాదు, దానికి తగిన అత్యంత ఆధు నిక ఆయుధాలను సమకూర్చుకోవడంలో వెనుకబడరాదు, అత్యాధునిక యుద్ధవిమానాలు మనకు తగినంత లేనందున వాయుసేన పోరాటంపై ఆమె రకు ప్రభావం చూపుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆయుధాల ఒప్పందాలు కుదిరి ఏళ్లు గడుస్తున్నా సమయానికి ఆయుధాలు సరఫరా కావడం లేదని సాక్షాత్తు ఎయిర్ చీఫ్ మార్షల్ (ఎసీసీఎం) అమర్ ప్రీత్ సింగ్ ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ సమక్షంలోనే ఆందోళన వ్యక్తం చేశారంటే రక్షణ ఆయుధాల సంపత్తిలో మనం ఏ స్థితిలో ఉన్నామో ఆలోచిం చాల్సిందే.

ఉదాహరణకు తేజస్ ఫైటర్ జెట్ల కోసం 1984 లోనే సన్నాహాలు జరిగితే, 2016 నాటికి వాయుసేనకు తొలిసారి తేజస్ సమకూరింది. ఇజ్రా యెల్, అమెరికా దేశాలు తమ దేశాల భద్రతకు గగనతలం లోనే ఇనుప గోడలు కట్టుకుంటున్న చర్యలను గమనించాలి. చైనా, పాకిస్థాన్ దేశాల వారి నుంచి మనం రక్షించుకోవాలంటే మన వైమానిక దళంలో కనీసం 42 స్క్వాడ్రన్లు ఉండాలని రక్షణ రంగ అధికార యంత్రాంగా అంచనాగా సూచి స్తోంది. ఒక్కో స్క్వాడ్రన్లో 18 వరకు యుద్ధ విమానాలు ఉంటాయి. ఇప్పుడు మనకు 31 స్క్వాడ్రనే అందుబాటులో ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుత అవసరాలకు తగినట్టు ఆయుధాల సమీకరణలో ప్రభుత్వం జాప్యం లేకుండా ముందుచూపుతో వ్యవహరించడం అవసరం.

## ఆరోగ్యదీపిక

### మీ ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా దెబ్బతీస్తున్న మహమ్మారి..



పొగాకు వాడకం గుండె జబ్బులకు ప్రధాన కారణం. కనిపించే లక్షణాలు రాకముందే ఇది గుండెకు నిశ్శబ్దంగా నష్టం కలిగిస్తుంది. ఈ హాని గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. అయితే, పొగాకు వాడకం మానేయడం వల్ల ఈ ప్రమాదాలు తగ్గించుకోవచ్చు. పొగాకు, అందులోని రసాయనాలు గుండె రక్తనాళాల వ్యవస్థలో అనేక మార్పులను ప్రేరేపిస్తాయి. క్లినికల్ సంకేతాలు కనిపించడానికి సంవత్సరాల ముందుగానే గుండెపోటు లేదా స్ట్రోక్ లాంటి ప్రాణాంతక సమస్యలకు పునాది వేస్తాయి.

పొగాకు పొగ శరీరంలో దీర్ఘకాలిక మంటను ప్రేరేపిస్తుంది. పొగలోని ఆక్సీకరణ రసాయనాలు రక్తనాళాల గోడలపై అడెషన్ అణువుల వ్యక్తీకరణను ప్రభావితం చేస్తాయి. ఇది ప్లేట్‌లెట్స్, తెల్ల రక్త కణాలు ఎండోథీలియంకు అతుక్కునేలా చేస్తుంది. ఇది మంటను పెంచడమే కాకుండా, ఆక్సీకరణ %ాణూ% (తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్) కొలెస్ట్రాల్‌ను రోగనిరోధక కణాలు గ్రహించడాన్ని వేగవంతం చేస్తుంది. వాటిని ఫోమ్ కణాలుగా మారుస్తుంది. ఇది ప్రారంభ అథెరోస్క్లెరోటిక్ ఫలకం ఏర్పడటానికి సంకేతం. కాలక్రమేణా, ఈ ఫలకాలు పెరుగుతాయి, ధమనులు గట్టిపడతాయి. గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశాలు నిశ్శబ్దంగా పెరుగుతాయి.

'రేపటి కోసం' దినపత్రికలో ప్రచురిస్తున్న వ్యాసాలు, వార్తా కథనాలు, విశ్లేషణలు, రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. వాటితో పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. చట్టసంబంధమైన అంశాలు గుంటూరు పరిధిలోనే పరిష్కరించుకోవాలి.
- ఎడిటర్

# జాతి నిర్మాణానికి యువశక్తి కీలకం



జాతి నిర్మాణంలో యువత పాత్ర చాలా కీలకం అన్నది నిర్వివాదాంశం.. నేటి యువతే రేపటి భవిత అంటారు. యువతకు గల శక్తి అంతులేనిది, అపారమైనది. దేశ ఉన్నతికి, ఔన్నత్యానికి ఈ శక్తిని ఫణంగా పెడితే అన్నీ తిరుగులేని విజయాలే ఉంటాయి. వారి విజయాలు వ్యక్తిగతం మాత్రమే కాదు, సామాజికమైనవి. తద్వారా జాతీయం, అంతర్జాతీయం అయినవి. ఈ శక్తి ఎప్పుడూ అనుకూల పథంలో సాగాల్సి ఉంది. యువ శక్తి దేశానికి ఎంత మేలు చేస్తుందో.. గతి తప్పితే అంతకు రెట్టింపు కీడుచేస్తుంది. యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలి. యువత మద్యపానం, దూమపానం, మాదక ద్రవ్యాలు వంటి దురలవాట్లకు బానిసలు కాకుండా ఉండాలి. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. గ్రామాభివృద్ధికి కృషి చేయాలి, యువత ఉద్యోగ అవకాశాలను వినియోగించు కోవాలి. 50 శాతం యువత నేడు ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ ద్వారా అన్వేషించడం చూస్తే ఉద్యోగ వేట తీరు తెన్నులూ మారిపోతున్నాయని తేలుతోంది. అంతేకాదు, రోజూ రవాణా రద్దీలో ఇరుక్కునే కన్నా ఇంటి నుంచి ఆన్‌లైన్‌లో పనిచేయడానికి ఇష్ట పడుతున్నారు. ఐటీ విప్లవం వల్ల కంపెనీలూ దీన్ని నెమ్మదిగా ప్రోత్సహిస్తున్నాయి. పని వేళలను మార్చుకునే సౌలభ్యాన్నీ ఇస్తున్నాయి. భారత్‌లో ఇప్పటికే 43 శాతం ఉద్యోగులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్నారని ఒక సర్వే తెలిపింది. అదే సమయంలో తమకు ఇష్టమైన ఉద్యోగాలను, వేతనాలను పొందగలమనే నమ్మడం యువతలో ఉండటం లేదనీ స్వయంగా రిజర్వు బ్యాంకు అధ్యయనం తెలిపింది. అందుకే భారత్‌లో సంభవిస్తున్నది... ఉపాధి రహిత అభివృద్ధి అని రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. ఈ పరిస్థితిలో యువత ఉద్యోగాన్వేషణ కన్నా సొంత వ్యాపారాలు పెట్టుకోవడం మేలని భావిస్తున్నారు. నేటి తరానికి బాధ్యతలు గుర్తు చేసేందుకు, ప్రభుత్వాలు, యువతకు గల శక్తిని చాటి చెప్పేం దుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతునే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి ఆకాంక్షలకు దన్నుగా వివిధ పథకాలతో ముందుకు వస్తున్నది. వారు ఉద్యోగ వ్యాపారాల్లో రాణించడానికి కావలసిన నైపుణ్యాలను అందించడానికి స్కిల్ ఇండియా కార్యక్ర మాన్ని ప్రకటించింది. కానీ, ఈ పథకాలు ఆచరణలో ఆశించిన ఫలితాలను ఇవ్వలేక పోతున్నాయి. నైపుణ్యాలను తాజా పరచు కోవడానికి, కొత్త నైపుణ్యాలను అలవరచు కోవడానికి, ఈ సహ స్రాబ్ది యువత కృషి చేయక తప్పదు. అందుకు అవసర మైన వసతులను అమర్చడం తమ బాధ్యత అని ప్రభుత్వం, కార్పొ రేట్ రంగం, విద్యా వ్యవస్థలు గుర్తించి కార్యోన్ముఖం కావాలి. రేపటి ప్రపంచంలో రాణించడానికి తగు నైపుణ్యాలను అలవరచు కోవాలి. కాలంతోపాటు తామూ మారుతూ సమయ స్ఫూర్తితో అవకాశాలను అంది పుచ్చుకోవాలి. ఉదాహరణకు ఆటోమేషన్, ఏఐ వల్ల ఐటీ రంగంలో ఉద్యోగాలు తగ్గడంతో ఇంజినీరింగ్, సైన్స్ పట్టభద్రులు డిజిటల్ మార్కెటింగ్ వంటి కొత్తదారులు వెతుక్కుంటున్నారు. సిబ్బంది అంతా ఒకే కార్యాలయంలో లేక కారా? నాలో కలిసి పనిచేసే రోజులు పోతు న్నాయి. మేనేజర్ ఒకచోట ఉండి, వేర్వేరు ప్రాంతాల్లోని సిబ్బం దితో పనిచేయించే రోజులు వచ్చాయి. సామాజిక మాధ్యమాల్లో, స్మార్ట్ ఫోన్లలో మాటామంతీ జరపడంలో ఆరితేరిన నేటి తరం, ఈ తరహా రిమోట్ నిర్వహణలో సులువు గా ఇమిడి పోగలుగుతుంది, ఆశలు, ఆశయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను గుర్తించి, వాటిని అధిగమించడానికి ఆచర ణీయ ప్రణాళికలను చేపట్టడం ప్రభుత్వ విధి. కార్పొరేట్ రంగం కూడా యువ సిబ్బంది ఉద్యోగంలో, జీవితంలో విజేతలుగా ఎదగడానికి తోడ్పడే నిర్వహణ విధానాలను అనుసరించాలి. 21వ శతాబ్దంలో విజయ సాధన అంత తేలిక కాదని యువతరం అనుభవంలో తెలిసి వస్తున్నది. నేడు జీవితంలో రాణించాలంటే ఐఐటీ, ఐఐఎంల వంటి ఉత్కృష్ట విద్యా సంస్థల్లో పట్టభద్రులవక తప్పదనే భావన నెలకొంది. రేపటి కృత్రిమ మేధ యుగంలో భారత్ తరహా బట్టీ చదువులకు స్థానం ఉండదు. అలాంటి చదువులతో చేసే అనవాయితీ పనుల ను మనుషులకన్నా యంత్రాలే అత్యంత సమర్థంగా చేయ గలుగుతాయి. నాలుగో పారిశ్రామిక విప్లవానికి సృజనశీల విద్య చోదకశక్తి కానుంది. ఆ విప్లవంలో అగ్రగాములుగా ఎదగాలంటే అభ్యాస, ఆచరణలను అత్యుత్తమంగా మేళవించాలి. అటువంటి ఉత్తమ గుణ సమ్మేళనం జర్మనీ, ఫిన్లాండ్ వంటి దేశాల విద్యా విధానాల్లో కనిపిస్తున్నది. వాటి నుంచి ఇతర దేశాలు నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మొక్కుబడి చదువులు, బట్టీయం చదువులకు మున్ముందు స్థానం ఉండదు. ఈ వాస్తవాన్ని గుర్తెరిగి విద్యార్థులు చొరవ, సృజన శీలతలను ఇనుమడింప జేసుకోవాలి. వారికి కావలసిన ప్రాతిపదికను తల్లిదండ్రులు, గురువులు, పాలకులు ఏర్పరచాలి. ఆ పని చేసినప్పుడు మాత్రమే యువతరం భారత సామాజిక, ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలుగా నిలబడగలుగుతుంది.

# మైక్రో ఫైనాన్స్ ఆగడాలకు అంతం లేదా...




ఉభయ తెలుగు రాష్ట్రాలలో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు శృతి మించిపోతున్నాయి. గతంలో పలువురు పేద మహిళల ప్రాణాలు బలిగొన్న మైక్రో ఫైనాన్సులు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా పతనం చేస్తూ వారి పాలిట శాపంగా మారిన మైక్రో ఫైనాన్సులను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. తిరిగి పుంజుకున్న మైక్రో ఫైనాన్సులు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పడగ విప్పుతున్నాయి. తీసుకున్న రుణాన్ని ప్రతీ వారం చెల్లించాల్సిన మైక్రోఫైనాన్సుల ఊబిలో పేదవర్గాలు కూరుకుపోతున్నాయి. మరోసారి పాత దుర్ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. సమభావన సంఘాలు, స్త్రీనిధి, ముద్ర తదితర రూపకాల లో ప్రభుత్వం రుణాలను అందిస్తున్నప్పటికీ పలువురు మహిళ లు తక్షణ ఆర్థిక అవసరాల కోసం మైక్రో ఫైనాన్సులను ఆశ్రయిస్తున్నారు. కానీ తిరిగి చెల్లింపులో ఇబ్బందులకు గురవుతూ మానసిక, ఆర్థిక క్షోభకు గురవుతుండగా నెలవారీగా చెల్లించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలను చెల్లించలేకపోతున్నా రు. దీంతో మైక్రో ఫైనాన్సుల ఆగడాలను ప్రారంభం లోనే. నియంత్రించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల చెల్లింపులో మహిళా సంఘాలే అగ్రగామిగా ఉంటున్నాయి. ఏ ఒక్క సభ్యురాలు రుణ వాయిదాల చెల్లింపులో ఆలస్యం చేసినా మిగతా సభ్యులు బాధ్యత వహిస్తూ ఆ మహిళతో రుణ వాయిదా చెల్లింపచేయ డమో లేదా తామే భరించడమో చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాల రికవరి సుమారు 100 శాతంగా ఉంటోంది. దీంతో మహిళల ఆర్థిక అవసరాలు, రుణాల చెల్లింపులో నిజాయితీని అసరాగా చేసుకుంటూ పలు మైక్రోఫైనాన్సులు విజృంభిస్తున్నా యి. ఆర్బీఐ అనుమతులు, నిబంధనల మేరకే మైక్రో రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహిస్తున్నామంటూ మైక్రో ఫైనాన్సుల ఏజెంట్లు పట్టణాలలోని బస్తీలు, గ్రామాల్లో ఇల్లిల్లు తిరుగుతున్నారు. 10 మందితో సంఘాలు ఏర్పాటు చేయించి రుణ మంజూరు తంతును పూర్తిచేసి వారంవారం రుణ వాయిదాలను వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా ఒక్కో సభ్యురాలికి రూ.30వేల మైక్రో రుణం మంజూరు చేస్తూ క్రమేపీ రుణ పరపతిని పెంచుతున్నారు. అంతేకాక ఆస్తులపై మార్టిగేజ్ లోనలు కూడా ఇస్తున్నారు. దీంతో పలువురు మహిళలు సంఘాలుగా ఏర్పడిన స్తోమతకు మించి మైక్రో రుణాలను స్వీకరిస్తూ చెల్లించలేక చతకిలా పడుతున్నారు. రుణ వాయిదా చెల్లించే రోజున ఇంటికి తాళం పెట్టి వెళ్తున్న సందర్భాలు, ఫోనలో అందుబాటులో ఉండవి పరిస్థితులు పెరుగుతున్నాయి. దీంతో సంఘం మిగతా సభ్యులు, మైక్రో ఫైనాన్స ప్రతినిధులు సభ్యురాళ్ల ఇంటి ముందు గొడవలు చేస్తున్నారు. గతంలో రుణ గ్రహీతలు అయిన సభ్యురాళ్లు మరణిస్తే రుణ చెల్లింపు జరిపే వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్న పరిస్థితులు ఉండేవి. నేడు కూడా అలాంటి దుర్ఘటనలు పునరావృత్తమయ్యే ప్రమాదాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. మహిళలతో పాటు పురుషులు కూడా సంఘాలుగా ఏర్పడి మైక్రో రుణాలు పొందుతుండటంతో ఆయా కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా డివిజన్ మండల కేంద్రాల్లో వేలాది మైక్రోఫైనాన్సలు వున్నాయు అన్ని చెన్నయి రాష్ట్రం లో నుండే కార్య కలాపాలు నిర్వహిస్తూ ఉన్నా యి .రూ.30 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ఇస్తున్న రుణాలను 48 వారాల్లో సమ వాయిదాలతో చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క వాయిదా చెల్లింపులో ఆలస్యం జరిగినా భారీ జరిమానాతో వసూళ్లు చేస్తున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించని రుణ గ్రహీతల పరువును బజారులో నిలదీస్తున్నారు. దీంతో వాయి దాల చెల్లింపునకు కూడా పలువురు మహిళలు అధిక వడ్డీతో అప్పులు చేస్తున్న పరిస్థితి. ఈ క్రమంలో మైక్రో ఫైనాన్సలను నిషేధించాలంటూ మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో పలు పేద కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే ప్రమాదాలు ఉన్నాయి. అవగాహన రాహిత్యం, ఆర్థిక అవసరాల కోసం అధికవడ్డీతో రుణాలు తీసుకుంటున్న పలువురు మహిళలు వాయిదాలు చెల్లించలేక మొహం చాటేస్తున్న పరిస్థితి ఉంది స్తోమతకు మించి రుణాలు మంజూరు జరుగుతుండ దంతో తిరిగి చెల్లించలేక ఆర్థిక అసమానతలు పెరుగుతు న్నాయి. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలోనే గత దుర్ఘటనలు పునరా వృత్తమయ్యే ప్రమాదం ఉంది. మైక్రో ఫైనాన్సల రుణాలతో సమభావన, స్త్రీ నిధి రుణాలను పలువురు మహిళలు సక్రమం గా చెల్లించలేకపోతున్నారు. మైక్రో రుణ వాయిదా ప్రతీవారం చెల్లించాల్సి ఉండడంతో బ్యాంకు లింకేజ్ రుణాలను మహిళలు సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. వారం వాయిదా చెల్లింపులో ఏ మాత్రం ఆలస్యం జరిగినా మైక్రో ఫైనాన్స ఏజెంట్లు సంబంధిత మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వం మైక్రో ఫైనాన్సలపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో లింకేజీ రుణాల బకాయిలు పెరుగడంతో పాటు పలువురు మహిళల జీవితాల్లో మైక్రో రుణాలు తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు వీని మీద ఆంక్షలు విధించాలి.

**కందుకూరి వారి సంస్కారం,**
**గురజాడ వారి ప్రభోదం, అల్లూరి విప్లవం,**
**టంగుటూరి నిబ్బరం, అమరజీవి త్యాగం తెలుగుజాతి పెంచడమే నా లక్ష్యం...**
**- ఎన్టీఆర్**



# "చివరకు మిగిలేది" రహస్యం చెప్పిన బుచ్చిబాబు




బుచ్చిబాబు ప్రసిద్ధ నవలా కారుడు. నాటకకర్త. కథకుడు. ఆయన రాసిన ఏకైక నవల"చివరకు మిగిలేది"తో జీవితం సత్యాలు తెలిపారు. 'చివరికి మిగిలేది' అనే దానికి సమాధానం తెలిస్తే జీవితరహస్యం తెలుసుకున్నట్లే.ఈ నవల కథాంశం పై సినిమా కూడా వచ్చింది.ఇది మనోవైజ్ఞానిక నవల. జీవితానికి సంబంధించిన అనేక ప్రశ్నలను ఈ నవల రేకెత్తిస్తుందని సాహిత్యకారుల అభిప్రాయం. కథంతా నాయకుడు దయానిధి తాత్విక కోణంలో నడుస్తుంది. నవలలోని ప్రతి పాత్రను మనో విశ్లేషణ చేసుకుంటూపోతాడు. తల్లి గురించి గ్రామస్తులు పలు రకాలుగా మాట్లాడుకోవడంతో అతను సంఘానికి దూరంగా ఏకాంతంగా గడుపుతాడు. నలుగురు మహిళలు అతని జీవితంలోకి వచ్చినా అమృతం సన్నిహితురాలవుతుంది. ఈ నవల ద్వారా రచయిత " మానవునికి కావాల్సింది మతాలు, దేవుళ్లు కాదు, మెక్కుబళ్లు, రాజకీయాలు కాదు, దయ కొంచెమైనా ఉండాలని చెప్పాడు." వ్యక్తిని కాదు ద్వేషించాల్సింది, అతనిలోని దౌర్బల్యాన్ని, బలహీనతలను అన్న మానవతా సిద్ధాంతంపై అని" ముగింపు ఇచ్చాడు. ఆయన 82 కథలు,40 వ్యాసాలు,నవల,వచన కావ్యం,40 నాటికి,నాటకాలు తదితరాలు రాసాడు.

బుచ్చిబాబు ఏలూరులో 1916 జూన్ 14న సూర్యప్రకాశరావు, వెంకాయమ్మలకు జన్మించాడు. అక్షరాభ్యాసం కంకిపాడులో జరిగింది. పాలకొల్లులో ఎస్ఎస్ ఎల్సీ ,బీఏ గుంటూరులో చదివారు. సుబ్బలక్ష్మిని పెళ్లి చేసుకున్నారు.అనంతపురం, విశాఖలో ఆంగ్ల ఉపన్యాసకుడుగా పని చేసారు. 1945-67 వరకూ ఆకాశవాణిలో పనిచేసారు. 1967 సెప్టెంబర్ 20న మరణించారు. మేడమెట్లు కథా సంపుటిలో రాసిన కథలు ఆయనకు మంచిపేరు తెచ్చాయి. స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న సమయంలో కవులందరూ మార్క్సిస్టు భావజాలం,లేదా సంఘసంస్కరణ ఉద్యమానికి చెందినవారుగా ఉన్న కాలంలో అతి కొద్దిమంది అభ్యుదయ రచయితల్లో బుచ్చిబాబుని అగ్రగణ్యుణుగా చెప్పవచ్చు.

బుచ్చిబాబు అనే కలం పేరుతో, సంతోష్ కుమార్ పేరుతో ఆంగ్ల రచనలు చేసారు, ఆయన అసలు పేరు శివరాజు వెంకట సుబ్బారావు. 1936 లో ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో బీఏ చదువుతున్నప్పుడు జువెనిలియా, బ్రోకెన్ వయోలిన్ ఆంగ్ల కవితలు, 'పశ్చాత్తాపం లేదు ' తెలుగు కథానిక కళాశాల వార్షిక సంచికలో ప్రచురితం అయ్యాయి.ఆంగ్ల సాహిత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు.ఆయన రాసిన చిన్న కథలు పోడవైనవి అయినా పాత్ర చిత్రీకరణ,నేరేషన్ లో విన్నూతమైన శైలి కలిగి ఉంటాయి.ఆయనపై ఆంగ్ల రచయితలు సోమర్సెట్ మామ్,ఓ హెన్రీ వంటి వారి ప్రభావం ఉంది. ఒకేఒక నవల రాసినా మంచి పేరు లభించింది.

**- యం.వి.రామారావు.**

పాఠకులకు విజ్ఞప్తి 'రేపటికోసం' పత్రికకు సంబంధించి మీ విలువైన సూచనలు, అభిప్రాయాలు ఈ క్రింది మెయిల్‌కు పంపగలరు. repatikosamdaily@gmail.com

# డీసీసీబిలో భోక్తలకు శిక్షపడేనా..?



- తిన్నోళ్లకు తిన్నంత.. దోచుకున్నోళ్లకు దోచుకున్నంత..
- రెండు దశాబ్దాల నుంచి రూ.300 కోట్లు స్వాహా
- అవినీతిపరులపై మక్కెన పట్టు సాధించగలరా..?
- రేపే కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారం
- మక్కెనకు ముళ్ల కిరీటమే..

**గుంటూరు సిటీ బ్యూరో, రేపటి కోసం, షేక్ మహమ్మద్ రఫీ :** చిన్న వయసులోనే సర్పంచ్‌గా ఎన్నికై మూడున్నర దశాబ్దాలపాటు రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందారు. ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు చేస్తూ మరింతగా ముందుకు సాగారు. రైతుబిడ్డగా బ్యాంకును ప్రక్షాళన చేయగలరా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం వినుకొండ మాజీ ఎమ్మెల్యే మల్లికార్జునరావును గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జిడిసిసిబి) చైర్మన్‌గా నామినేట్ చేసింది. ఈనెల 5వ తేదీన బ్యాంకు చైర్మన్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు స్థితి గతులపై రేపటి కోసం అందిస్తున్న ప్రత్యేక కథనం..

నిజాయితీపరుడుగా పేరున్న మల్లికార్జునరావు భోక్తలపై చర్యలు తీసుకునేందుకు అధికార పార్టీ నేతలు ఏ మేరకు సహకరిస్తారన్నది పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం బ్యాంకులో మాఫియా నడుస్తోంది. మాఫియాతో చేతులు కలపకపోతే ఆయన పాలన సాగించలేరు. చేతులు కలిపి ఆ ఊబిలో దిగితే బయటకు రాలేరు. అయితే నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయలు కృషితో ఈ పదవిని సాధించిన మక్కెన వీటన్నిటిని ఎలా అధిగమించగలరని అందరూ ఎదురుచూస్తున్నారు. ..అది రైతుల కోసం ఏర్పాటు చేసిన సంస్థ...సుమారు 120 సంవత్సరాల క్రితం స్థాపించినా, ఆశించిన స్థాయిలో ఎదగలేదు. ఎంతోమంది ఉద్దండులు పాలించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డిసిసిబి) ప్రస్తుతం భోక్తలకు నిలయంగా మారింది. బంగారం లేకుండా ఖాళీ సంచులకు, మిర్చి, పసుపు, ధాన్యం లేకుండా కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచినట్లు రికార్డులు సృష్టించారు. ఈ విధంగా రైతుల సొమ్మును దళారులు రూ కోట్లల్లో స్వాహా చేశారు. భూమి లేకుండానే బోగస్ పత్రాలను, రికార్డులు తయారు చేశారు. డ్వాక్రా గ్రూపులు లేకుండానే రుణాలు ఇచ్చారు. బోగస్ విద్యార్హత పత్రాలతో ఉద్యోగులు, అధికారులు జీతాలు డ్రా చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జి డి సిసిబి)లో పెద్ద ఎత్తున జరిగిన అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ కమిటీని నియమించింది. ఇప్పటికే దీనిపై ఏసీబీ, లోకాయుక్త,విజిలెన్స్, ఎస్ సి కమిషన్, సిఐడి, సహకార శాఖలద్వారా దర్యాప్తు జరుగుతోంది. బ్యాంకులో రెండు దశాబ్దాల నుంచి అవినీతి, అక్రమాలు వెలుగు లోకి వచ్చాయి. వీటిపై 'రేపటి కోసం' సేకరించిన పలు ఆసక్తికరమైన అంశాలు ఇలా ఉన్నాయి.

పొన్నూరులో 15 ఏళ్ళ క్రితం బంగారం లేకుండా ఖాళీ సంచులను లాకర్లో పెట్టి గోల్డ్ లోన్ తీసుకున్నారు. సొమ్ము రికవరీ కాలేదు. దోషులపై చర్యలు తీసుకోలేదు.

తెనాలి డివిజన్‌లో భట్టిప్రోలు, దుగ్గిరాల తదితర ప్రాంతాల్లో గోదాముల్లో పసుపు, ధాన్యం నిల్వచేసినట్లు బాండ్లు సృష్టించి రూ. 20 కోట్లు స్వాహా చేశారు. ఈ రుణాలను రికవరీ చేయలేదు. చర్యలు తీసుకోలేదు.

బ్యాంకులో సుమారు 250 మంది ఉద్యోగులు, సొసైటీలో మరో 200 మంది పనిచేస్తున్నారు. వీరంతా బోగస్ విద్యార్హత పత్రాలను సృష్టించి అదనపు జీతాలు పొందుతున్నారు. ఇప్పటివరకు రూ.10 కోట్ల వరకు అదనపు జీతాల రూపంలో స్వాహా చేశారు. బోగస్ విద్యార్హత పత్రాలపై దర్యాప్తు చేసి దోషులపై శిక్షించలేదు. డ్రా చేసిన అదనపు జీతాలను రికవరీ చేయలేదు.

నరసరావుపేట, వినుకొండ, నల్లపాడు శాఖలలో బోగస్ డ్వాక్రా గ్రూపులను సృష్టించి బ్రాంచ్ మేనేజర్లు, ఇతర సిబ్బంది రూ.50 కోట్లను పక్కదారి పట్టించారు.

నరసరావుపేట, నల్లపాడు, మరికొన్ని శాఖాల్లో మిర్చి, నిల్వ చేసినట్లు బోగస్ పత్రాలతో రూ. 100 కోట్ల రుణాలు పొందారు. రికవరీ కాలేదు. చర్యలు లేవు.

బ్యాంకుకు ప్రతిపాదిత లాభాలు ఉన్నట్లు బోగస్ పత్రాలు సృష్టించిన ఉద్యోగులు, అధికారులు ప్రత్యేక బోనస్ పొందుతున్నారు. నిబంధనలకు విరుద్ధమని తేలింది. బోనస్ రికవరీ చేయాలని సహకార శాఖ ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి నివేదిక ఇచ్చారు. ఇంతవరకు దీనిపై చర్యలు తీసుకోలేదు.

2014 -19లో అప్పటి జేసి డాక్టర్ చెరుకూరి శ్రీధర్ బ్యాంక్ పై 51 వ సెక్షన్ దర్యాప్తు చేసి ఉద్యోగులు, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు పొంది, అదనపు వేతనాలు డ్రా చేసినట్లు నిర్ధారించారు. సొమ్మును రికవరీ చేయాలని ఆదేశించినా చర్యలు లేవు.

120 ఏళ్ళ క్రితం ఏర్పడిన బ్యాంకుకు 45 శాఖలు మాత్రమే ఉన్నాయి. సహజంగా 150 నుండి 200 వరకు శాఖలను ఏర్పాటు చేసి రైతులకు పెద్ద ఎత్తున సేవలు అందించాల్సినా ఆ దిశగా అడుగులు వేయలేదు. అర్హత కలిగిన సీఈఓలను ఏర్పాటు చేయకుండా, పాలక వర్గాలకు ఊడిగం చేసే వారికి ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో బ్యాంకులో దోచుకున్న వాళ్లకు దోచుకున్నంత.. తిన్నోళ్లకు తిన్నంతగా.. తీరుగా పాలన సాగుతోంది. మక్కెన చెక్ పెట్టి రైతులకు మేలు చేస్తారని ఆశిద్దాం.

## రాబోయే రోజుల్లో ఏ. ఐ. పాత్ర కీలకం



**గుంటూరు పశ్చిమ రేపటి కోసం, వేమూరి సుధాకర్:** గుంటూరు గవర్నమెంట్ రైల్వే పోలీస్ అధికారి పి అక్కేశ్వరరావు మాట్లాడుతూ, రాబోవు రోజులలో పోలీస్ ఆధునిక యుగంలో కృత్రిమ మేధస్సు ఎంతో అవసరం అని, దీనివలన పోలీస్ వ్యవస్థకు అత్యాధునిక సమర్థవంతమైన చర్యలకు సహకారం అందుతుందని తెలియజేస్తూ, ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రయోజనాలు ఫేస్ రికగ్నిషన్, ప్రిడెక్టివ్, పోలీసింగ్ మరి ఇతర సైబర్ క్రైమ్ కేసులను వివరిస్తుందని, పోలీసింగ్ యొక్క భవిష్యత్తును ఏఐ మార్చబోతుందని, ప్రజలకు అవసరమయ్యే పనులను చేయగల స్మార్ట్ యంత్రాలను రూపొందించే శాస్త్రం అవుతుందన్నారు. ఈ సిస్టం నేరస్తులను ట్రాక్ చేయడానికి తప్పిపోయిన వ్యక్తులను గుర్తించటానికి ప్రజల రక్షణ శాంతి భద్రతలు మెరుగుపరచడానికి సమర్థవంతంగా కచ్చితంగా ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా సోషల్ మీడియా లాంటి పెద్ద డేటా సైట్లను కూడా తక్కువ సమయంలోనే తొందరగా స్కాన్ చేయగలదని, క్రిమినల్ నెట్వర్క్ లను బయలుపరుస్తుందని అక్రమ కార్యకలాపాలను చేయడానికి ట్రాకింగ్ సిస్టం అంచనా వేయడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ ఏ ఐ ప్రమాద పరిస్థితులను గుర్తించి హెచ్చరికలు జారీ చేయడానికి ఉపయోగకరమని, ఒక వ్యక్తి ముఖ కవళికలు ఇతర అంశాలు ఆధారంగా సరిపోల్చే ఆధునిక టెక్నాలజీ ఏఐ సొంతం చేసుకుంటుందని, క్రిమినల్ డేటా బేస్ ద్వారా ముఖాలను సరిపోల్చే నేరస్తులను గుర్తించి నేరం జరిగే ఆస్కారం ఉందని సమాచారం అందించ గలదన్నారు.

## పొగాకు కొనుగోలుకు ధర్నాను జయప్రదం చేయండి



**గుంటూరు సిటీ బ్యూరో, రేపటి కోసం :** నగరంలోని లోని పి.ఎల్ రావు భవన్ లో రైతు సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా పొగాకు పండించిన రైతు, కౌలు రైతులు పొగాకు కొనుగోలు చేయనందున తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. గత ఏడాది క్వింటాలుకు 20 వేల వరకు కొనుగోలు చేసిన పొగాకును ఈ ఏడాది కొనుగోలే చేయమని కంపెనీలు భీష్మించుకుని ఉండటంతో రైతులు పంటను ఎక్కడ దాచి పెట్టాలో అర్థం కాక వర్షాలకు తడిచిపోయి పాడైపోయిన పరిస్థితిలో ఉన్నవి. రైతు సంఘాలు ఆందోళన కారణంగా బాండ్ల ఇచ్చిన కంపెనీలు మాత్రం మొక్కుబడిగా గతం కంటే తక్కువ రేట్ కి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మూడున్నర లక్షల పైగా ఎగరాలు పొగాకు సాగు చేయగా గుంటూరు జిల్లాలో పదివేల ఎకరాల్లో సాగు చేయడం జరిగింది. దీనిపైన ప్రభుత్వం నిఘా పెట్టి పొగాకు పంటను కొనుగోలు చేసే విధంగా ప్రయత్నాలు చేయకపోవడం వలన ఈరోజు కంపెనీలు మొఖం చాటేసాయన్నారు. ప్రభుత్వ అంటే భయం లేకుండా ఉండటం వలన కంపెనీలు రైతులను వేదిస్తున్నారు. ఈనెల 5వ తేదీన జిపిఐ కార్యాలయం ముందు ధర్నా జరుగుతున్నదని ఈ ధర్నాకు రైతులు అందరు పాల్గొనాలని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ ఉధృతం చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏరువాక రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పాటిబండ్ల కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం నాయకులు ఇమ్మడి రామారావు పాల్గొన్నారు.

## డి & ఓ ట్రేడ్ లైసెన్సులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి



**గుంటూరు సిటీ బ్యూరో, రేపటి కోసం:** నగరంలోని వార్డ్ సచివాలయాల వారీగా డి &ఓ ట్రేడ్ లైసెన్స్ లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ అమరావతి రోడ్, నగరాలు, పాత గుంటూరు, బాలాజీ నగర్, ఐపిడి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, ట్రేడ్ లైసెన్స్ లు, పారిశుధ్య పనులు, పూడికతీత పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వ్యాపార, వాణిజ్య సంస్థ తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుండి డి& ఓ ట్రేడ్ లైసెన్స్ కల్గి ఉండాలన్నారు. ఇక నందు తమ రోజువారీ పర్యటనల్లో ట్రేడ్ లైసెన్స్ లను కూడా తనిఖీ చేస్తామన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు నూరు శాతం ట్రేడ్ లైసెన్స్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ట్రేడ్ రెన్యువల్ ఫీజులు కూడా చెల్లించేలా చూడాలని ఆదేశించారు. నోడల్ అధికారులు తమ పరిశీలనలో ట్రేడ్ లైసెన్స్ లను కూడా ప్రధానంగా పర్యవేక్షణ చేయాలన్నారు. రోడ్లు, డ్రైన్లను ఆక్రమణలు చేసుకొని, ట్రాఫిక్, మురుగు పారుదలకు అడ్డంకిగా ఉన్న వాటిని పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వయం చేసుకొని తొలగించాలన్నారు. మేజర్ డ్రైన్లలో జరుగుతున్న పూడికతీత సమగ్రంగా జరిగేలా డిఈఈలు, ఈఈలు పర్యవేక్షణ చేయాలని, పూడికతీత అనంతరం మురుగు పారుదల పక్కాగా లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేయాలి...



**మంగళగిరి (గుంటూరు) రేపటి కోసం ఉద్ధంటి రమేష్:** రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తిని మంగళగిరి నగర పరిధి లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం లో మంగళవారం కలిసి వినతి పత్రాన్ని (ఏఐఎస్ఎఫ్) అఖిలభారత విద్యార్థి సమైక్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు జరిగే రోజుల్లో పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇది విద్యార్థుల జీవితంతో చలగాట మాడే నిర్ణయమని మండిపడ్డారు. అనేకమంది విద్యార్థులకు డీఎస్సీ పరీక్షల రోజునే సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా ఉందని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పీజీ ప్రవేశ పరీక్షలను వాయిదా వేసి, డీఎస్సీ పరీక్షలు లేని రోజుల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్, గుంటూరు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శివ, యశ్వంత్, ప్రణీత్, డేవిడ్ పాల్గొన్నారు.

## ఆయన అంటే హడల్ కథనంతో జిజిహెచ్‌లో సంబరాలు



**గుంటూరు సిటీ బ్యూరో రేపటి కోసం:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన అంటే హడల్ కథనం 'రేపటి కోసం'లో ప్రచురితమైంది. ఈ కథనం పై జిజిహెచ్‌లో రక్షణ సిబ్బంది సంబరాలు చేసుకుని స్వీట్లు పంచుకు న్నారు. ఇప్పటివరకు అనేకమందిని వేధించారని ఎవరూ బయట చెప్పుకోలేక పోయారని అనేకమంది వాపో యారు. తవ్వే కొద్దీ ఆరోపణలు బయట పడుతున్నాయి. అంతకు ముందు ఆయనపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడానికి వెళితే బెదిరింపులకు పాల్పడ్డారని దాంతో వెనక్కి వెళ్లినట్లు పలువురు రేపటి కోసం దృష్టికి తెచ్చారు. గతంలో ఆయన 15 లక్షలు చొప్పున ఉద్యోగం పొందారని ఆనాడు 16 మందిలో ఆయన ఉన్నారని అప్పుడు దాదాపు రెండు కోట్ల రూపా యలు చేతులు మారడం వల్లే ఇలాంటి ఉద్యోగాలు పొందారని ఆరోపణలు వచ్చాయి. ఆసుపత్రికి ఇలాంటి వారి సేవలు అవసరం లేకపోయినా అందలం ఎక్కించారని దాంతో ఆయన ఆడింది ఆట పాడింది పాటగా మారిందని పలువురు ఆరోపించారు. ఈయన పై ఆరోపణలు రావడంతో గుట్టు చప్పుడు కాకుండా డి యం ఈ కార్యాలయంలో విజిలెన్స్ విచారణ చేయించుకున్నారని కూడా పలువురు ఆరోపించారు.

## తులసిరెడ్డికి ఘన స్వాగతం

**గుంటూరు సిటీ బ్యూరో రేపటి కోసం:** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు డా॥ ఎన్. తులసి రెడ్డి కి పార్టీ నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం గుంటూరు జిల్లా యన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు కరీం ఎన్. తులసి రెడ్డి ని శాలువాతో సత్కరించి వివిధ కార్యక్రమాల గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం పాల్ విజయ్ కుమార్ , ఆఫీస్ ఇన్చార్జి బిల్లా సునీల్, కాకాని రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో కానిస్టేబుల్‌కు గాయాలు



**మేడికొండూరు(గుంటూరు)రేపటికోసం:** ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కానిస్టేబుల్ అనిల్‌ను మేడికొండూరు సెంటర్ వద్ద అజాగ్రత్తతో అతివేగంగా కారు డ్రైవర్ ఢీ కొట్టిన సంఘటన మంగళవారం జరిగింది. రాంగ్‌రూట్లో అనిల్ పయనిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అనిల్ కాలు పూర్తిగా తెగిపడింది. అప్రమత్తమైన మేడికొండూరు పోలీసులు అనిల్‌ను ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## మంత్రి రవీంద్రకు సన్మానం



**గుంటూరు సిటీ బ్యూరో, రేపటి కోసం:** రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లాయ్ రవీంద్ర ను మంగళవారం క్యాంప్ కార్యా లయంలో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్య నారాయణ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మహానాడులో మంత్రి కొల్లు కార్యకర్త, అధినేత అనే అంశంపై జరిగిన ప్రసంగం కార్యకర్త లను, నాయకులను ఉత్తేజపరిచిందని సత్యనారాయణ తెలిపారు. ఈ విషయంలో ప్రజాభిప్రాయంలో విశేష మద్దతును పొందారని 95 శాతం మార్కులు రావడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. ఆయన శ్రమకు, నిబద్ధతకు ఇది తగిన గుర్తింపు అన్నారు.

## అన్నదానం.. నోట్ పుస్తకాలు పంపిణీ



**మంగళగిరి (గుంటూరు) రేపటి కోసం ఉద్ధంటి రమేష్:** చిన కాకాని షైన్ ఆనంద శరణాలయంలో పెనుమాక మాజీ సర్పంచ్ స్వర్గీయ కళ్ళం పానకాల రెడ్డి నాలుగో వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం రాత్రి ఆయన కుమారుడు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బాల బాలికలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాల బాలికలకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ స్వర్గీయ పానకాల రెడ్డి పెనుమాక గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శ బొంతు శివ సాంబి రెడ్డి, టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి కిరణ్, భీమవరపు సురేంద్ర రెడ్డి, కళ్ళం చేతన్ రెడ్డి, ఉయ్యూరు శ్రీను బాబు, బొబ్బా రవితేజ, కళ్ళం శ్రీనివాసరెడ్డి, అక్బర్, ప్రదీప్, చంద్, శరణాలయం నిర్వాహకురాలు శ్రీమతి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల జనన నియంత్రణకు ప్రత్యేక చర్యలు



**గుంటూరు సిటీ బ్యూరో, రేపటి కోసం:** నగరంలో వీధి కుక్కల జనన నియంత్రణకు ప్రత్యేకంగా ముగ్గురు వైద్యులను, నలుగురు సహాయకులను, డాగ్ క్యాచర్లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోడానికి, నగరంలో సుమారు రూ.51 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధిపనులను నిర్వహించుటకు స్థాయిసంఘం ఆమోదం తెలిపిందని అధ్యక్షులు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం స్థాయి సంఘం అధ్యక్షుల వారి ఛాంబర్ (మేయర్ ఛాంబర్)లో నగర కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగరపాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం నిర్వహించి పలుఅభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 143 అం శాలకు సంబంధించిన అభివృద్ధి పనులను స్థాయి సంఘ సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా స్థాయి సంఘ అధ్యక్షులు మేయర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను నగరంలోని శివారు ప్రాంతాలలో నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలలో స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలతో రోడ్లు,డ్రైన్లు,వీధి దీపాలు, తాగు నీటి పైపులైన్లు ఏర్పాటు వంటి పలు అభివృద్ధి పనులు చేయుటకు ఆమోదం తెలిపామన్నారు. నగరంలో పార్టీలకతీతంగా ప్రజలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నాజ్ సెంటర్ లోని షాపింగ్ కాంప్లెక్స్, స్వామి థియేటర్ వద్దగల షాపింగ్ కాంప్లెక్స్ అడవి తక్కెళ్ళ పాడులలోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో లీజు గడువు పూర్తైన షాపులకు నిబంధనల ప్రకారం రెన్యువల్‌ను ఆమోదించడమైనది. ఈ సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మి దుర్గ, ముప్పవరపు భారతి, యస్.ఈ నాగమల్లెశ్వర రావు, సి.యం.ఓ.హెచ్ డాక్టర్అమృతం పాల్గొన్నారు.

## ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి



**దుగ్గిరాల (గుంటూరు) రేపటి కోసం:** ఈ నెల 5వ తేదీన ఎస్ఎస్ కన్వెన్షన్ బందర్‌రోడ్ విజయవాడలో జరుగనున్న రాష్ట్రకౌన్సిల్ సమావేశమునకు ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అందరూ హాజరుకావాలని దుగ్గిరాలయూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి టి.మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గుంటూరు పూర్ణ ప్రసాద్ కోరారు. జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్ భాషా మౌఖిక ఆదేశాల ప్రకారం మంగళవారం కొల్లిపర తహసిల్దార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,పంచాయతీ, రిజిస్ట్రేషన్ సిబ్బందిని కలసి సమావేశమునకు ఆహ్వానించడం జరిగినది. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరిస్తామని, ఉద్యోగుల పక్షపాతిగా మన ముఖ్యమంత్రి మన మనస్సులలో చిరస్థాయిగా గుర్తుండేటట్లు మంచి పిఆర్‌సి ఇస్తారనే ఆశాభావం వ్యక్తం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులుఅందెబాలచంద్రమౌళి, ఉపాధ్యక్షులు గుంటూరు పూర్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులు షేక్ మీరావలి, జాయింట్ సెక్రెటరీ నూకవరపు శ్రీలక్ష్మీ కుమారి, కార్యవర్గ సభ్యులు కొల్లిపర మండల సబ్ రిజిస్ట్రార్ ఎం.ఆదినారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ సీనియర్అసిస్టెంట్ శ్రీనివాస రావు, ఎం.శ్రీలక్ష్మీ కుమారి, వీఆర్వోలు భాస్కర్, సుష్మ, ప్రసాద్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలపాలెం సుప్రీమ్ ఎల్‌టిసి ని సందర్శించిన డిపిఓ




**ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా) రేపటి కోసం:** అడిషనల్ కమిషనర్ పంచాయతీ రాజ్ వారి ఆదేశాలననుసరించి గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, తుమ్మలపాలెం సుప్రీమ్ ఎల్‌టిసిని గుంటూరు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బివి నాగసాయి కుమార్ సందర్శించడం జరిగింది. గ్రామ పంచాయతీ పరిధి లోని గృహిణులకు, షాపు యజమానులకు, గ్రామ ప్రజలకు బిన్ బ్యాగ్ పద్ధతి, తడి చెత్త పొడి చెత్త వేరు చేస్తూ, డస్ట్ బిన్ లో మాత్రమే వేరు చేసిన చెత్త వ్యర్థాలు ఇచ్చేలా అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం గ్రామంలోని ప్రజలు ప్రతి నిత్యం క్లాప్ మిత్రాలు వస్తున్నారని, డస్ట్ బిన్‌లు మూడు ఇచ్చారని, డస్ట్ బిన్‌లోనే చెత్త ఇస్తున్నామని చెప్పడం పట్ల డిపిఓ సంతృప్తి వ్యక్తం చేయడమైనది . తదుపరి ఎస్ డబ్ల్యు పిసి షెడ్ వద్ద నాడెప్ తొట్టిలలో వేసే తడి చెత్త గురించి తగిన క్లాప్ మిత్రా సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శి కి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. గ్రామంలో అన్ని గృహాలకు చెత్త వ్యర్థాలను వేరు చేయడం గురించి అవగాహన కల్పించవలసినదిగా పంచాయతీ కార్యదర్శి కి సూచనలు జారీచేయడమైనది. గ్రామంలో పశువుల పేడను రైతులతో ఒప్పందం చేసుకుని ఎస్ డబ్ల్యు పిసి షెడ్ వద్దకు చేర్చవలసినదిగా ఆదేశించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గుంటూరు డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ నిరంజన్, అనురాధ పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా,హరిత రాయబారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు నరకాసుర వధ.. ఊరూరా సంబరాలు : యరపతినేని



**పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** జూన్ 4న ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి నేటికి సంవత్సరం. ఆర్థిక వ్యవస్థ పతనం కావటానికి కారకుడైన జగన్మోహన్‌రెడ్డి గద్దె దిగిన రోజు, అటువంటి రోజున ఊరూరా ఒక పండుగ రోజు అని శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఎన్డీఏ శ్రేణుల్లో ఒక పండుగ లాంటి వాతావరణం జరుపుకునే పరిస్థితి ఆంధ్ర రాష్ట్రంలో ఉందన్నారు. కానీ ఈ నయవంచక వైసీపీ నాయకులు దానిని వెన్నుపోటు దినంగా భావిస్తున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును వెన్నుపోటు దినంగా పాటిస్తున్నారంటే ప్రజల తీర్పును మీరు ప్రజలను వెన్నుపోటు దారులుగా మీరు పరిగణిస్తున్నారా అని చెప్పి జగన్మోహన్ రెడ్డిని వైసీపీ నాయకుల్ని ప్రశ్నించారు. తల్లిని, చెల్లిని వంచించిన వాడు అసలు సిసలు వెన్నుపోటు దారుడు. బాబాయిని గొడ్డలి పోటుతో చంపి గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసిన వాడు వెన్నుపోటుదారుడు. నమ్మి ఓట్లు వేసిన ప్రజల్ని 151 సీట్లు ఇచ్చిన ప్రజల్ని నమ్మిన ఆ ప్రజల్ని వంచించిన వాడు నయవంచకుడు వెన్నుపోటు దారుడు జగన్మోహన్ రెడ్డి. ఈ ఎన్డీఏ ప్రభుత్వం కాదు ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వం ముఖ్యమంత్రిగా సుదీర్ఘ అనుభవం కలిగిన చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ఈరోజు అధోగతి పాలన నుంచి బ్రహ్మాండంగా పురోగతి వైపు పరుగులు పెడుతుందన్నారు. రాజధాని లేని రాష్ట్రం నుండి అమరావతిని రాజధానిగా కట్టుకునే పరిస్థితికి మనం వచ్చాం. రాష్ట్రం ఆర్థిక ప్రగతి పట్టాల వైపు పరిగెడతా వుంది. 2019-24 మధ్య గంజాయి బ్యాచ్‌ని తయారు చేసి, రాష్ట్రంలో వదిలి ఏ యూనివర్సిటీలోనూ ఏ కాలేజీల్లోనూ చదువు లేకుండా, పిల్లలకి గంజాయిని నేర్పించి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశార న్నారు . తెనాలిలో గంజాయి తాగి కానిస్టేబుల్ పై దాడి చేసిన వ్యక్తులని సిగ్గు లజ్జ లేకుండా తెనాలి వెళ్లి జగన్మోహన్ రెడ్డి పరామర్శించడం దేనికి సంకేతమో ఈ వెన్నుపోటు దారులు, వైసీపీ నాయకులు చెప్పాల న్నారు. ఈ వైసీపీ వెన్నుపోటు దారులని శాశ్వతంగా సమాధి కట్టాలి, ఇటువంటి వ్యక్తులు రాజకీయాలలో బ్రతకకూడదు, రాజకీయంగా బ్రతికితే సమాజానికి చెడు వస్తుందనే సంగతి కూడా మనందరం కూడా గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నరకాసుర వధ పేరుతో పత్రికా ప్రకటనలు, అదేవిధంగా బాణసంచా కాల్చాలన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యంకోసం ప్రతి రోజూ యోగా చేయాలి



- మంగళగిరి దేవస్థానం గ్రౌండ్లో యోగాంధ్ర 2025
- నారా లోకేష్ ఆదేశాలతో మంగళగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- టూరిజం అండ్ కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్

**మంగళగిరి (గుంటూరు) రేపటి కోసం ఉద్ధంటి రమేష్** యోగాను జీవితకాలం ఆచరించాలని ఆంధ్రప్రదేశ్ టూరిజం అండ్ కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ సూచించారు. యోగాంధ్ర 2025 ప్రధాని నరేంద్ర మోడీ పిలుపులో భాగంగా నెలరోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం గ్రౌండ్లో మంగళవారం ఉదయం యోగా శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అజయ్ జైన్ పాల్గొన్నారు. జూన్ 21న ప్రధాన నరేంద్ర మోడీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్టణం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో 5 లక్షల మందితో జరిగే యోగ సాధనలో మోడీ పాల్గొననున్నారని తెలిపారు. యోగ ఆచరించేందుకు రెండు కోట్ల మందితో రిజిస్ట్రేషన్ చేయించాలని లక్ష్యంగా. పెట్టుకోగా ఇప్పటికే ఒక కోటి 70 లక్షల మంది రిజిస్టర్ అయ్యారని తెలిపారు. ఆరోగ్యం యోగ చేయడం ద్వారా ఆరోగ్యం వరిస్తుందని అన్నారు. 100 పర్యాటక ప్రదేశాల్లో యోగాను ప్రత్యేకంగా చేయిస్తున్నట్లు చెప్పారు. యోగా ప్రచారంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలు ఉన్నాయని అరకులోయలు, బీచ్‌లు కొండ ప్రాంతాలు, తిరుపతి పుణ్యక్షేత్రం, దుర్గమ్మ గుడి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం వంటివి ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెల్నెస్ టూరిజం బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు.ప్రతి ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 28 కోట్ల పర్యాటకులు వస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు హోటల్స్ రిసార్ట్స్ ను తీసుకురాబోతున్నారని ఇప్పటికే ఆయా పర్యాటక ప్రాంతాల్లో 12 వేల గదులు ఉన్నాయని రాబోయే ఐదేళ్లలో 60వేలకు సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

**నారా లోకేష్ ఆదేశాల మేరకు మంగళగిరిని పర్యాటకపరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు..**

ఐటీ విద్యాశాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మంగళగిరిని పర్యాటకవరంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. చేనేత వస్త్రాలతో మంగళగిరి ప్రఖ్యాతిగాంచిందని తెలిపారు.

**అవగాహన పెంచేందుకే కార్యక్రమాలు.. ఇంచార్జ్ కలెక్టర్**

యోగ పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకే. ప్రత్యేక శిక్షణ శిబిరాల నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా. ఇన్చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ్ తెలిపారు. పర్యాటక ప్రాంతాలలో ప్రత్యేకంగా యోగా శిక్షణా తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా, ఆయుష్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారి అనిత, జిల్లా మెడికల్ అధికారి విజయలక్ష్మి, ఏపీ ఎం ఎస్ ఐ డి సి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎం టి ఎం సి కమిషనర్ అలీమ్ భాష, అడిషనల్ కమిషనర్ కే, శకుంతల దేవి, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో కే.సునీల్‌కుమార్, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తాం



**నరసరావుపేట టౌన్, (పల్నాడు జిల్లా), రేపటి కోసం:** వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలో విద్యుత్ వినియోగదారులకు లో వోల్టేజ్ సమస్య తీర్చాలని లక్ష్యంతో పట్టణంలోని ఏనుగుల బజార్, బాపనయ్య నగర్ లలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రోత్సాహంతో నియోజకవర్గంలో నూతన ట్రాన్స్ఫార్మర్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. దానిలో భాగంగా పట్టణంలోని ఏనుగుల బజార్, బాపనయ్య నగర్‌లో నూతనంగా ట్రాన్స్ఫార్మర్లు ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారి సిహెచ్. రాంబట్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే చదలవాడ నిర్వహించిన ప్రజావేదికలో వచ్చిన అర్జీల ఆధారంగా ఈ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌లను ఒక్కొక్కటి సుమారు రూ. 10లక్షల వ్యయంతో మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్లు రఫీ, సురేంద్రబాబు, విద్యుత్ శాఖ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

## 5న విశ్వమాత గాయత్రీ మందిరానికి శంకుస్థాపన

**అమరావతి (పల్నాడు జిల్లా) రేపటి కోసం:**పావన కృష్ణానదీ తీరాన అమరావతి మండలం పొందుగల గ్రామం గాయత్రి తీర్థం శ్రీ రామకృష్ణ శాంతి ఆశ్రమంలో ఈనెల 5న గాయత్రి జయంతి రోజున మన ఆశ్రమంలో విశ్వమాత గాయత్రి మహామందిరానికి శంకుస్థాపన జరుగుచున్నది. కాబట్టి యావన్మంది భక్తులు పాల్గొని అమరావతి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా విశ్వ మాత గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ గాయత్రి తీర్థం శ్రీరామకృష్ణ శాంతి ఆశ్రమం పొందుగల విశ్వమాత గాయత్రి మహా మందిరం శంకుస్థాపనకు అందరిని పత్రికాముఖంగా ఆహ్వానిస్తున్నామన్నారు.

## మలేరియా నివారణా మాసోత్సవ ర్యాలీ



**రొంపిచర్ల, (పల్నాడు జిల్లా) రేపటికోసం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మలేరియా నివారణా మాసోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి చెరువుకట్ట సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మలేరియా ప్రాణాంతక వ్యాధి అని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి, మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా పారే విధంగా చేస్తే ఈ వ్యాధిని నివారించవచ్చన్నారు. ఇంటి ముందర ఉన్న మురికి కాల్వల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఆయా వ్యాధులు వచ్చిన వారు వెంటనే వైద్యులను సంప్రదించి నివారణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ ఓ చంద్రశేఖర్, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ కుమార్, సురేష్, ఎఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర విద్యాశాఖ



**నరసరావుపేట, (పల్నాడు జిల్లా), రేపటి కోసం:** నూతన విద్యా సంవత్సరంలో అనేక ముఖ్యమైన మార్పులకు రాష్ట్ర విద్యాశాఖ స్వీకారం చుట్టిందని పల్నాడు జిల్లా విద్యా శాఖాధికారిణి ఎల్ చంద్రకళ తెలిపారు. స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు 3 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చే మూల్యాంకన పుస్తకాలు, వాటి నిర్వహణ, విద్యా అకాడమిక్ క్యాలెండర్, టీచర్ హ్యాండ్ బుక్, గ్రంథాలయ నిర్వహణ, లీప్ యాప్, బ్రిడ్జి కోర్సులపై ఉపాధ్యాయులకు అవగాహన కోసం ఈ శిక్షణను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ పరిశీలకురాలు లక్ష్మీప్రసన్న, డిసిఈబి చైర్మన్ ఐ కృష్ణ నాయక్, జిల్లా సీనియల్ ప్రధానోపాధ్యాయులు, డైట్ లెక్చరర్ బి బాలకోటయ్య, ఎం సాంబశివరావు, వివిధ సబ్జెక్టులలో 14 మంది నిపుణులు, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

## అనుమతిలేని విత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు



**గురజాల (పల్నాడుజిల్లా), రేపటికోసం:** అనుమతిలేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకోవలసి ఉంటుందని గురజాల వ్యవసాయశాఖ అధికారి ఎం సంధ్యారాణి హెచ్చరించారు. గురజాలపట్టణంలోని విత్తన విక్రయదుకాణాల్లో మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న స్టాక్ వివరాలను తెలుసుకొని రిజిస్టర్లను, స్టాక్‌బోర్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో సంధ్యారాణి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. విత్తన కంపెనీలకు సంబంధించిన సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.అదేవిధంగా రైతులు కూడా విత్తనాలు కొనుగోలుచేసే సమయంలో బిల్లుతో పాటు విత్తనాల రకం, లాట్ నెంబర్లను కూడా రాయించుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఏవో తోపాటు స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది



**పల్నాడు జిల్లా బ్యూరో, రేపటికోసం :** యోగాంధ్రలో భాగంగా మంగళవారం నరసరావుపేటలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికార సిబ్బంది యోగ అభ్యాసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారి మణికంఠ మాట్లాడుతూ, జిల్లా ప్రజలు, యువత ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. యోగా మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహదపడు తుందన్నారు. నిత్యం విధుల్లో ఒత్తిడికి లోనయ్యే సిబ్బందికి యోగ ఎంతగానో ఉపయోగ పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు రాజధానులని రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగనే..

- వైసీపీని ప్రజలు తిరస్కరించినా వారి తీరు మారలేదు
- వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదు
- నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు



**నరసరావుపేట టౌన్, (పల్నాడు జిల్లా), రేపటి కోసం:** రాష్ట్ర రాజధాని అమరావతిని, పోలవరంను పూర్తి చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ పోలవరాన్ని మరచి, మూడు రాజధానులంటూ ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో అరవిందబాబు మాట్లాడారు. 2019లో ప్రజలు వైసీపీకీ అధికారం కట్టబెడితే కనీవిని ఎరుగని రీతిలో అవినీతి, అక్రమాలకు పాల్పడటమే కాక, ప్రజలను ప్రశాంతంగా ఉండనివ్వలేదన్నారు. సొంత బాబాయినే హత్య చేయించిన ఘనుడని జగన్మోహన్ రెడ్డి అని, తోడబుట్టిన చెల్లికి కూడా ఆస్తులు ఇవ్వకుండా వేదిస్తున్నాడని వెన్నుపోటు అంటే ఇది కదా వైసీపీ శ్రేణులను అరవిందబాబు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఏనాడైనా వైసీపీ నాయకులు పూనుకున్నారా అని అడిగారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి నాయకుల్ని కనీసం నామినేషన్ కూడా వేయకుండా వైసీపీ అడ్డుపడింది నిజం కాదా అన్నారు. ఇంత నిస్సిగ్గుగా వ్యవహరించిన మీరు వెన్నుపోటు దినం అని చెబుతూ ప్రజల్లోకి వెళ్తాం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు వైసీపీనీ తిరస్కరించినా, వారి తీరు మారలేదని విమర్శించారు. నరసరావుపేట నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులపై దాడులుచేసి, అక్రమంగా భూ కబ్జాలను చేసింది, మున్సిపాలిటీ నిధులను స్వాహా చేసింది నువ్వుకాదా గోపిరెడ్డి అని ప్రశ్నించారు. అసలు నీకు మాట్లాడే అర్హత ఎక్కడుందన్నారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా వైసీపీ నాయ కులు సిగ్గుతెచ్చుకొని ప్రవర్తించాలని హితవు పలికారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఒక్కసీటుకే పరిమితం కావాల్సివస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కూటమి నాయకులు కపలవాయి విజయ్‌కుమార్, రంగిశెట్టి రామకృష్ణ, అత్తులూరి సుబ్బారావు, చిందుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## తెరుచుకోని సచివాలయం.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు




**ఈపూరు (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** మండలంలోని బొమ్మరాజు పల్లి సచివాలయం మంగళవారం తెరుచుకోలేదు. వెళ్లిన వాళ్లకి తలుపుకు వేసిన తాళం దర్శనమిస్తున్నది. వివిధ పనుల మీద వచ్చిన ప్రజలు తలుపుకు తాళం వేయడంతో నిరుత్సాహంగా వెనక్కి వెళ్ళిపోతున్నారు. ముఖ్యంగా కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో పనులన్నీ నిలిచిపోతున్నాయి. అంతేకాకుండా పంచాయతీ సెక్రటరీ మిగతా అధికారులు కూడా సెలవులపై వెళ్లడంతో కార్యాలయానికి తాళాలు వేసి దర్శనమిస్తున్నాయి. సచివాలయాల్లో అధికారులు లేకపోవడంతో సచివాలయ పరిధిలోని బొమ్మరాజు పల్లి, భద్రుపాలెం గ్రామాల పరిధిలోని ప్రజలు తమ పనుల కోసం ఈపూరు సచివాలయాన్ని ఆశ్రయించాల్సి వస్తుంది. కాలేజీలు పాఠశాలలు తీసే వేళలో విద్యార్థులకు అవసరమైన కులం, ఆదాయం ధ్రువపత్రాలకు రైతులకు సంబంధించిన వివిధరకాల రెవెన్యూ కార్యాలయాల పనులు, ఎన్నో రోజుల నుండి గ్రామస్తులు ఎదురుచూస్తున్న రేషన్ కార్డులు సర్వీసులు చేసేవారు లేక అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు.సంబంధిత పనులపై ఇతర గ్రామాలలోని సచివాలయాలకు వెళితే మీ గ్రామంలోని సచివాలయంలో చేసుకొండని తిప్పి పంపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాలను తనిఖీ చేసి ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులకు సూచనలు చేయాలని బొమ్మరాజుపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజానీకం, మండల ప్రజలు కోరుచున్నారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



**నూజండ్ల, (పల్నాడు జిల్లా)రేపటి కోసం:** నూజెండ్ల మండల పరిధిలోగల ప్రభుత్వ పాఠశాల నందు పని చేయుచున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నిర్వాహకులు (CCH)లకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నూజెండ్లనందు మండల విద్యాశాఖ అధికారి నలబోలు రవిచంద్ర అధ్యక్షతన ఒకరోజు శిక్షణ, వంటల పోటీలు నిర్వహించడం జరిగింది, ఈ ట్రైనింగ్‌లో భాగంగా పాఠశాల విద్యార్థికి పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, భోజన తయారీలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంటవండేటప్పుడు పోషకాలు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ సంవత్సరం నుండి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు, తదనంతరం వంటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్ర, రిసోర్స్ పర్సన్ పద్మావతి, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, CRMTS ఆఫీసు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



**పెదకూరపాడు పల్నాడు జిల్లా రేపటి కోసం:** నియో జకవర్గంలోగల ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే ప్రధాన లక్ష్యంగా కృషిచేస్తామని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. నియోజకవర్గ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ గ్రామ సీమలలో అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నానని ఆయన అన్నారు. గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు, రవాణా సౌకర్యం మెరుగుపడేందుకు దృష్టి సాధించినట్లు ఆయన తెలిపారు.

## వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన

**పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశముల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ పల్నాడు వారు కళాజాతర బృందాలను సోమవారం పిడుగురాళ్ల పట్టణంలో ప్రారంభించడం జరిగింది. ప్రభ కల్చరల్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం పిడుగురాళ్ళలోని సున్నం బట్టీల సెంటర్ నందు జానపద కళారూపమైన వీధి నాటకం ద్వారా హెచ్ఐవి / ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి, హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలా సమాజంలో కలిసి జీవించాలి, హెచ్ఐవి/ఎయిడ్స్- క్షయ వ్యాధి సంబంధం గురించి, హెచ్ఐవి ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, సుఖవ్యాధులు, చికిత్స గురించి, కండోమ్ యొక్క ఉపయోగం గురించి, హెచ్ఐవి /ఎయిడ్స్ యాక్ట్ 2017 గురించి ప్రజలలో విస్తృతంగా అవగాహనా కల్పించడం జరుగుతుందని చెప్పడం జరిగింది. పిడుగురాళ్ళ ఐసీటీసీ కౌన్సిలర్ సి హెచ్.నాగరాజు, జయలక్ష్మి రీడ్స్ టి ఐ సిబ్బంది, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం డి గౌస్ ప్రాజెక్ట్ మేనేజర్ కోమలి ఓ ఆర్ డబ్ల్యు శేషయ్య. పిఆర్ ఎడ్యుకేటర్ మభూల, హనుమంత రావు కళాజాత బృందం , వీర్నాల మల్లిఖార్జున రావు, వెంకటలక్ష్మి, మిర్యాల మలయ్య, కనకరావు, ప్రభావతి, శాంతి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటల పోటీలు



**అమరావతి (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** పల్నాడు జిల్లా అమరావతి మండలం లోనిశాఖ గ్రంథాలయంలో మంగళవారం ఉదయం యోగ మెడిటేషన్, సూర్య నమస్కారాలు చేపట్టారు. వేసవి శిక్షణా తరగతులలో భాగంగా 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బుక్ రీడింగ్,కథలు తెలుసుకొనుట, మ్యూజికల్ చైర్స్ ఆటోల పోటీలు నిర్వహించామని లైబ్రరీయన్ వెంకాయమ్మ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు గురువారం 5వ తేదీన బహుమతుల ప్రధానం జరుగుతుందని ఆమె తెలిపారు.

## విత్తన దుకాణాల తనిఖీ



**బొల్లాపల్లి (పల్నాడు జిల్లా), రేపటి కోసం:** రైతులు లైసెన్స్ కలిగిన విత్తన దుకాణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని బొల్లాపల్లి మండల వ్యవసాయ అధికారి అబ్బూరి అంకారావు కోరారు. మంగళవారం రావులాపురం, రేమిడిచర్ల గ్రామాల్లోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ తక్కువ రేటుకు వస్తాయని ప్రైవేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. గ్రామాల్లో అనధికారికంగా ఎవరైనా విత్తనాలు అమ్మితే పీడియాక్ట్ కింద కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

## వడదెబ్బకు వృద్ధుడు మృతి



**రెంటచింతల(పల్నాడు జిల్లా) రేపటి కోసం:** గత రెండు రోజులుగా కాస్తున్న ఎండ, వీస్తున్న వడ గాల్పులకు తుమ్మకోట గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగంగ రాజుపల్లెకు చెందిన గుడిపల్లి చిన ఎల్లయ్య (60) మంగళవారం మృతి చెందారు. ఈయనకు భార్య మరియమ్మ, నల్గురు సంతానం ఉన్నారు. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. మండుటెండలకు పేరు గాంచిన రెంటచింత లలో ఈ ఏడాది వడ దెబ్బకు మృతి చెందినది ఈయన ఒక్కరే కావడం గమనార్హం. మృతదేహానికి టీడీపీకి చెందిన లింగా మాధవరావు, చినహుస్సేన్‌నివాళులర్పించారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

**మాచర్ల :** ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మాచర్ల మలేరియా అధికారిడి లక్ష్మయ్య అన్నారు.మలేరియా మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక యూపీహెచ్ సి, కోర్ట్ బజార్ తదితర ప్రాంతంలో మలేరియా అవగాహన ర్యాలీ డాక్టర్ ద్రాక్షయని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

## పేదలకు అన్నదానం చేయడం అదృష్టం



**గురజాల(పల్నాడుజిల్లా) రేపటికోసం:** ఆకలితో అలమటించే నిరుపేదలకు అన్నదానం చేసే అవకాశం దక్కడం అదృష్టమని గురజాల నగరపంచాయతీ కార్యాలయం జూనియర్‌అసిస్టెంట్ భీమరాజు అన్నారు. గురజాల పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయం ఆవరణలో స్మైల్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలు,యాచకులకు అన్నదానకార్యక్రమం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమానికి గురజాల పట్టణంలోని నవభారత్ మెడికల్స్ నిర్వాహకులు కావూరి శంకర్ ఆర్థికసహాయం అందించారు. ఈ సందర్భంగా భీమరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దాతలు కూడా ఇటువంటి అన్నదానాలు, ఇతర సేవా కార్యక్రమాలకు ఆర్థికసహాయం అందించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ చైర్మన్ గుండా కాశీవిశ్వనాథ్, సభ్యులు బండి రవి, కనకం హనుమంతరావు, దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాన్లు పంపిణీలో గందరగోళం



**చిలకలూరిపేట (పల్నాడు జిల్లా) రేపటికోసం:** ఫ్యాన్లు పంపిణీలో గందరగోళం ఏర్పడింది. ఫ్యాన్లు తీసుకునేందుకు లబ్దిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. టిడ్కో సిబ్బంది ఫ్యాన్లు ఇవ్వకుండా మధ్యాహ్నం రండి అని వెళ్లిపోయారు. మండుటెండలో మహిళలు పడిగాపులు కాస్తున్నారు. మహిళలు పనులు మానుకొని వస్తే మధ్యాహ్నం రండి, రేపు రండి అని సిబ్బంది అనడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని లబ్దిదారుల సమస్య పరిష్కారించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

## 21వ వార్డులో నూతన కార్యవర్గం ఎన్నిక



**చిలకలూరిపేట (పల్నాడు జిల్లా) రేపటికోసం:**పట్టణంలోని, 21వ వార్డ్ కు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా కొత్తూరి హరికృష్ణ (సిల్వర్ హరి), ప్రధాన కార్యదర్శిగా కట్టాబట్టుల శ్రీనివాసరావును ఎన్నుకోవడం జరిగింది, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వార్డ్ కమిటీ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ప్రత్తిపాటి పుల్లారావు వారిని అభినందించి పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని తెలిపారు.

## దుర్గి రెవిన్యూ ఇనస్పెక్టర్‌గా యోబు



**దుర్గి (పల్నాడు జిల్లా) రేపటికోసం:** దుర్గి తహసిల్దార్ కార్యాలయ రెవిన్యూ ఇనస్పెక్టర్‌గా చాగంటి యోబు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. యోబు గురజాల ఆర్డీవో కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యోబు పదోన్నతిపై ఇక్కడికివచ్చారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులోఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు



**పెదకూరపాడు (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** పెదకూరపాడులోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నాడు వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించారు. బిపి షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మౌనిక వైద్య పరీక్షలు నిర్వహించగా కె వినయ్‌బాబు జాల వరమ్మలు రోగులకు సేవలందించారు సుమారు 250 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు కంచర్ల అరుణకుమారి కార్యంశెట్టి తిరుపతమ్మ గుడిపూడి త్రివేణి తాళ్లూరి అనూషలు సహాయకులుగా సేవలందించారు.

## ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే



**శావల్యాపురం (పల్నాడు జిల్లా) రేపటి కోసం** ప్రత్యేక అవసరాలు కావాల్సిన పిల్లల కోసం సర్వే చేస్తున్నామని జిల్లా కోఆర్డినేటర్ ఆర్ సెల్వరాజ్ చెప్పారు. మండల కేంద్రమైన శావల్యాపురంలో పాఠశాల విద్యాశాఖ, జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 18 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపట్టామన్నారు వినికిడి లోపం, దృష్టిలోపం మానసిక లోపం, శారీరక అంగవైకల్యం, ఆటిజం వంటి 21 రకాల లోపాలు గుర్తించి అవి ఉన్న పిల్లల్ని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. జూన్ 9వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తామన్నారు కార్యక్రమంలో ఐఈఆర్టీలు కె. జగన్మోహన్‌రెడ్డి, టి పార్వతిలు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



**శావల్యాపురం( పల్నాడు జిల్లా) రేపటికోసం** మండల కేంద్రమైన శావల్యాపురం రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలను వినుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు బోయపాటి రవిబాబు, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావులు మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ మండలానికి 65 క్వింటాళ్ల జనుములు వచ్చాయన్నారు.10 కేజీల సంచి రూ.1090. 50% సబ్సిడీ పోగా రూ.545 రైతులు చెల్లించాలన్నారు. జీలుగా, పిల్లిపెసర ఏపీ సీడ్స్ నుంచి రాగానే రైతులకు అందజేస్తామన్నారు. మినుము, పెసర, కంది విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కౌలురైతులు రైతుసేవా కేంద్రం సిబ్బంది, వీఆర్వోలను సంప్రదించి కౌలు రైతు కార్డులకు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అశోక, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతిపక్షం ద్వారానే విభజన హామీల అమలు సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎన్.తులసీరెడ్డి



**గుంటూరు సిటీ బ్యూరో (రేపటికోసం):** గత 11 సంవత్సరాల కాలంలో 10 శాతం మాత్రమే ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీలు అమలుకు నోచుకున్నాయని, అయితే నిర్మాణాత్మకమైన ప్రజా ప్రతిపక్షం ద్వారానే కేంద్రం మెడలు వంచి నూరు శాతం సాధించగలమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్. తులసీ రెడ్డి చెప్పారు. జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని జనచైతన్య వేదిక "అమలు కాని విభజన హామీలు - యువత వలసలు - అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్" అనే అంశాలపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం కార్యదర్శి అవధానుల హరి అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎన్. తులసీ రెడ్డి ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుండా, వెనుకబడిన 7 జిల్లాలకు బుందేల్ ఖడ్‌తరహా ప్రత్యేక ప్యాకేజీ అందించకుండా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 94 ప్రకారం కొత్త రాజధాని నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేవలం 1500 కోట్ల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 లో గుర్తించిన 197 సంస్థలను ఉమ్మడి ఆస్తులుగా భావించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు 52 : 48 నిష్పత్తిలో పంచుకోవాలి, అయితే ఆ విధంగా జరగలేదన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సహకారంతో కడపలో భారీ ఉక్కు కర్మాగారం నిర్మించ వలసి ఉండగా నేటికీ అడుగులు పడలేదన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం 5 కోట్ల ఆంధ్రులకు అన్యాయం చేసిందని, విభజన హామీలు అమలులో కేంద్రంపై వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం, జనసేన పార్టీలు ఎలాంటి ఒత్తిడి చేయకపోగా, పూర్తిగా అన్ని సందర్భాలలో బిజెపి ప్రభుత్వాన్ని బలపరచడం దారుణమన్నారు. విశాఖలో కొత్త రైల్వే జోన్, విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లకు ఆమోదం రాలేదని, జాతీయ విద్యా సంస్థలను ప్రారంభించినా తగిన నిధులు, మౌలిక వసతులు కల్పించలేదన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ నిర్మాణాత్మక ప్రతిపక్షం ఏర్పడవలసిన సమయం ఆసన్నమైందన్నారు. కార్పొరేట్ రాజకీయాలకు భిన్నంగా ప్రజల మేలు కోరే రాజకీయలు రావాలన్నారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి ఏడు లక్షల కోట్లకు పైగా అప్పులు ఉండగా, గత సంవత్సర కాలంలోనే 1.56 వేల కోట్లు అదనంగా అప్పులు చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నేడు పోలవరం - బనకచర్ల భారీ నీటిపారుదల ప్రాజెక్టును రూ.82 వేల కోట్లతో నిర్మించ తలపెట్టడం అర్థరహితమన్నారు. జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం కార్యదర్శి అవధానుల హరి ప్రసంగిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు ఐక్యమై నిర్దిష్ట ప్రణాళికతో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీల అమలుకు కృషి చేయాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు షేక్ మస్తాన్ వలి, ప్రొఫెసర్ డి. ఏ. ఆర్. సుబ్రమణ్యం, ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు, ప్రొఫెసర్ విజయ్ కుమార్, డాక్టర్ కొల్లా రాజమోహన్, జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం అధ్యక్షులు మేడా శ్రీనివాస్, డాక్టర్ టి. సేవ కుమార్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, ప్రొగ్రెసివ్ ఫోరం అధ్యక్షులు మల్లికార్జునరావు తదితరులు ప్రసంగించారు.

## పేదలకు అన్నదానం

చీరాల రూరల్ (బాపట్ల జిల్లా) రేపటి కోసం: మండలంలోని దేవాంగపురి గ్రామంలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పేదలకు అన్నదాన జరిగింది. బట్ల మోహన్‌రావు పుష్పవల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 60 మందికి పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ బట్ల మోహన్‌రావు మాట్లాడుతూ వేసవికాలం కావ డంతో అందరూ ఉండు గుడ్డలు తలకు ధరించి సకాలంలో రావాల్సిందిగా సూచించారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ఎక్కువగా మజ్జిగ మంచి నీరు తాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గుత్తి



పరంజ్యోతి, సత్రం రోహిణి కుమార్, పేదలు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలపై అవగాహన

వేటపాలెం(బాపట్లజిల్లా) రేపటి కోసం: ఉన్నత చదువులు చదివినవారికినాయకత్వ లక్షణాలు అధికంగా ఉంటాయని సాహితీ వేత్త, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు బట్ల మోహన్‌రావు తెలిపారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో కిషోరి బాలికలకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాజకీయ నాయకులు, సేవా నాయకులు, భక్తి భావ స్వాములు నాయకత్వ లక్షణాలతో ఎందరినో మంచి మార్గంలో నడిపిస్తున్నారని గుర్తు చేశారు. స్కూలు దశ నుండే నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటే భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్



సజ్జ పుష్పవల్లి, అంగన్వాడీ కార్యకర్త ప్రసన్న కిషోరి బాలికలు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పూసపాడు బ్రిడ్జి

- పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు
- నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ప్రజల వేడుకోలు



పర్చూరు( బాపట్ల జిల్లా )రేపటి కోసం: ఇంకొల్లు మండల పరిధిలోని పూసపాడు గ్రామ అడ్డ రోడ్డు సమీపంలో పర్చూరు - ఇంకొల్లు పాత మద్రాస్ రోడ్లో శిథిలావస్థకు చేరిన పాత బ్రిడ్జిని తొలగించి, నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేసి వాహనదారులు పడుతున్న అవస్థలను తొలగించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పాత మద్రాస్ రోడ్ లో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ బ్రిడ్జ్ స్లాబ్ పడిపోయి కూడా ఐదు సంవత్సరాలు కావస్తున్న సంబం ధిత అధికారులు బ్రిడ్జి నిర్మాణాన్ని పట్టించుకోవడంలేదని గ్రామస్తులు, వాహనదారులు విమర్శిస్తున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ సింగిల్ వే బ్రిడ్జి పై నుండి గతంలో భారీ వాహనాలు కూడా ప్రయాణం చేసేవి. బ్రిడ్జి శిథిలా వస్థ కు చేరి స్లాబ్ పడిపోయిన అనంతరం బ్రిడ్జి తూర్పు భాగంలో సిమెంట్ తూములతో చప్టా నిర్మాణం చేసి వాహ నాల రాక పోకలకు తాత్కాలికంగా డైవర్షన్ ఇచ్చారు. డైవర్షన్ రోడ్డు అంతా గుంతలమయమైంది. రోడ్డు మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. ఈ చప్టా గుండా భారీ వాహనాలు ప్రయాణించడం ప్రస్తుతం వాహన చోదకులకు కష్టతరంగా మారింది. ఈ చప్టా రోడ్డు ఇరువైపులా ఆర్ అండ్ బి రోడ్డు కలిసే చోట ఎత్తుగా ఉండడంతో గర్భితో వెళ్లే ట్రాక్టర్లు, భారీ లోడ్ తో వెళ్లే ఇతర వాహనాలు పైకి చేరులేక వాహనాలు పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో వాహ నాలు ఎదురెదురుగా వస్తున్నప్పుడు రోడ్డు మార్జిన్ లేక వాహన చోదకులు పలు ఇక్కట్లు పడుతున్నారు. గుంతల మయమైన చప్టా రోడ్డులో ప్రయాణించే వాహనదారుల ఇక్కట్లు వర్ణాతీతం. శిథిలావస్థకు చేరిన ఈ బ్రిడ్జ్ కప్పల వాగు పై నిర్మాణం చేపట్టి ఇప్పటికి 80 నుండి 90 సంవత్సరాలు పైగా కావడంతో వాగు నీటి వృద్ధికి రాతితో కట్టిన భూనా పిల్లర్లు కింది కి కృంగిపోయి బ్రిడ్జ్ పై స్లాబ్ కొన్ని కానాల వద్ద కూలింది. గత ఐదు సంవత్సరాలకు పైగా ఈ బ్రిడ్జ్ పై రాకపోకలను నిలిపివేశారు . అయితే బ్రిడ్జికి ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ మధ్య లో భారీ గుంతలుండటంతో ద్విచక్ర వాహనదారులు ఈ బ్రిడ్జిపై ప్రయాణిస్తూ వెళుతున్నారు. బ్రిడ్జ్ స్లాబ్ ఎప్పుడైనా కూలిపోయి ప్రమాదం జరగవచ్చని స్థానిక గ్రామాల ప్రజలు అంటున్నారు. బ్రిడ్జి పై వాహనాలు ప్రయాణించకుండా కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యే వరకు ప్రమాదం జరగకుండా బ్రిడ్జికి ఇరువైపులా గోడ నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో వాహనదారులు ఇబ్బంది పడిన పరిస్థితులు చాలానే ఉన్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు కప్పల వాగు ఉధృతంగా ప్రవహించి చప్టాపై భారీగా నీరు ప్రవహి స్తున్న పుడు వాహనా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. చప్టాకు ఇరువైపులా పోలీస్ సిబ్బందిని కాపలా ఉంచి ప్రమాదాలు జరగకుండా చూసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. గత పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. వేసవిలో బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించి ఉన్నట్లయితే వర్షాకాలం వచ్చే సమయానికి పూర్తయి ఉండేదని గ్రామాల ప్రజలు అంటున్నారు. అందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నూతన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆ గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## వాటర్ ప్లాంట్‌లో ఉద్యోగికి ఆర్థిక చేయూత



పర్చూరు(బాపట్ల జిల్లా) రేపటి కోసం: నాగులపాలెం వాటర్ ప్లాంట్ లో ఉద్యోగిగా పనిచేస్తున్న అభిరామ్‌కు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థికచేయూతను కల్పించారు. ఇటీవలి రోటరీ క్లబ్ సభ్యులు అందించిన విరాళంతో రూ. 90వేలు నగదును వాటర్ ప్లాంట్ లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అందజేశారు. నాగులపాలెం గ్రామానికి చెందిన పొట్టూ అభిరామ్ తండ్రి హరిబాబు, సోదరుడు మణికంఠ ఇటీవల ఇరువురు ఒకేసారి మరణించడం జరిగింది. ఈ కారణంగా అభిరామ్ కుటుంబాన్ని ఆదుకునే నిమిత్తం ఆర్థిక చేయూతని కల్పించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ సందర్భంగా తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నాగులపాలెం వాటర్ ప్లాంట్లో ఉద్యోగిగా చేస్తున్నడు అని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు తేళ్ల రమేష్ చంద్ర, నాగుబడి సుబ్బారావు, నాగబైరు శ్రీనివాసరావు, కెపిసిఆర్కె.ప్రసాద్, కొల్లా నరేంద్ర కుమార్, పాబోలు ఉదయభాస్కర్, కాసా అశోక్ కుమార్, కారుమంచి సుబ్బారెడ్డి, పాబోలు వెంకటేశ్వర్లు, కోదూరి సుబ్రహ్మణ్య చారి, కోట శ్రీనివాసరావు, నాగులపాలెం గ్రామ వైస్ సర్పంచ్ అడ్డగడ రామకృష్ణ , ఆర్బీసీ సెక్రటరీ అడ్డగడ చిన్న నాగేశ్వరరావు, కొల్లా భాస్కరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాటుసారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి



బాపట్ల, రేపటి కోసం: నాటు సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు మద్య నిషేధ, అబ్కారీ శాఖ కసరత్తు చేపట్టింది. మంగళవారం మండల పరిధిలో వెదుళ్లపల్లి, స్వర్ణపురం, బేతపూడి గ్రామాలలో ప్రచార రథం ద్వారా నాటుసారా తయారీ వలన కలిగే అనర్థాలపై బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి బి.వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ నాటుసారాయి సేవించడం వల్ల కలిగే అనా ర్థాలు, దానిని తయారుచేసిన లేదా అమ్మిన తీసుకునే చట్టపరమైన చర్యల గురించి ఇరు గ్రామాల ప్రజలకి తెలియజేయడమైనది. అదే విధంగా ఇరు గ్రామాలలో ఎవరైనా నాటు సారాయి అమ్మిన లేదా తయారుచేసిన, ఆ క్రింది తెలుపబడిన ఫోన్ నెంబర్లకు సమాచారం అందించవలెనని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపి, రెండు గ్రామాలను నాటుసారాయి రహిత గ్రామాలుగా తీర్చి దిద్దుటకు వారి వంతు సహాయం చేయవలసిందిగా ఇరు గ్రామాల ప్రజలను కోరడమైనది. సమాచారం అందించవలసిన నెంబర్లు, 9440902478- పి.గీతిక, బాపట్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్, 9000393199- డి.ప్రభుదాస్, బాపట్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ. కార్యక్రమంలో వెదుళ్లపల్లి ఎస్ఐ భాగ్యరాజ్, చిన్న గంజాం డీ-అడిక్షన్ సెంటర్ కో-ఆర్డినేటర్ నాగూర్ బాషా, సీని యర్ కౌన్సిలర్ ఎస్కే.ఏ.బషీర్, బాపట్ల రెడ్‌క్రాస్ సిబ్బంది వెదుళ్లపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్

- జూన్ రెండో వారంలో కొనుగోలు ప్రారంభం
- మార్టూరు, పర్చూరు, ఇంకొల్లు మార్కెట్ యార్డుల్లో కొనుగోలుకు చర్యలు



పర్చూరు (బాపట్ల జిల్లా) రేపటి కోసం: నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యలపై గట్టు పట్టు వదలని విక్రమార్కుడిలా కృషిచేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రయత్నాలు ఎట్టకేలకు ప్రయత్నాలు ఫలించాయి. జూన్ రెండో వారం నుంచి నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు.పొగాకు సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అంశంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రిన్సిపల్ సెక్రటరీతో ఫోన్లో మాట్లాడారు. పొగాకు కొనుగోలుకు శ్రీకారం చుట్టాలని కోరారు. రేపు క్యాబినెట్లో సైతం పొగాకుపై చర్చిస్తామన్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం జూన్ రెండో వారంలో పొగాకు కొనుగోలుకు రంగం సిద్ధం చేసింది. మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఇప్పటికే రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మార్కెటింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందించనున్నారు. పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు మార్కెట్ యార్డులలో మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

## నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



వేటపాలెం (బాపట్లజిల్లా), రేపటికోసం: వేటపాలెం పరిసర ప్రాంత పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా హెరాల్డ్ జన్ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసినట్లు స్కూల్ డైరెక్టర్ డా.పొగడదండ రవికుమార్ తెలిపారు. మండలంలోని రామన్నపేట పంచాయతీ సాయినగర్‌లోని హెరాల్డ్ జన్ పబ్లిక్ స్కూలు నందు మంగళవారం ఆయన పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ తన 32 సంవత్సరాల అధ్యాపక అనుభవంతో ప్రస్తుత లోపభూయిష్ట విద్యా విధానంతో విద్యార్థులు మా ర్కులు సాధిస్తున్నారే తప్ప విజ్ఞానం పొందలేకపోతున్నారని, సమాజం ద్వారా తాను ఎంతో పొందానని, తిరిగి సమాజానికి తాను పొందింది తిరిగి ఇచ్చేందుకు ఆధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన క్వాలిఫైడ్ ఉపా ధ్యాయులతో క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించాలనే లక్ష్యంతో స్కూల్ ఏర్పా టు చేశామని, ఈ నెల 12 నుంచి నర్సరీ నుంచి 7వ తరగతి వరకు క్లాసులు ప్రారంభమవుతున్నాయన్నారు. పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో అన్ని వసతులతో చిన్నారుల్లో విద్యలో గట్టి పునాది వేసేలా బోధించడం జరుగుతుందన్నారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను పేదలకు అందివాలనే తన లక్ష్యానికి కుటుంబ సభ్యుల సహకా రం ఉందని, ప్రభుత్వ బడుల్లో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నప్పటికీ సరైన విద్యా బోధన లేకపోవడం వలనే ప్రైవేట్ స్కూళ్ళ పెరిగాయని, వ్యాపార పరంగా కాకుండా సేవా పరంగానే స్కూల్ నడుపుతుందని తెలిపారు.

## సముద్ర తీరంలో పోర్ట్, షిప్ మేకింగ్ యూనిట్ నిర్మించండి



పర్చూరు( బాపట్ల జిల్లా) రేపటి కోసం: చిన్నగంజాం సముద్ర తీర ప్రాంత అభివృద్ధి కోసం గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ మరియు షిప్ మేకింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు.ఈ మేరకు మంగళవారం మంత్రి వద్ద ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశమై వినతిపత్రం అందజేశారు. పోర్టులు,షిప్పింగ్ హార్బర్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని, పోర్టు నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నగంజాం తీర ప్రాంతం లాజిస్టిక్స్, షిప్ మానుఫ్యాక్చరింగ్‌కు అనువైన ప్రదేశమని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందని చెప్పారు.చిన్నగంజాం ప్రాంతం భౌగోళికంగా పోర్టు నిర్మాణానికి అనువుగా ఉండటంతో పాటు, సముద్ర రవాణా అభివృద్ధికి తోడ్పడుతుందని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు.ఈ ప్రతిపాదనలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సమావేశంలో చర్చిస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.ఎమ్మెల్యే ఏలూరితో పాటు మార్కెట్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు ఉన్నారు.

## వేడుకగా శిడి మహోత్సవం

వేటపాలెం (బాపట్ల జిల్లా), రేపటికోసం: మండలంలోని దేశాయిపేట పంచాయతీ ఆటుమల్లిపేటలో, వేటపాలెం పంచాయతీ నాయునిపల్లిలో మంగళవారం శ్రీ పోలేరమ్మ అమ్మవారి శిడి మహోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయా గ్రామాల్లో శిడిమానును మేళతాళాలతో ఊరేగింపు అనంతరం గుడి ప్రదక్షిణలు మేకపోతుతో చేయించారు. కార్య క్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## రేషన్ షాపులు ఆకస్మిక తనిఖీ



వేటపాలెం (బాపట్ల జిల్లా), రేపటికోసం: మండలంలోని కొత్తపేట పంచాయతీలో పలు రేషన్‌షాపులను చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. వృద్ధులు, దివ్యాంగు ఇళ్లకు వెళ్లి రేషన్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సం దర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రేషన్ షాప్ వద్ద కార్డుదారులకి ఇబ్బంది లేకుండా మంచినీళ్ళు, నీడ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని డీలర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ పి.పార్వతి, వీఆర్వోలు, రేషన్ షాపుల డీలర్లు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి



చీరాల (బాపట్ల జిల్లా), రేపటికోసం: వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చీరాల నియోజకవర్గం ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు సూచనల మేరకు చీరాల పట్టణ అధ్యక్షుడు యాతం మేరీబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చీరాల వైసీపీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణ వైఎస్ఆర్సీపి కార్యాలయంలో మంగళవారం వైసీపీ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రెడ్‌బుక్ పరిపాలనను అంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వాసిమల్ల వాసు, మున్సిపల్ వింగ్ జిల్లా అధ్యక్షులు బత్తుల అనిల్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్ బాబు, వైయస్ఆర్సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, చిరంజీవి మాస్టర్, వైఎస్ఆర్సిపి యువ నాయకులు పోతురాజు, జక్రయ్య, చక్రవర్తి, సల్లూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని ఎత్తులు వేసినా జగన్‌ని ప్రజలు నమ్మరు: అనురాధ



వేమూరు( బాపట్ల జిల్లా) రేపటికోసం : గంజాయి మత్తులో ఆగడాలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టడమే కాకుండా పోలీసులు పై తిరగబడుతున్న గంజాయి బ్యాచ్‌కి మద్దతుపడుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఏమిని సందేశం ఇస్తారని జనసేన పార్టీ జిల్లా కార్య దర్శి సోమరౌతు అనురాధ ప్రశ్నించారు. మంగళవారం విలేక రులతో మాట్లాడుతూ తెనాలి పట్టణంలో గంజాయి మత్తులో పోలీ సులపై తిరగబడినటువంటి యువకులను పోలీసులు మందలిస్తే దాన్ని ఆసరాగా చేసుకుని రాష్ట్రంలో ఏదో జరిగిపోతుంది అన్న ట్లుగా వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శ యాత్ర చేయడం ఆయనకి తగిందన్నారు. కూటమిప్రభుత్వంలో గడిచిన ఏడాది కాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందిస్తుంటే దాన్ని చూసి ఓర్వలేక ప్రభుత్వ ప్రతిష్టను దిగజారచాలన్న ఉద్దేశంతో వైసిపి నేతలు ఇలాంటి అరా చకాలు పాల్పడుతున్నారని అనురాధ విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నిన రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన మర్చిపోలేరని అనురాధ తెలియజేశారు. ఇక నైనా వైసీపీ నేతలు రాష్ట్ర అవసరాలకు, ప్రజా సంక్షేమానికి సూచ నలు చేస్తే ప్రజలు హర్షిస్తారు తప్ప కావాలని రెచ్చగొట్టే ప్రయత్నా లు చేస్తే ప్రజలు జగన్మోహన్‌రెడ్డి నమ్మే పరిస్థితి లేదని గ్రహించుకోవాలని ఆమె హితవు పలికారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ మురళి



బాపట్ల, రేపటి కోసం: కొత్తగొల్లపాలెం, చిన్నగంజాం మండలం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ ఒక టవ తేదీన నిర్వహించిన పి4 కార్యక్ర మంలో భాగంగా ఎంపిక కాబడిన చిన్నగంజాం మండలంలోని కొత్త గొల్లపాలెం గ్రామానికు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి ఇచ్చిన హామీలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. కొత్త గొల్లపాలెం అభివృద్ధి పనులను అధికారులందరూ చిత్తశుద్ధితో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యూ ఎస్. ఈ అనంతరాజు, పిడి డ్వామా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, ఏపీ సీపీడీసీఎల్ ఈఈ మల్లిఖార్జునరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్,సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, చిన్నగంజాం తహసిల్దార్ ప్రభాకర్, వీక్షణ సమావేశం ద్వారా సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## 'వెన్నుపోటు, గొడ్డలి వేటు పేటెంటు జగన్‌దే'

చీరాలరూరల్ (బాపట్లజిల్లా), రేపటికోసం: వెన్నుపోటు, గొడ్డలివేటుకు పేటెంటు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దేనని చీరాల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ ధ్వజమెత్తారు. ప్రజలు ఆ పార్టీని భూస్థాపితం చేసి 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని ఆయన మండిపడ్డారు. వేటపాలెం మండలం కొత్తపేటలోని చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశా నుసారం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వీరభద్రయ్య, ఏఎంసీ చైర్మన్ జనార్దన్, చీరాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుంజి పురుషోత్తం, గుమ్మా వెంకటేష్, పూర్ణ , జాగ్రత్తని పోతురాజు, పులి వెంకటనారాయణ, తేలప్రోలు నాగేశ్వరరావు, బాలచంద్ర, చప్పిడి వెంకట్రావు, కె.శ్రీను, వెంకటేశ్వరరావు, లింగమూర్తి పాల్గొన్నారు.




## 10న నాగవరపమ్మ శిడి మహోత్సవం

వేటపాలెం (బాపట్ల జిల్లా), రేపటికోసం: మండలంలోని రావూరిపేట గ్రామ శివారులోని పచ్చని పంట పొలాల్లో కొలువైయున్న భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లి శ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారి శిడి మహోత్సవం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పోతిని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు చిన్నగంజాం మండలం సంతరావూరు, వేటపాలెం పరిసర ప్రాంతాల్లో కొలువులు జరుగుతున్నాయి. అమ్మవారికి పసుపుకుంకుమలు చెల్లించు ఆచారం ఉన్నదున ఈనెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రూ. 400 చెల్లించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆలయ మేనేజర్ శ్రీనివాసరావు కోరారు. పూర్వం అమ్మవారికి శిడి మహోత్సవాన్ని నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. కాలక్రమంలో అది కాస్తా పది రోజులకు చేరింది. సంతరావూరులో ఆరు రోజులు, ఆలయం వద్ద మూడు రోజుల పాటు ఈ కొలుపులు జరుగుతాయి. ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి రోజు అమ్మవారి శిడి మహోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శిడి మహోత్సవానికి తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శిడి మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ మేనేజర్ కోరారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



భట్టిప్రోలు(బాపట్లజిల్లా), రేపటికోసం: మండల కేంద్ర మైన భట్టిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యు త్‌కు అంతరాయం ఏర్పడుతుందని భట్టి ప్రోలు సబ్‌స్టేషన్ ఏఈ యం. శాంతకుమారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరమ్మత్తుల దృష్ట్యా ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు భట్టిప్రోలు పంచాయతీ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఆమె తెలిపారు. ఈ అంతరాయాన్ని, అసౌకర్యాన్ని ప్రజలు, వినియో గదారులు తెలుసుకొని సహకరించవలసిందిగా ఆమె కోరారు.

## గోదాములు ఆకస్మిక తనిఖీ

పర్చూరు(బాపట్లజిల్లా),రేపటి కోసం: జిల్లా కలెక్టర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పర్చూరు, ఇంకొల్లు మార్కెట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుల్లోని గోదాములను పరిశీలించినట్లు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ కరుణ శ్రీ తెలిపారు. మంగళవారం పర్చూరు మార్కెట్ యార్డ్‌లోని గోదాములను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయ ఉత్పత్తులను నిలువ ఉంచడానికి అనుకూలంగా ఉన్నాయా లేదా అని పరిశీలన కు వచ్చినట్లు చెప్పారు. ఫ్లాట్ ఫామ్ లు ఉన్నాయా, గోదాముల వెంటిలేషన్ సరిగ్గా ఉందా, ఎన్ని గోదాములు అందుబాటులో ఉన్నాయి, గోదాముల కెపాసిటీ ఎంత అని వ్యవసాయ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ మూడు మండలాల్లోని గోదాముల స్థితిగతుల నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టరు, మార్క్‌ఫెడ్ ఎండికి సమర్పిస్తామని చెప్పారు. గోదాముల పరిస్థితి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఏమైనా మైనర్ రిపేర్లు ఉంటే చేయిస్తామని చెప్పారు. మార్కెట్ యార్డ్ సిబ్బందికి సూచనలు చేశారు. నివేదిక సమర్పించిన అనంతరం తదుపరి చర్యలను జిల్లా అధికారులు తీసుకుంటారని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. ఈమె వెంట ఏడిఏ మోహన్‌రావు, పర్చూరు ఏవో రామ్మోహన్ రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి, టిడిపి నాయకులు వెంకటేశ్వర్లు, శోభన్ బాబు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



## వేమూరు రైల్వేస్టేషన్‌లో నాసిరకంగా అభివృద్ధి పనులు

- పట్టించుకోని అధికారులు



వేమూరు( బాపట్ల జిల్లా) రేపటి కోసం : వేమూరు రైల్వే స్టేషన్ లో కోటి రూపాయల పైగా వ్యయంతో నిర్మాణం అవుతున్న వివిధ అభివృద్ధి పనులలో నాణ్యత లోపించి నాసిరకంగా జరుపుతున్నారు, రైల్వే స్టేషన్‌కి వచ్చే ప్రయాణికులు కూడా ఈ నాసిరకం పనులు చూసి ముక్కుని వేలు వేసుకుంటున్నారు, వివరాల్లోకెళ్తే వేమూరు రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాం వద్ద రిటైనింగ్ వాల్ ప్రహరీ నిర్మాణం చేపట్టారు సుమారు ఐదు అడుగుల లోతు నుంచి కాంక్రీట్ బెడ్ వేసి దానిపై కొంతమేర కాంక్రీట్ కూడా నిర్మించి ప్రహరీ నిర్మాణం చేపట్టారు, అయితే పునాదిలో వేసే బెడ్ తూతూ మంత్రంగా వేయడంతో పాటు తీసిన గుంతను బురదతో పూడ్ చాల్చి ఉండగా అక్కడ ఉన్న మట్టిని త్వ్వి గుంతను పొల్లడంతోపాటు అది పూర్తిగా ఆనగదొక్కకుండానే దానిపై కాంక్రీట్ బెడ్ వేస్తున్నారు ఈ పనులను పర్యవేక్షించాల్సిన రైల్వే అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో కాంట్రాక్టర్లు వారి ఇష్టానుసారంగా నాసిరకం పనులు నిర్వహిస్తూ రైల్వేకు అపార నష్టం కలిగిస్తున్నారు, రోజు రైలుకు వెళ్లే ప్రయాణికులు రైల్వే స్టేషన్ లో జరుగుతున్న నాసిరకం పనులు చూసి ముక్కున వేలేసుకోవాల్సి వస్తుంది ప్రయాణికుల సౌకర్యార్థం కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తుంటే కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తూ అటు రైల్వేకు ఇటు ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నారని దీనిపై తక్షణం రైల్వే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

## ప్రజాసమస్యలపై పోరాటానికి వైసీపీ నేతలు సిద్ధం కావాలి: ఎమ్మెల్సీ మొండితోక



**నందిగామ(ఎన్టీఆర్)రేపటికోసం:** ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టి, ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ నేతలక ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. నందిగామ పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల, పట్టణ ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ వైయస్ఆర్కాంగ్రెస్పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్రెడ్డి పిలుపు మేరకు ఈనెల 4వ తేదీన చేపట్టినవెన్ను పోటు దినం కార్యక్రమన్ని నందిగామ నియోజకవర్గంలో విజయవంతం చేయాలని నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ఐనా ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. అధికారపార్టీ బెదిరింపులకు, కేసు లకు భయపడక పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నిక కాబ డిన పట్టణ అధ్యక్షులు మహమ్మద్ మస్తాన్, మండల అధ్య క్షులు మం చాల చంద్రశేఖర్లను నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల, పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**నందిగామ(ఎన్టీఆర్)రేపటికోసం:** ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. నందిగామ పట్టణం కాకాని నగర్ లో ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయం లో నందిగామ నియోజక వర్గానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు 14 లక్షల 19 వేల 958 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి కూటమి నేతతో కలిసి స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య అందించడం కూటమి ప్రభుత్వంలో జరుగుతుందని తెలియజేసారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్న సంక్షేమం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం అని ప్రజారంజక పాలనలో ప్రజలు సుభిక్షంగా రాష్ట్ర ప్రజలు ఉన్నారని ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమం లో 4 మండలాల నాయకులు పాల్గొన్నారు



## నేడు దేవినేని రమణ, ప్రణీతల వర్ధంతి

**నందిగామ(ఎన్టీఆర్)రేపటీకోసం :** ఈ నెల 4 వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్ లో స్వర్గీయ దేవినేని వెంకటరమణ, ప్రణీత ల 26వ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం మరియు సంతాప సభ నిర్వహించడం జరుగుతుందని పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎచూరి రాము తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు పాల్గొంటారని తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు, దేవినేని వెంకటరమణ అభిమానులు, ప్రజలందరూ పాల్గొని ఈ కార్యక్రమానికి జయప్రదం చేయాలని కోరారు .

### కంచికచర్లలో..

**కంచికచర్ల (ఎన్టీఆర్) రేపటి కోసం:** బుధవారం ఉదయం 10 గంటలకు కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దేవినేని వెంకటరమణ 26వ వర్ధంతి సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి నేతలు, కార్యకర్తలు, రమణ అభిమానులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొంటారని అందరూ హాజరు కావాలని బాబు విజ్ఞప్తి చేశారు.

## కౌలు రైతులు సమస్యల పరిష్కరించాలి



**వీరులపాడు (ఎన్టీఆర్) రేపటి కోసం:** వీరులపాడు మండలం జుజ్జూరు కేంద్రంలో ఇన్చార్జి తహసిల్దార్ నాగరాజుకు సోమవారం కార్యాలయంలో కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. రైతుకు కౌలు కార్డు ఇవ్వాలని భూ యజమాని సంతకం తొలగించి గ్రామసభల ద్వారా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ ప్రతికౌలు రైతుకు ఇవ్వాలని ఓసి కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ ఇవ్వాలిభూమి స్వభావంతో సంబంధం లేకుండా వేసిన ప్రతి పంటను ఈ క్రాప్ చేయాలి. రైతులు సాగుదారుల పంట రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలి అని కోరుతూ తహసిల్దార్ కార్యాలయంలో ఇంచార్జ్ తహసిల్దార్ నాగరాజు కు కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి, పల్లికంటి విల్సన్, తదితరులు మెమోరాండం ఇవ్వటం జరిగింది

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**కంచికచర్ల(ఎన్టీఆర్) రేపటి కోసం:** కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రికెట్ టోర్నమెంట్ను కంచికచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ కోగంటి బాబు మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూక్రీడలు శారీరక దృఢత్వానికి మాత్రమే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదం చేస్తాయన్నారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని చిన్ని సహకారంతో ప్రభుత్వ విప్ నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య నియోజకవర్గంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మైదానాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు కోగంటి బాబుకు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానికనేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగన్ హయాంలో దళితులకు అన్యాయం

- గంజాయి మాఫియాకు కేరాఫ్ అడ్రస్ జగన్ పాలన
- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ(ఎన్టీఆర్)రేపటికోసం:** వైఎస్ జగన్ రెడ్డి పాలనలో ఈ రాష్ట్రం లో దళితులు ఎదుర్కొన్న అవమానాలు, దాడులు, అన్యాయాలు ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని ప్రభుత్వవిప్ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లా డుతూ తెనాలిలో జరిగిన ఘటనపై జగన్ స్పందన చూస్తే, దళితుల పట్ల ఉన్న అసలు ధోరణి మళ్లీ బయటపడిందన్నారు. నిజమైన బాధితులకు మొహం చూపని జగన్, నేరస్తులను పరామర్శించడం మానవత్వమా? అని ఆమె ప్రశ్నించారు. తెనాలిలో ఓ కానిస్టేబుల్ను చంపేందుకు ప్రయ త్నించిన గంజాయి మాఫియాతో సంబంధాలున్న రౌడీషీటర్లను పరామర్శించేందుకు జగన్ వెళ్లడం ఎంత దుర్మార్గమో ప్రజలంతా గమనించాలని కోరారు నేరస్తులను కులం పేరు తో రక్షించాలనుకోవడం కేవలం కుల రాజకీ యం మాత్రమే కాదు ఇది పోలీసు వ్యవస్థను అవమానపరచడం, దళితుల గౌరవాన్ని కించ పరచడమే అని అన్నారు. జగన్ పాలనలో దళి తుల పట్ల లెక్కలేనన్ని దాడులు జరిగాయని ఆమె గుర్తు చేశారు. డాక్టర్ సుధాకర్ మాస్కులు అడిగినందుకు లాఠీతో కొట్టించారు. మానసిక రోగిగా చిత్రీకరించారు. చివరికి చంపేశారు. ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ని హత్య చేసి మృతదేహాన్ని ఇంటి ముందు వదిలారు. ప్రభు త్వం న్యాయం చేయలేదు. అతన్ని కనీసం పదవి నుంచి కూడా తొలగించలేదు. పోలీస్ స్టేషన్లో దళిత యువకుడిని అవమానించారు. నందిగామ దళితులపై అనేక దాడులు చేశారు. ఇళ్ల స్థలాల కబ్జాలు, మహిళలపై దాడులు, ముఖ్యంగా చదువుకుంటున్న దళిత విద్యార్థిపై మూత్రం పోసిన ఘటనలో కూడా జగన్ ఎక్కడా స్పందించలేదు. ఈ రోజున జగన్ రెడ్డి తెనాలి లో పర్యటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలంతా జగన్ నీచమైన రాజకీయాలను గమనిస్తున్నారని ఆమె తెలిపారు

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**కంచికచర్ల (ఎన్టీఆర్) రేపటి కోసం:** మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల పట్టణంలో ఇస్లామియా దారుల్ ఉలూమ్ అరబ్బీ మదర్సా మరియు ఖాతమున్ మసీదును మైనారిటీ మత పెద్దలు, మైనారిటీ సోదర సోదరీమణులు, కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు . ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మైనా రిటీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యని శాలువాతో సన్మానించారు.

## పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణయ్య

**తిరువూరు (ఎన్టీఆర్) రేపటికోసం:** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన నిరుపేదలందరికీ నివేశన స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అలవికాని హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం ఇప్పుడు వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున నివేశన స్థలాలు తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కే.నాగులమేర, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎస్ కే సుభాని, తిరు వూరు మండల పట్టణ కార్యదర్శులు నృసింహాద్రి వనమాలి, మాలపాటి ఉదయ్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.



## పాడి రైతులకు దాణా పంపిణీ



**కొండపల్లి (ఎన్టీఆర్)రేపటి కోసం:** కొండపల్లి మున్సిపాలిటీలో గల పశువైద్య శాలలో పాడి రైతులకు 50 శాతం సబ్సిడీ మీద సమీకృత దానాను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని టీడీపీ కొండపల్లి మున్సి పాలిటీ అధ్యక్షులు శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు యండి అఫ్సర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకయ్య నాయుడు, కుమ్మరి శ్రీనివాస్, ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన ఉపా ధ్యక్షులు బొలియాశెట్టి శ్రీకాంత్, కొండపల్లి జనసేన పార్టీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, కొరటా శ్రీనివాసరాజు, బసవ ఉమా, కంప కోటేశ్వరరావు, చక్రవర్తి, కోరేటి చక్రవర్తి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల బకాయిలు చెల్లించాలి



**తిరువూరు (ఎన్టీఆర్) రేపటి కోసం:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తదుపరి కార్మికులకు పదవీ విరమణ అనంతరం రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తిరువూరు ఆర్టీసీ డిపోలో 35 సంవత్సరాలు డ్రైవరుగా పనిచేసి పదవీ విరమణ చేసిన బొమ్మదేవర రవిచంద్ర వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రిటైరైన తర్వాత బకాయిలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రసాద్, తిరువూరు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వెన్నుపోటుదినం పోస్టర్ ఆవిష్కరణ



**నందిగామ(ఎన్టీఆర్)రేపటికోసం:** వైసిపీ అద్వర్యంలో ఈ నెల 4 వ తేదీన బుధవారం జరప తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం వాల్ పోస్టర్ ను నందిగామ నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ వైసీపీ శ్రేణులతో కలిసి మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, శాసన మండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏడాది పాలన పట్ల ప్రజలు పడుతున్న కష్టాలు తెలియజేయడమే తమ ఉద్ధేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నందిగామ పట్టణ, మండల కన్వీనర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## జవహర్కు ఎమ్మెల్యే సౌమ్య అభినందనలు



**నందిగామ (ఎన్టీఆర్) రేపటికోసం:** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్గా నియమితులైన కొత్తపల్లి శామ్యూల్ జవహర్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో నందిగామ శాసన సభ్యురాలు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తం గిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య కొత్తపల్లి శామ్యూల్ జవహర్కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ఎస్సీ సెల్ నేతలు పాల్గొన్నారు.

## 8న ముద్దులమ్మ వరదపాశం మహోత్సవం



**కంచికచర్ల (ఎన్టీఆర్) రేపటి కోసం:** కంచికచర్ల మండల పరిధిలోని గొట్టుముక్కల గ్రామంలో అటవీ ప్రాంతంలో గత 150 సంవత్సరాల క్రితం స్వయంభుగా వెలసిన ముద్దులమ్మ తల్లికి వరద పాశం ఈనెల 8న ఆదివారం పోస్తున్నట్లు ఆల య కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ముద్దులమ్మ తల్లి దేవా లయం ప్రస్తుతం భక్తులు పర్యాటకులతో కిటకిటలాడుతోంది. వర్షాభావ పరిస్థితులలో ఈ తల్లికి వరద పాశం పోస్తే వర్షం తప్పనిసరిగా కురుస్తుందని పూర్వం నుంచి వస్తున్న ఆచారం. ఈ ఆచారాన్ని గొట్టుముక్కల, పరిటాల, నరసింహా రావు పాలెం తదితర గ్రామాల ప్రజలు నమ్మకంతో ముద్దు లమ్మ తల్లికి వరద పాశం పోస్తూ ఉంటారు. ఈనెల 8 న మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి వేద పండితులు, పురోహితులు వరద పాశం పోస్తారు. చిరు చినుకులు పడటం ఆనవాయితీగా వస్తుంది. అమ్మవారి ఈ మహత్యాన్ని చూడ్డానికి భక్తులు వేలాదిగా వస్తారు. భారీ ఎత్తున అన్నదానం చేస్తారు.

## ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

**నందిగామ(ఎన్టీఆర్)రేపటికోసం:** నందిగామ పట్టణం చెరువు బజార్ సాయినగర్లో వేంచేసి ఉన్న శ్రీ షిరిడి సాయి బాబా మందిర 24 వ వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త తమ్మినేని మల్లికార్జునరావు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు దెందులూరి కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు వేదోక్తంగా జరిగాయి. స్వామివారి పూ జాక్ర తువుల్లో పులిపాటి శ్రీనివాసరావు కాకర్ల కిషోర్ కుమార్ కృష్ణ సాహి, ఉన్న నాగేశ్వరరావు అన్నపూర్ణ, గంగుల సురేష్ రజిత దంపతులు భక్తులు పాల్గొన్నారు, సాయంత్రం షిరిడి సాయి నాథ్ నామస్మరణ నడుమ పల్లకి సేవ, గ్రామోత్సవం కన్నుల పండుగ జరిగింది



## ఖచ్చితమైన తూకంతో రేషన్ సరుకులు అందించాలి

- డిప్యూటీ తహశీల్దార్ వేమూరి మానస



**కంచికచర్ల(ఎన్టీఆర్)రేపటికోసం:** కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో మంగళవారం నాడు కంచికచర్ల డిప్యూటీ తాసిల్దార్ రేషన్ షాపులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు వయస్సు పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ సరుకులు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఈ- ఫోస్ యంత్రంలో కార్డుదారులు వివరాలు నమోదు, బియ్యం తూకం వేసే విధానాన్ని తహసీల్దారు పరిశీలించారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదు లేకుండా పారిదర్శకంగా రేషన్ పంపిణీ చేయాలని రేషన్ షాపు దారులకు డిప్యూటీ తాసిల్దార్ మానస ఆదేశించారు.

## హెల్మెట్ వాడకంపై అవగాహన

**నందిగామ(ఎన్టీఆర్)రేపటికోసం :** నందిగామ పోలీసులు రవాణాశాఖ అధికారులు మంగళవారం నందిగామలో హెల్మెట్ అవెర్నెస్ కార్యక్రమం చేపట్టారు. అంబారుపేట క్రాస్ రోడ్స్, చందాపురం బైపాస్ వద్ద ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ వాడకం పట్ల అవగాహన కల్పించారు. సిఐ వైవియల్ నాయిడు ట్రాఫిక్ యస్ఐ శ్రీనివాసరావు, రవాణాశాఖ అధికారులు సచివాలయ మహిళా పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించారు.



## జేసీని కలిసిన తిరువూరు ఆర్డీవో మాధురి

**తిరువూరు (ఎన్టీఆర్) రేపటికోసం:** ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) మరియు జిల్లా అదనపు మ్యాజిస్ట్రేట్ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి ఐలేక్కియ ఎస్, ఐఏఎస్ ని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిని కే మాధురి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జేసీ ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన ఆర్డీవో మాధురి స్వాగతం పలికి శుభాకాంక్షలు అందజేశారు.



## రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ



**జగ్గయ్యపేట( ఎన్టీఆర్) రేపటి కోసం:** జగ్గయ్యపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు మంగళవారం స్థానిక శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ రైతులకు 50 శాతం రాయితీపైన పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగా, పిల్లి పెసర విత్తనాలను పంపిణీ చేశారు. జీలుగు క్వింటకు 6150, పిల్లి పెసర 9వేలకు సరఫరా చేశారు. రైతులు పచ్చిరొట్ట పైరువేసి పూత దశలో నేలలో కలిగేదుండటం వలన నేల సారం పెరిగి భూమిలో నత్రా జెలి శాతం పెరుగుతుందని తెలియజేశారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కట్ట నరసింహారావు, మైనేని రాధాకృష్ణ, యానాల గోపీచంద్, కానూరు కిషోర్, తోట నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడిఏ భవాని, ఏవో వరలక్ష్మి, ఏ ఈ ఓ లు, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు

## వరసిద్ధి వినాయక ఆలయంలో పూజలు

**నందిగామ(ఎన్టీఆర్)రేపటికోసం:** నందిగామ పట్టణం పాత బస్టాండ్ లో వేంచేసి ఉన్న శ్రీ సిద్ధి బుద్ధి సహిత వరసిద్ధి వినాయక స్వామి ఆలయ11వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు, ఆలయ కమిటీ చైర్మన్ అన్నవరపు తిరుపతిరావు పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు రఘు శర్మ ఆధ్వర్యం లో శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక అలంకరణలు, గరిక పత్రితో అష్టోత్తర సహస్రనామం పూజలు వేదొక్తంగా నిర్వహించారు. అనంతరం గణపతి నవగ్రహ చండీ సహిత రుద్రహోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు



## త్వరలో కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి : ఎంపీ చిన్ని



**మైలవరం (ఎన్టీఆర్ జిల్లా)రేపటి కోసం:** అమృత్ భారత్ పథకం కింద మైల వరం నియోజకవర్గంలోని రాయనపాడు రైల్వే స్టేషన్ అభివృద్ధి సాకారం అయిం దని, ఇదే విధంగా కొండపల్లి రైల్వేస్టేషన్ కూ డా అభివృద్ధి చేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్లు స్పష్టం చేశారు. మంగళవారం మైలవరం నియోజకవర్గ పరిధిలోని కొండపల్లి, రాయనపాడు రైల్వేస్టేషన్లలో ఆయా స్టేషన్లో పరిదిలో సమస్యలను పరిశీలించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ రైల్వేస్టేషన్లో రద్దీ తగ్గించి ప్రయాణికులను వేగంగా గమ్యస్థానాలకు చేర్చేలా రైల్వేశాఖ రాయనపాడు స్టేషన్ను మోడల్గా తీర్చి దిద్దిందన్నారు. ప్రధాన స్టేషన్ల తరహా లోనే సదుపాయాలు కల్పించారన్నారు. రూ.12. 13 కోట్ల వ్యయంతో రాయనపాడు రైల్వేస్టేషన్ పనులు పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జన సేన పార్టీ ఇంచార్జి రామ్మోహనరావు (గాంధీ), మైలవరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల), ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పనిముట్లు అందించాలి



**వీరులపాడు (ఎన్టీఆర్) రేపటి కోసం :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే కార్మికులకు పలుగు, పార, గొడ్డలి, వంటి పరికరాలు ప్రభుత్వ అందజేయాలని కూలీలు జుజ్జూరులో నిరసన వ్యక్తం చేశారు. దట్టమైన కంప పొదలు చెలగాలంటే ఈ పనిముట్లు అవసరమని కానీ ప్రభుత్వం సరఫరా చేయటం లేదని వీరు పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట్ల కనీసం టెంట్లు, మెడికల్ కిట్టు, మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని పనిచేసే ప్రదేశంలోనే జుజ్జూరులో ఉపాధి హామీ కూలీలు తమ నిరసనను ప్రభుత్వానికి తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వీరికి నిరంతరం పని కల్పించాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

## ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన



**కంచికచర్ల(ఎన్టీఆర్)రేపటికోసం:** ప్లాస్టిక్ నిషేధంపై కంచికచర్ల గ్రామపంచాయతీ నడుం బిగించింది. మంగళవారం కంచికచర్లలో గ్రామపంచాయతీ కార్యాలయం నుండి గ్రామంలోని ప్రధాన రోడ్ల వెంట పంచాయతీ సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులతో ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రజలకు అనారోగ్యంతో పాటు వాతావరణంలో సమతుల్యం దెబ్బతిని వాతావరణంలో పెను మార్పులు సంభవించి పర్యావరణం కాలుష్యంతో నిండిపోయి ఎన్నో ప్రకృతి విపత్తులు సంభవిస్తాయని, వాతావరణంలో కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని నినాదాలు చేశారు. ఇదే కార్యక్రమంలో తడి చెత్త పొడి చెత్త పై అవగాహన, చెత్త నుండి సంపద తయారీపై కూడా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఈవోపీఆర్డి నాని బాబు, పంచాయతీ గుమస్తా వెల్లంకి రామారావు, సానిటరీ మేస్త్రి సుధాకర్, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్యకార్మికులు పాల్గొన్నారు.

## పరిటాలలో కామన్ యోగ ప్రోటోకాల్



**కంచికచర్ల (ఎన్టీఆర్) రేపటికోసం:** కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో కామన్ యోగ ప్రోటోకాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పారిశుద్ధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆయుష్ మెడికల్ ఆఫ్ అధికారి పద్మజ, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధిఅధికారి ఐ.నాని బాబు తదితరులు పాల్గొన్నారు.

## లియాఖత్కు మొండితోక నివాళులు



**నందిగామ(ఎన్టీఆర్)రేపటికోసం:** నందిగామ పట్టణం 6వ వార్డుకు చెందిన మెడికల్షాపు బాషా కుమారుడు లియాఖత్ భౌతికకాయనికి మంగళవారం పార్టీ నాయకులతో కలసి నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు నివాళి అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నోట్ పుస్తకాలు పాఠ్య పుస్తకాలు పంపిణీ



**మోపిదేవి కృష్ణా (రేపటి కోసం):** మండల పరిధిలో గల 42 పాఠ శాలకు సంబంధించి నోట్ పుస్తకాలు టెస్ట్ బుక్స్ జిల్లా కేంద్రం నుండి మండల కేంద్రానికి రాగా,వాటిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. మోపిదేవి మండలంలో మొత్తం 42 పాఠశాలలు గాను నోట్ పుస్తకాలు 15,600 వచ్చినవి. అలాగే టెస్ట్ బుక్స్ 12,400 వచ్చినవి. అలాగే మొత్తం 42 పాఠ శాలలకు గాను మొత్తం 2049 మంది విద్యార్థులు ఉండగా వారందరికీ బెల్టులు, యూనిఫార్ములు రాక వాటిని ఆయా స్కూల్కి పంపిణీ చేశారు. అలాగే డిక్షనరీలు 213 వచ్చాయని మండల విద్యా శాఖ అధికారి తెలిపారు. ఇంకా 2049 మంది విద్యార్థులకు బ్యాగ్స్, షూస్ రావాల్సి ఉందని తెలిపారు. అవి రాగానే ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు.

## విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

**అవనిగడ్డ కృష్ణా రేపటి కోసం:** బుధవారం అనగా 4 వ తేదీన మంత్లీ షెడ్యూల్‌లో భాగంగా అవనిగడ్డ మండలం కోడూరు రోడ్‌లో గల ఓల్డ్ సబ్ స్టేషన్ పరిధిలోని 11KV వాటర్ వర్క్స్ ఫీడర్ విద్యుత్ లైన్లపై వాలిన చెట్లకొమ్మలను ట్రిమ్ చేయటం కొరకు ఓల్డ్ సబ్‌స్టేషన్ అవనిగడ్డ మండల పరిధిలోని రామకోటి పురం, రామచంద్రాపురం, మోదుమూడి రెవెన్యూ పరిధిలోని మాచవరం గ్రామాలలోని ఆక్వా పంచాయితీ మోటార్లకు ఉ.07:00 గంటల నుంచి 11:00 గం, వరకు విద్యుత్ అంతరాయం కలుగును కావున విద్యుత్ వినియోగదారులందరూ సహకరించగలరు అని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. కృష్ణ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



**చల్లపల్లి - కృష్ణా (రేపటి కోసం):** భూసార పరీక్షల ఆవశ్యకత, వ్యవసాయ పద్ధతులపై శాస్త్రవేత్తల సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు కోరారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్సింగ్ చౌహాన్ పిలుపుమేరకు మంగళవారం యార్లగడ్డలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై సార్వా పంటకు అనువైన వరి రకాలు, ఆరోగ్యవంతమైన నారు పెంచేందుకు సూచనలు అందించారు. ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం, సస్యరక్షణ యాజమాన్యం, భూసార పరీక్షల ఉద్దేశ్యాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.ఎం. వెంకటలక్ష్మి, డా.బి.కళ్యాణ్బాబు, డా.భాస్కర్రెడ్డి, ఏవో జి.సాయి సింధు, ఉద్యానవన శాఖ అధికారిణి జె.కీర్తిలు పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు అందించారు.

## ముగిసిన వేసవి శిక్షణా తరగతులు



**చల్లపల్లి - కృష్ణా (రేపటి కోసం):** పురిటిగడ్డ శ్రీకృష్ణసాయి ధాన్య మందిర కళ్యాణమండపంలో నెలరోజుల పాటు నిర్వహించిన యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, కూచిపూడి నాట్యశిక్షణా తరగతులు ముగిశాయి. శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా విద్యార్థులచే కూచిపూడి నాట్యప్రదర్శన జరిగింది. అనంతరం శిక్షణపొందిన వారికి అతిధులచేతులమీదుగా సర్టిఫికెట్లను అందచేశారు. విశ్రాంత ఆర్టీవో, ధ్యానమందిరం ట్రస్టీ నాదెళ్ల శివరామకృష్ణ.. రజితలక్ష్మి దంపతులు. తెలుగు అధ్యాపకురాలు డా.ఓలేటి ఉమా సరస్వతి, ఉపాధ్యాయుడు రామకృష్ణ, డ్యాన్స్ మాస్టర్ దాలిపర్తి మెహెర్ దుర్గా నరసింహారావు, గ్రామపెద్దలు పరుచూరి సురేష్, దేవభక్తుని గోపాలకృష్ణలు చిన్నారులను అభినందించారు.

## మహాసభలను జయప్రదం చేయండి



**అవనిగడ్డ కృష్ణా రేపటి కోసం:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రభుత్వ గుర్తింపు పొంది రాష్ట్ర ప్రభుత్వ సర్వీసెస్ జాయింట్ సంస్థ కౌన్సిల్లో శాశ్వత సభ్యత్వం కలిగిన ఏకైక సంస్థ ఐదవ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలను జయ ప్రదం చేయాలని కోరుతూ దీనికి సంబంధించిన గోడ పత్రికలను మంగళవారం ఎంపీడీవో మర్యాదదేవి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాటాడుతూ ఐదవ తేదీ గురువారం విజయవాడలో జరిగే మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభలకు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ దివి యూనిట్ అధ్య క్షులు ఓ ప్రభాకర్ జనరల్ సెక్రటరీ వి సురేష్ జాయింట్ సెక్రటరీ రోజా కోశాధికారి చంద్రమోహన్ పాల్గొన్నారు.

## రాయపూడి వేణుకు పరామర్శ



**అవనిగడ్డ కృష్ణా రేపటి కోసం:** జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల రావు సోమవారం ఘంటసాల ఏఎంసి చైర్మన్ తోట కనకదుర్గ ర్యాలీ బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం అస్వస్థకు గురై అవనిగడ్డ కోడూరు రోడ్ లోని ఎస్వీఎస్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు విషయం తెలుసుకున్న ఘంటసాల మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట కనకదుర్గ రాజశేఖర్ చల్లపల్లి పట్టణ జనసేన అధ్యక్షులు వీరబాబు ఐటి కోఆర్డినేటర్ నందగోపాల్ అవనిగడ్డ జనసేనసీనియర్ నాయకులు చెన్నగిరి సత్యనారాయణ అవనిగడ్డ జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాజనాల వీరబాబు టిడిపి నాయకులు న్యాయవాది కర్ర సుధాకర్ పరామర్శించారు.

## 20వేల మందికి అన్న సంతర్పణ

**అవనిగడ్డ కృష్ణా రేపటి కోసం:** వంతెన సెంటర్లోని ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో అన్న సందర్భంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారంస్వామివారికి విశేష పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కాలేజీ డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో అన్న సంతర్పణ నిర్వహించగా ప్రజలు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ అన్న ప్రసాదాలు స్వీకరించారు.

# కరోనా అప్రమత్తం..!



- మచిలీపట్నం ఆసుపత్రిలో 10 పడకల కేటాయింపు
- విజయవాడ వైద్యశాలలో ప్రత్యేక ఐసొలేషన్ వార్డు
- ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ కిట్లు, మందులు సిద్ధం

**(కృష్ణాజిల్లా బ్యూరో - రేపటి కోసం)** కరోనా ప్రమాద ఘంటికల నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కరోనా నూతన వేరియంట్ వ్యాపిస్తోందని సంకేతాలు అందడంతో వైద్య ఆరోగ్య శాఖ జిల్లాలో వ్యాధివ్యాప్తి నియంత్రణకు చర్యలు చేపట్టింది. దేశంలో కరోనా కేసులు పెరు గుతున్న నేపథ్యంలో విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుప త్రిలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశారు. ఎంత మంది వచ్చినా.. సేవలు అందించేలా సర్వం సిద్ధం చేశారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో 10 పడకలు కేటా యించారు. వార్డుల కేటాయింపుతో పాటు చికిత్సకు అవసరమైన వసతులు సిద్ధం చేస్తున్నారు. జ్వరాలు, జలుబు, గొంతు నొప్పి లక్షణా లతో ఎవరో చ్చినా..తదితర లక్షణాలతో ఉన్నవారికి కరోనా పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో ఏర్పాట్లు చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహణకు, చికిత్స అందించడానికి వైద్యులు, సిబ్బందికి అవసరమైన ర్యాపిడ్ టెస్ట్ కిట్‌లు, గౌజులు, మాస్కులు అందుబాటులో ఉంచారు. కరోనా లక్షణాలతో వచ్చే వారికి తొలుత స్వాప్ తీస్తారు. ర్యాపిడ్ పరీక్ష చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు. ర్యాపిడ్ పరీక్షల ఫలితాలు పక్కాగా ఉన్నాయో లేదో తెలుసుకు నేందుకు ప్రతి 10 మందిలో ఒకరికి ఆర్టీపీసీఆర్ పరీక్ష కూడా చేస్తారు. ర్యాపిడ్లో పాజిటివ్ వస్తే మాత్రం.. వెంటనే మరోసారి స్వాప్‌తీసి ఆర్టీపీసీఆర్ చేస్తారు. పరీక్షల నిర్వహణ కోసం ఐసీఎంఆర్ ఫామ్స్ అందుబాటులో ఉంచారు. ఆధార్ తీసు కుని, దాని ఆధారంగా ఫామ్స్ నింపి శాంపిల్స్ తీసుకుని వైరాలజీ ల్యాబ్కు పంపిస్తారు. విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలోని వైరాలజీ ల్యాబ్లోనే ఈసారి ఆర్టీపీసీఆర్ పరీక్షలను విశ్లేషించను న్నారు. గతంలో కంటే త్వరగా ఫలితాలు రానున్నాయి.

వ్యాధి నిర్ధారణ అయిన వారిని ఐసొలేటెడ్ వార్డులకు తరలించ నున్నారు.ఆక్సిజన్ ప్లాంట్లతో పాటు వెంటిలేటర్లు, ఇతర పరికరాలు సిద్ధం చేస్తున్నారు. వార్డులో 24 గంటలు సేవలు అందేలా వైద్య సిబ్బందిని అందుబా టులో ఉంచారు. ప్రజలు ఆందోళన చెందకుండా లక్షణాలు కనిపిస్తే ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

## విద్యుత్ కోతలతో ప్రజలు కష్టపడితే సహించను



- విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- అధికారుల సమాధానాలపై ఎమ్మెల్యే అసంతృప్తి
- అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే రాము

**గుడివాడ, (కృష్ణా) రేపటి కోసం :** విద్యుత్ కోతలతో ప్రజలు కష్టపడితే సహించేది లేదని, సమస్యల పరిష్కారంపై విద్యుత్ అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజావేదికలో విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే రాము మంగళవారం సమావేశమయ్యారు. గ్రామాల్లో విద్యుత్ కోతలు, టిడ్కో కాలనీలో విద్యుత్ సమస్యలు, నియోజకవర్గంలోని సమస్యలపై అంశాల వారీగా అధికారులను ఎమ్మెల్యే రాము ప్రశ్నించారు. అధికారులు ఇచ్చిన వివరణపై ఎమ్మెల్యే రాము అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నియోజకవర్గంలో విద్యుత్ శాఖ పనితీరు అధ్వాన్నంగా ఉందని, ఇకనుంచైనా తీరు మార్చుకోవాలని సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులను గౌరవిస్తానని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించనని, నిర్లక్ష్యం వీడకుంటే సమస్యల పరిష్కారంకోసం పైస్థాయికి వెళతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై శాఖ పరంగా సమావేశం నిర్వహించి పూర్తిస్థాయి నివేదిక, సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రమైన ప్రణాళికతో రావాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, సమావేశంలో అధికారులకు స్పష్టమైన సూచనలు చేసామన్నారు.అధికారులు ఇచ్చిన నివేదికల అనంతరం సమస్యల పరిష్కారానికి ఎక్కడి వరకైనా వెళ్లి నిధులు సాధించుకొస్తానన్నారు.

సమావేశంలో సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, ఐలా చైర్మన్ లింగప్రసాద్, విద్యుత్ శాఖ ఈఈ.జీవి శ్రీనివాసరావు, ఏడీఈలు కే.వర్మ, పి.కిరణ్ బాబు, ఏ.ఈలు సూర్యప్రకాష్, బ్రహ్మానందం, విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## తుని ఉద్యమం కేసుపై అపీలు ఉపసంహరణ... కాపుల విజయమే

**రాష్ట్ర జై కాపు సేన లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ.**


**మచిలీపట్నం (కృష్ణా) రేపటి కోసం ప్రతినిధి:** కాపులను బీసీలుగా చేర్చాలని తునిలో జరిగిన బహిరంగ సమావేశం రోజు జరిగిన రైలు దగ్ధం కేసులో విజయవాడ రైల్వే మేజిస్ట్రేట్ కొట్టివేసిన కేసుపై హైకోర్టుకు అప్పీల్ చేయాలనే నిర్ణయం పై జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడం ఇది రాష్ట్రంలో ఉన్న కాపులందరి విజయమని జై కాపు సేన రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు.మంగళవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా కాపులందరూ బీసీల్లో చేర్చాలనే ఉద్యమాన్ని ఎంతో కాలంగా జరుగుతుందని బాలాజీ అన్నారు. కూటమి ప్రభుత్వం కూడా కాపులను బీసీల్లో చేర్చే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కూడా బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరారు. నేటి కూటమి ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్తంగా కాపులే పునాదిరాళ్లని బాలాజీ అన్నారు.విజయవాడ రైల్వే కోర్టు కేసు కొట్టి వేసిన 30 రోజుల్లోపు అప్పీల్ చేయవలసి ఉండగా 18 నెలలు తర్వాత అవగాహన లేని కొంతమంది అధికారులు జీవోను తీసుకువచ్చి కాపులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టారన్నారు. విజయవాడ రైల్వే కోర్టు తీర్పు సుదీర్ఘంగాఉందని సాక్షాలు పెట్టడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని కేసు కొట్టివేసిన సంగతి తీర్పులో చక్కగా వివరించారని బాలాజీ అన్నారు. ఏది ఏమైనా కాపుల కోసం చేసే ఉద్యమంలో అందరం కలిసికట్టుగా ప్రయాణం చేయాలని కాపుకులానికి న్యాయం జరిగే విధంగా అందరు కృషి చేయాలని బాలాజీ పిలుపునిచ్చారు.

త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిని ఉప ముఖ్యమంత్రిని జై కాపుసెనా ఆధ్వర్యంలో కమిటీ కలిసి కాపులను బీసీల్లో చేర్చే విధంగాను, ఐదు శాతం రిజర్వేషన్ కొరకు, కాపు కార్పొరేషన్ కు డైరెక్టర్లు నియమించి నిధులు కేటాయించడానికి ఏర్పాటు చేసినట్టుగా బాలాజీ తెలియజేశారు. ఇటీవల మంగళగిరి, కాకినాడలో జరిగిన రాష్ట్ర జై కాపుసేన మీటింగ్లో పలు తీర్మానాలు కాపులు సంక్షేమం కోసం చేయడం జరిగిందని బాలాజీ తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు చినబాబు బసవ ఆధ్వర్యంలో కాపుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్టు తెలియజేశారు.

## అభివృద్ధి ఫలాలు అందరూ పొందాలి : ఎమ్మెల్యే ప్రవీణ్

**పెదకూరపాడు పల్నాడు జిల్లా రేపటి కోసం:** నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు అందాలి, అదే నా ఆకాంక్ష అని పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల తరుణంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తెచ్చి వాటిని సమర్థంగా వినియోగించడంలో పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నామని అన్నారు ఇది ఆరంభం మాత్రమే అని రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు పెదకూరపాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను నిర్వహిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పొందామని అన్నారు ప్రజల భాగస్వామ్యంతో నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు అధికారంలోకి వచ్చిన కాలంలోనే సుమారు 85 కోట్ల రూపాయల నిధులను వివిధ శాఖల ద్వారా తెచ్చి అభివృద్ధి పనులకు వినియోగించడం జరిగిందని ఆయన అన్నారు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధికి 85 కోట్ల రూపాయల నిధులు వినియోగించడం జరిగిందని అన్నారు

## గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**ఎడ్లపాడు (పల్నాడు జిల్లా) రేపటికోసం** శ్రీ సిద్ధిగణపతి, శ్రీ అభయాంజనేయస్వామి, సీతలాంబ తల్లి బొడ్డురాయి ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా తలపెట్టిన గ్రామోత్సవాన్ని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. మంగళవారం యడ్లపాడు మండలం జగ్గాపురంలో జరిగిన గ్రామోత్సవంలో పాల్గొన్న ప్రత్తిపాటి ప్రజలతో కలిసి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన హోమంలో పాల్గొని అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతం ప్రతిష్ఠా మహోత్సవ ఏర్పాట్లపై గ్రామస్తులు, కార్యక్రమాల నిర్వాహకులతో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, స్వామివార్ల అనుగ్రహం లభించేలా శాస్త్రోక్తంగా, సంప్రదాయ బద్ధంగా ప్రతిష్ఠామహోత్సవం నిర్వ హించాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, కామినేని సాయిబాబు, ముద్దన నాగేశ్వరరావు, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కందిమళ్ళ రఘు రామారావు, సుబ్బారావు, శంకర్రావు, గట్టినేని విజయ్ సాయి, పోపూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ముద్దన పార్థసారథి, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధే గీటురాయి..!



**మాచర్ల (పల్నాడు జిల్లా) రేపటి కోసం:** కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజా క్షేమం, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని మాచర్ల నియోజకవర్గం శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానం దరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ 365 రోజుల పాలనలో నియోజకవర్గ పరిధిలో 360 డిగ్రీస్ లో నభూతో నభవిష్యతి అన్నట్లు అభివృద్ధిని ప్రజలు చూశారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధం గా ఏడాది పాలనలో వేల కోట్ల నిధులు కేటాయించి మాచర్ల నియోజకవర్గాన్ని ఆధునీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెను వెంటనే దాదాపు రూ.175 కోట్ల నిధు లతో నియోజకవర్గంలో ప్రాథమికంగా ప్రధాన, ప్రధాన రహదారులను కలిపే అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశామని ఆయన పేర్కొన్నారు. అంతేకాక గ్రామీణాభివృద్ధికి పెద్ద పేట వేస్తూ, రూ 16 కోట్లతో సీసీ రోడ్లను నిర్మించామని ఆయన వివరించారు. జల జీవన మిషన్ ద్వారా నియోజకవర్గంలో మారుమూల తండాలకు సైతం శుద్ధ జలాలను అందించే లక్ష్యంతో రూ. 600 కోట్లు, మాచర్ల పట్టణ తాగునీటి అవసరాలకై అమృత స్కీం ద్వారా రూ.117 కోట్లు నిధులను కూటమి ప్రభుత్వం కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ జలాలను అందించే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.

## మసుల బీచ్ ఉత్సవాలను వైభవంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు



**మచిలీపట్నం (కృష్ణా) రేపటి కోసం ప్రతినిధి:** ఈనెల 5వ తేదీ నుండి మసుల బీచ్ ఉత్సవాలను అత్యంత వైభవంగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మంత్రి ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, స్థానిక ప్రముఖులతో కలిసి మచిలీపట్నం మండలంలోని మంగినపూడి బీచ్‌ను సందర్శించారు.సముద్ర తీరాన మంత్రి ఆర్టీసీ చైర్మన్ తో కలిసి గుర్రపు స్వారి చేశాక సముద్రంలో పడవ నడిపి అందరిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు 4 రోజుల పాటు మసుల ఫెస్ట్ పేరుతో మంగినపూడి బీచ్ ఉత్సవాలను అత్యంత వైభవ వేదంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలతో ప్రారంభమై మంగినపూడి బీచ్ ఎంతో అభివృద్ధి చెంది ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోనందన్నారు. పర్యాటకులు సముద్ర తీరానికి విచ్చేసి కొంత సమయం కాలక్షేపంగా గడిపి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బీచ్ టూరిజాన్ని, టెంపుల్ టూరిజాన్ని, కల్చరల్ టూరిజాన్ని పెంపొందించేందుకు అన్ని విధాల ఆలోచిస్తున్నారన్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే ఈ బీచ్‌లో అనేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

2018 లోనే 10 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఈ బీచ్ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచామన్నారు. ఆ తదుపరి వచ్చిన ప్రభుత్వ హాయంలో బీచ్ నిర్లక్ష్యానికి గురైందన్నారు. బీచ్‌లో తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రత్యేక దృష్టిసారించామన్నారు.

ఈ బీచ్ ఉత్సవాల ద్వారా రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే మచిలీపట్నం ఖ్యాతిని చాటి చెప్పేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో మంత్రి, ఆర్టీసీ చైర్మన్ వెంట మెప్మా పీడీ ఉత్సవాల సంపూర్ణ పర్యవేక్షణ అధికారి సాయిబాబు, డి ఎస్ డి ఓ ఝాన్సీ లక్ష్మి, తహసీల్దారు హరినాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రె పాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ, మార్కెటింగ్ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు గోపు సత్యనారాయణ, కుంచె దుర్గా ప్రసాద్, రొండి కృష్ణ అధికారులు పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో 2కె రన్‌లో పాల్గొన్న సినీ హీరోలు



**మచిలీపట్నం (కృష్ణా) రేపటి కోసం ప్రతినిధి:** మచిలీపట్నం బీచ్ ఫెస్టివల్స్ సందర్భంగా భైరవం చిత్ర హీరోలు నారా రోహిత్, మంచు మనోజ్, డైరెక్టర్ విజయ్ చిత్ర యూనిట్ మంగళవారం కోనేరు సెంటర్‌లో నిర్వహించిన 2కె రన్‌లో పాల్గొన్నారు. కోనేరుసెంటర్ నుండి లక్ష్మీటాకీస్ సెంటర్ వరకు సాగిన 2కె రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న నగర ప్రజలు పాల్గొన్నారు. వారితోపాటు పాల్గొన్న చిన్నారులతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర డాన్స్ వేశారు. మొదటగా కోనేరు సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో సినీ హీరో మంచు మనోజ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మంచు మనోజ్ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన మచిలీపట్నం రావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. బ్రిటిష్ కాలం నాటి పోర్ట్ మళ్ళి పూర్వ వైభవం తీసుకువచ్చేలా మచిలీపట్నం పోర్టు నిర్మిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సెల్యూట్ చేశారు. యువతను తన మాటలతో ఉత్సాహపరిచారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగం ముగించారు. భైరవం సినిమాలో నటించిన నారా రోహిత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పర్యటన శాఖ కీలకమని వ్యాఖ్యానించారు. పర్యటకులను ఆకర్షించే విధంగా బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న మంత్రి కొల్లు రవీంద్రకు అభినందనలు తెలియజేశారు. మసులా బీచ్ ఫెస్టివల్ ద్వారా మచిలీపట్నం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మచిలీపట్నం కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తు కొల్లు రవీంద్ర కృషి కృషి చేస్తున్నరు అని అన్నారు. అదేవిధంగా ఇటీవల విడుదలైన మా భైరవం చిత్ర అన్ని థియేటర్లలో దుమ్ము లేపుతోంది అని సినీ నిర్మాత దర్శకులు విజయ్ తెలిపారు. మచిలీపట్నం జనసేన పార్టీ ఎంపీ బాలసౌరి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్‌రావులతో కలిసి 2కె రన్‌లో పాల్గొన్నారు.

## 5న పెడనలో జాబ్ మేళా

**మచిలీపట్నం (కృష్ణా) రేపటి కోసం ప్రతినిధి:** నైపుణ్యాల అభివృద్ధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ది.05.06.2025 గురువారం నాడు ఉ. 09:00 గం.లకు పెడనలోని ఎస్.బి.ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు "జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు కలెక్టర్ డి.కె. బాలాజీ తెలిపారు. ఈ జాబ్ మేళాలో, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ఎమ్ఆర్ఎఫ్ లిమిటెడ్, జాస్పర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని ఉపాధి అధికారి/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు APSSDC సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్ కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 88977 72488, 99664 89796, 99895 19495 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో పేట్రేగిపోతున్న రేషన్ మాఫియా



**అవనిగడ్డ కృష్ణా రేపటి కోసం:** రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వం ఇంటింటికి ఎమ్ డి యు వాహనాల ద్వారా రేషన్ అందిస్తూ రేషన్ షాపులకు ఎవరు వెళ్లే పని లేకుండా రేషన్ అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తి అయిన సందర్భంగా మళ్ళీ రేషన్ షాపులకు అధికారాలు ఇవ్వడంతో ఇచ్చిన రెండోరోజునే అవనిగడ్డ నియోజకవర్గం మండల కేంద్రమైన అవనిగడ్డలోనే నాలుగు టన్నుల నర్ర రేషన్ బియ్యాన్ని అవనిగడ్డ ఎస్సై శ్రీనివాస్ వల పఎన్ని పట్టుకున్నారు రేషన్ షాపులను జూన్ ఒకటవ తేదీ ఆదివారం పండుగ వాతావరణంలో శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు షాపులు ప్రారంభించి 48 గంటలు గడవకముందే శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఇంటికి కూతవేటు దూరంలో పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్ ఐ కే శ్రీనివాస్ వాహనాలు తనిఖీ చేస్తుండగా వేరువేరు వాహనాలలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలను అదుపులో తీసుకొని ప్రశ్నించగా మోపిదేవి మండలం పెద్ద కల్లేపల్లి గ్రామానికి చెందిన కూతాడ వెంకన్న రెండు టన్నుల నర్ర అవనిగడ్డ ఒకటవ వార్డుకు చెందిన కోసూరు రాజారావు రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు వీరిపై కేసు నమోదుచేసి రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు భవిష్యత్తులో ఎవరైనా ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. వీరు ఇరువురు గతంలో కూడా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో అక్రమ వేసిన బియ్యానికి పెడతారో లేదో వేచి చూడాలి.

## మోపిదేవి హైస్కూల్ టీచర్లకు హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు



**మోపిదేవి కృష్ణా (రేపటి కోసం):**మండల కేంద్రమైన మోపిదేవి హైస్కూల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ముగ్గురికి హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు వచ్చాయని మోపిదేవి హైస్కూల్ హెచ్ఎం జయంతి మంగళవారం తెలిపారు. మోపిదేవి హైస్కూల్ నందు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మ్యాక్స్ టీచర్ జి. కృష్ణ ప్రసాద్ కు హెచ్ఎం గా ప్రమోషన్ వచ్చిందని తెలిపారు. ఆయనను మోపిదేవి మండలం కే. కొత్తపాలెం హైస్కూల్ హెచ్ఎంగా నియమించారని తెలిపారు. అలాగే మోపిదేవి హైస్కూల్‌లో పనిచేసే మరో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కే. నాంచారయ్యకు హెచ్ఎంగా ప్రమోషన్ వచ్చిందని తెలిపారు. ఆయనను కోడూరు హెచ్ఎంగా జాయిన్ అయ్యారు. అలాగే మరో ఉపాధ్యాయులు సోషల్ మాస్టర్ ఏడుకొండలుకు ప్రమోషన్ వచ్చిందని, ఆయనను వక్కలగడ్డ హెచ్ఎంగా నియమించారని తెలిపారు. అలాగే మోపిదేవి మండలం పెదప్రోలు హైస్కూల్ లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఉమా టీచర్‌కి ప్రమోషన్ వచ్చిందని తెలిపారు.పెదప్రోలు హైస్కూల్లో బయాలజీ టీచర్గా విధులు నిర్వహిస్తున్న ఉమాకు ప్రమోషన్ రాగా పెదకళ్ళేపల్లి హై స్కూల్ హెచ్ఎంగా నియమించారని తెలిపారు. మోపిదేవి మండలంలో మొత్తం నలుగురు ఉపాధ్యా యులకు ప్రమోషన్లు వచ్చాయని, నలుగురిని ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని తెలిపారు.

## హాస్టళ్ల అభివృద్ధి పనులు జూన్ 10లోపు పూర్తి చేయాలి



**మోపిదేవి కృష్ణా(రేపటి కోసం):** సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి పనులు జూన్10లోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం మోపిదేవిలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్, బీసీ ఆశ్రమ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించారు. బాలికల వసతి గృహంలో చేపట్టిన డైనింగ్ కం లివింగ్ రూమ్ నిర్మాణం శ్లాబు దశలోనే ఉండటంతో ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ (ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ - ఏపీఈడబ్ల్యూఐడీసీ) ఏఈ రాజేష్ పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో వంట గది అభివృద్ధి పని ఇప్పటికీ ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి పది రోజులే ఉన్నా పనుల్లో నెలకొన్న ఈ జాప్యాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు. సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల మరమ్మత్తులకు జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ నుంచి రూ.కోటీ 46 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. తద్వారా వసతి గృహాల భవనాల శ్లాబ్ రిపేర్లు, విద్యుత్, నీటి సదుపాయాల పునరుద్ధరణ, పెయింటింగ్, మరుగుదొడ్ల మరమ్మత్తులు, అదనపు గదుల నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆశ్రమ వసతి గృహానికి 19 లక్షల 80 వేలు మరమ్మతులు నిమిత్తం జిల్లా మినరల్ ఫండ్స్ కింద మంజూరయ్యాయి అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వార్డెన్లు లంకేశ్వరరావు, సురేష్, లక్ష్మి పాల్గొన్నారు.

## 63 మంది యువతకు ఆఫర్ లెటర్లు

**చల్లపల్లి - కృష్ణా (రేపటి కోసం):** చల్లపల్లి శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్ మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచీ 383 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా, 11 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 63 మందిని ఎంపికచేసి ఆఫర్ లెటర్లు అందచేశారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గలు అతిధులుగా పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లు అందచేశారు. కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్స్ పి.రమేష్బాబు, షేక్ అబ్దుల్ రహీంలు కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మీరేమైనా చరిత్రకారులా?

## కమల్‌హాసన్‌కు కర్ణాటక హైకోర్టు ప్రశ్న




'థగ్ లైఫ్' విడుదలను నిషేధించాలని కోరుతూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. నేడు దీన్ని విచారించిన హైకోర్టు కమల్ హాసన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంత పెద్ద నటుడైనప్పటికీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఆయనకు లేదని హెచ్చరించింది. ఈ అంశంపై తీవ్రంగా స్పందించింది. అతడి వ్యాఖ్యలకు ఆధారాలను అడిగింది. 'ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని' వ్యాఖ్యానించింది.

"మీరు కమల్‌హాసన్ కావచ్చు లేదా మరెవరైనా కావచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీయలేరు. ఒక ప్రజాప్రతినిధిగా అలాంటి ప్రకటన చేయకూడదు. మీ కామెంట్స్ వల్ల అశాంతి ఏర్పడింది. కన్నడ ప్రజలు మిమ్మల్ని క్షమాపణలు మాత్రమే అడిగారు. మీరు ఏ ప్రాతిపదికన ఆ ప్రకటన చేశారు? మీరు ఏమైనా చరిత్రకారులా? లేక భాషావేత్తనా? ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారు?" అని కమల్‌హాసన్‌ను హైకోర్టు ప్రశ్నించింది.

క్షమాపణ చెప్పే ఉద్దేశం లేకపోతే, కర్ణాటకలో సినిమా విడుదల ఎందుకు?

"క్షమాపణ చెప్పని పక్షంలో కర్ణాటకలో సినిమాను ఎందుకు ప్రదర్శించాలనుకుంటున్నారు? వదిలేసేయండి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హద్దులు దాటి, ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు కదా. మీరు క్షమాపణ చెబితే ఏ సమస్యా ఉండదు. మీ సినిమాను ప్రదర్శించటం ద్వారా కర్ణాటక నుంచి కూడా మీరు రూ.కోట్లలో ఆదాయాన్ని పొందవచ్చు" అని కోర్టు పేర్కొంది.

కమల్‌హాసన్ ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకురాగా, 'పరిస్థితుల కారణంగా బాధితుడయ్యే వ్యక్తికీ, వాటిని సృష్టించే వ్యక్తికీ మధ్య చాలా తేడా ఉంది. ఇప్పటికే కమల్‌హాసన్ బాహాటంగా తన అభిప్రాయాన్ని ప్రకటించారు. దాన్ని మీరు ఇప్పుడు కప్పిపుచ్చలేరు. మిగిలింది క్షమాపణలు చెప్పడమే' అని కోర్టు వ్యాఖ్యానించగా, కమల్‌హాసన్ పరిస్థితిని చక్కబరిచేందుకే ప్రయత్నించినా, అది పక్కదారి పట్టిందని ఆయన తరఫు న్యాయవాది అన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ 'కావచ్చు. కానీ, కారణం ఎవరు? మీరే పరిస్థితి చేయిదాటిపోయేలా చేశారు. ఇప్పుడు మీ సినిమాను రక్షించాలని కోరుతున్నారు' అని కోర్టు వ్యాఖ్యానించింది.

ఇటీవల జరిగిన 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తమిళం నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణమయ్యాయి. దీంతో ఆయన వ్యాఖ్యలపై అధికార, విపక్ష పార్టీలతో పాటు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా తీవ్రంగా స్పందించాయి. ఈ క్రమంలోనే 'థగ్‌లైఫ్'ని కర్ణాటకలో నిషేధించాలని కోరుతూ కేఫ్‌సీసీ హైకోర్టును ఆశ్రయించింది.

## శుక్లా చేతికి బీసీసీఐ పగ్గాలు



బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడిగా సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పగ్గాలు చేపట్టనున్నాడు. ప్రస్తుత అధ్యక్షుడు రోజర్ బిన్నీకి వచ్చే నెలలో 70 ఏళ్లు నిండుతున్న నేపథ్యంలో అతని స్థానాన్ని శుక్లా భర్తీ చేయనున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. 2022లో సౌరభ్ గంగూలీ స్థానంలో బోర్డు అధ్యక్షుడిగా నియమితుడైన బిన్నీ.. జులై 19న 70 ఏళ్లు పూర్తిచేసుకుంటాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం కార్యవర్గ సభ్యుడి వయోపరిమితి 70 ఏళ్లు దాటకూడదు. 65 ఏళ్ల శుక్లా 2020 నుంచి బోర్డు ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. సెప్టెంబరులో వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఎన్నికలు జరిగే వరకు శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. "నిబంధనల ప్రకారం సీనియర్ కార్యవర్గ సభ్యుడు బాధ్యతలు స్వీకరిస్తాడు. సెప్టెంబరులో ఎన్నికలు జరిగే వరకు శుక్లా అధ్యక్ష పాత్ర పోషిస్తాడు" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్న శుక్లా.. గతంలో ఐపీఎల్ ఛైర్మన్‌గా పనిచేశాడు.


## ఆర్సీబీకి సపోర్ట్‌గా రాష్ట్ర ప్రభుత్వం..!

ఆర్సీబీ ఒక బిగ్ మ్యాచ్‌కు సిద్ధం అవుతోంది. గత 17 సీజన్లుగా సాధించలేనిది.. ఈ సీజన్‌లో ఎలాగైనా సాధించాలనే కసితో కలతో ఆర్సీబీ బరిలోకి దిగబోతుంది. ఐపీఎల్ 2025లో భాగంగా నేడు ( మంగళవారం, జూన్ 3 ) పంజాబ్ కింగ్స్‌తో అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. ఇప్పటి వరకు ఈ రెండు టీమ్స్ కూడా ఐపీఎల్ ట్రోఫీ లేదు. ఎవరు గెలిచినా.. ఐపీఎల్‌లో మరో కొత్త ఛాంపియన్ అవతరించబోతుంది. ప్రస్తుతానికి రెండు టీమ్స్‌కు సమాన మద్దతు లభిస్తోంది. ఒక వైపు విరాట్ కోహ్లీ ఐపీఎల్ ఆరంభం నుంచి ట్రోఫీ కోసం పోరాటం చేస్తున్నాడని, ఆర్సీబీ కప్పు గెలవాలని కొన్ని కోట్ల మంది కోరుకుంటున్నారు.

మరోవైపు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఎంతో కష్టపడుతున్నాడని, పంజాబ్ కింగ్స్‌కు కూడా ఒక ట్రోఫీ రావాలని అంతే మంది ప్రార్థనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్సీబీకి మద్దతుగా ఏకంగా ఒక రాష్ట్ర ప్రభుత్వమే బరిలోకి దిగింది. ఆర్సీబీ జట్టుకు సపోర్ట్ చేస్తూ.. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వీడియో చేయడం విశేషం. ఆ రాష్ట్రం ఏదంటే.. కర్ణాటక. ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం శివకుమార్ ఆర్సీబీకి కప్పు కొట్టాలని, యావత్ కర్ణాటక ఆర్సీబీ వెంట ఉందంటూ ఒక వీడియో రిలీజ్ చేశారు. ఆర్సీబీ కర్ణాటక రాజధాని బెంగళూరు బేస్డ్ ఫ్రాంచైజీ అనే విషయం కొత్తగా చెప్పాల్సిన పనిలేదు.

మనకు సన్‌రైజర్స్ ఎలాగో కర్ణాటకకు ఆర్సీబీ అలాగే. 18 ఏళుగా ఇలాంటి మూమెంట్ కోసం ఎదురుచూస్తున్నామని.. ఈ సారి కచ్చితంగా కప్పు గెలిచి.. ఈ సాలా కప్ నమ్దే అంటూ శివకుమార్ అన్నారు. మరి చూడాలి.. ఈ రోజు ఆర్సీబీ ఏం చేస్తుందో? పంజాబ్, ఆర్సీబీ ఈ రెండు టీమ్స్‌లో ఎవరు తమ తొలి కప్పును ముద్దాడుతాయో చూసేందుకు యావత్ క్రికెట్ ప్రపంచం ఎదురుచూస్తోంది.

## క్రికెట్‌లో చరిత్రలో భారీ సిక్స్ బాదిన బ్యాటర్ ఎవరో తెలుసా?



క్రికెట్ చరిత్రలో ఎన్నో అద్భుతమైన రికార్డులు, సంఘటనలు నమోదయ్యాయి. ఆధునిక క్రికెట్‌లో భారీ సిక్సర్లు కొట్టడం సాధారణమైపోయింది. కానీ, 19వ శతాబ్దంలో, పిచ్‌లు సరిగా లేని సమయంలో, బ్యాటింగ్ పరికరాలు అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో, ఒక బ్యాట్స్‌మెన్ కొట్టిన సిక్స్ లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ పెవిలియన్‌ను దాటి పోవడం అనేది కనీవినీ ఎరుగని రికార్డు.

క్రికెట్‌లో భారీ సిక్స్ కొట్టిన రికార్డు క్రిస్ గేల్ పేరిట లేదా మహేంద్ర సింగ్ ధోని, గ్లెన్ మాక్స్వెల్ పేరిట లేదు. 100 సంవత్సరాల క్రితం, క్రికెట్‌లో అత్యంత పొడవైన సిక్స్ నమోదైందని మీకు తెలుసా? అంటే ఈ భారీ సిక్స్ ప్రపంచ రికార్డు వందేళ్ల క్రితమే రికార్డుల పుస్తకాల్లో నమోదైంది. అయితే, ఇప్పటివరకు ఎవరూ ఈ రికార్డుకు దగ్గరగా కూడా రాలేకపోయారు.

### ప్రపంచ క్రికెట్‌లో అత్యంత పొడవైన సిక్స్ కొట్టిన ప్లేయర్..

క్రికెట్ చరిత్రలోనే అతి పొడవైన సిక్స్‌ను 19వ శతాబ్దంలో ఆల్బర్ట్ ట్రాట్ కొట్టాడు. ఆల్బర్ట్ ట్రాట్ ఇంగ్లాండ్ వర్సెస్ ఆస్ట్రేలియా రెండింటికీ క్రికెట్ ఆడాడు. 19వ శతాబ్దంలో ఆల్బర్ట్ ఒక సిక్స్ కొట్టి లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ పెవిలియన్ దాటించాడు. ఈ సిక్స్ పొడవు 164 మీటర్లు. క్రికెట్ చరిత్రలో ఇదే అతి పొడవైన సిక్స్. ఇంగ్లాండ్‌కు చెందిన మేరీల్‌బోన్ క్రికెట్ క్లబ్ తరపున ఆడుతున్నప్పుడు ఆస్ట్రేలియాపై ఆల్బర్ట్ ఈ షాట్ కొట్టాడు. బంతి బౌండరీ దాటి పోయింది.

### 164 మీటర్ల సిక్స్ తో అరుదైన ఫీట్..

ఆల్బర్ట్ ట్రాట్ 19వ శతాబ్దపు అత్యంత ప్రమాదకరమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకడిగా నిలిచాడు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా రెండు దేశాల తరపున క్రికెట్ ఆడాడు. చరిత్రలో అతి పొడవైన 'సిక్స్' ఆల్బర్ట్ పేరుతో నమోదైంది. అతను 164 మీటర్ల పొడవైన సిక్స్ కొట్టే ఘనతను సాధించాడు. 19వ శతాబ్దంలో, బౌలర్లు ఆల్బర్ట్ ట్రాట్ పేరుతో భయపడేవారు. ఇది మాత్రమే కాదు, బౌలింగ్‌లో కూడా అతను బ్యాట్స్‌మెన్‌కు భయంకరంగా మారాడు.

### ఈ జాబితాలో ఇద్దరు భారతీయుల పేర్లు..

పొడవైన సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో ఇద్దరు భారతీయులు కూడా ఉన్నారు. యువరాజ్ సింగ్, మహేంద్ర సింగ్ ధోని ఈ లిస్టులో ఉన్నారు. యువరాజ్ సింగ్ 119 మీటర్ల దూరం సిక్స్ కొట్టాడు. టీ20ల్లో 6 బంతుల్లో 6 సిక్సర్లు కొట్టిన రికార్డు కూడా యువీ పేరిట ఉంది. కాగా, ఎంఎస్ ధోని 112 మీటర్లలో సిక్స్ కొట్టాడు. 2007 టీ20 ప్రపంచ కప్‌లో టీమిండియా ప్లేయర్ యువరాజ్ సింగ్ ఆస్ట్రేలియాపై 70 పరుగుల ఇన్నింగ్స్‌లో బ్రెట్ లీ బంతికి 119 మీటర్ల పొడవైన సిక్స్ కొట్టాడు. ఈ సిక్స్ కూడా అద్భుతంగా ఉంది. ఎందుకంటే, ఈ సిక్స్ కోసం యూవీ తన మణికట్టును మాత్రమే ఉపయోగించాడు.

## 'ది రాజా సాబ్' ఆగమనం.. అదిరిపోయే అప్‌డేట్ పంచుకున్న టీమ్



ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. భారీ అంచనాల మధ్య రానున్న ఈ మూవీ అప్‌డేట్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నిర్మాణ సంస్థ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా టీజర్ జూన్ 16న రానున్నట్లు తెలిపింది. అలాగే డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను పంచుకుంది.

ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన వీడియోలు, పోస్టర్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి.

### అభిమానులకు పండగే..

రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ దర్శకుడు మారుతీ పోస్ట్ పెట్టారు. 'మీ అందరికీ ప్రామిస్ చేసినట్లే మీరు కోరుకున్నట్లు ప్రభాస్‌ను బిగ్‌స్క్రీన్‌పై చూస్తారు. ఆరోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి' అని క్యాప్షన్ పెట్టారు. మారుతి – ప్రభాస్ కాంబోలో వస్తోన్న తొలి చిత్రమిది. తమన్ ఇప్పటికే ఈ సినిమాలో నాలుగు పాటలు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. వైవిధ్యమైన థీమ్స్‌తో వీటిని డిజైన్ చేసినట్లు వెల్లడించారు.

## స్పెషల్ AGRICULTURE వ్యవసాయం

# ముందే వచ్చిన రుతుపవనాలు

## ఇలా చేస్తే రైతుకు మేలు



**ముందు ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం నైరుతి రుతుపవన వర్షాలు 10 రోజులు ముందుగానే వచ్చేశాయి. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగానే ఉంటాయని వాతావరణశాఖ కూడా చెబుతోంది. ఈ పరిస్థితుల్లో ముందుగానే వస్తున్న తొలకరి వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. దీని కోసం రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వ్యవసాయ నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. అవేంటో చూద్దాం.**

### భూములను లోతుగా దున్నుకోవడం

వేసవిలో పడే తొలకరి వర్షంతో మెట్టరైతులు తమ భూములను వాలుకు అడ్డంగా లోతుగా దున్నుకోవాలి. దీని వల్ల తదుపరి కాలంలో పడే వర్షపునీరు భూమిలోనికి ఎక్కువగా ఇంకి భూమి సాగుకు అనుకూలంగా ఉంటుంది. గత కొన్నేళ్లుగా వ్యవసాయశాఖ ప్రోత్సహిస్తున్న సబ్ సాయిలర్ (ఒంటి మడక) సాయంతో 10 నుంచి 15 అడుగుల దూరంలో 75 నుంచి 90 సెంటీమీటర్ల లోతు సాళ్లు చేయడం ద్వారా భూమిలోపలి గట్టి పొరను పగలగొట్టడం ద్వారా భూమి లోపలిపొరల్లోకి నీరు ఇంకేట్లు చేయవచ్చు. దీని వల్ల పంటల వేర్లు లోపలి పొరల్లోకి చేరి అక్కడి పోషకాలను, తేమను తీసుకొనేందుకు వీలుపడుతుంది.

### మెట్ట పొలాల గట్లు బలోపేతం చేసుకోవడం

మెట్టరైతులు తమ పొలంలో పడే వర్షపునీరు తమదే అనే భావన కలిగి ఉండాలి. కాబట్టి తమ పొలంలో పడే వర్షపునీరు అంతా తమ పొలంలోనే ఇంకేలా ఏర్పాట్లు లేదా రక్షణ చర్యలు చేసుకోవాలి. దీనికోసం వాలుగా ఉండే లోతట్టు గట్ల కింద భాగంలో కందకం లేదా కాలువలు తవ్వి, తవ్వగా వచ్చిన మట్టిని పైభాగాన గల గట్లపై వేసుకోవాలి. దీని వల్ల పై భాగంలోని పొలంలో పడిన వర్షపునీరు అక్కడే ఇంకి లేదా నిలువ ఉండే భూమిలోకి మెల్లగా ఇంకిపోతుంది. ఇలా ఇంకేటప్పుడు కింద తవ్విన కాలువలో కూడా నీరుచేరి అదనపునీరు ఇతరుల పొలాల్లోకి వృథాగా పోకుండా తన పొలంలోనే ఇంకుతుంది. లోతట్టు ప్రాంతాల్లో నీటి కుంటల ఏర్పాటు మెట్ట పొలాల రైతులు తమ పొలంలో వాలును బట్టి.. పొలంలో పడిన వర్షపునీరు భూమిలో ఇంకిన తర్వాత వెలుపలికి వృథాగా పోకుండా పల్లపు ప్రాంతంలో నీటి కుంటలను ఏర్పాటు చేయాలి. ఇలా నిల్వచేసే నీటిని అత్యవసర సమయంలో పంటలకు వినియోగించడానికి వీలుంటుంది. మరియు ఈ కుంట చుట్టూ పండ్ల మొక్కలు, పశుగ్రాసం కూడా పెంచుకొని అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.

### వర్షాధార పొలాలకు విరివిగా సేంద్రియ ఎరువుల వాడకం

మెట్ట పొలాలకు వీలైనంత ఎక్కువగా పశువుల ఎరువు వంటి సేంద్రియ ఎరువులను వేసుకొని కలియ దున్ను కోవడం వల్ల భూమిలోనికి వర్షపునీరు ఎక్కువగా ఇంకుతుంది. భూమిలో సేంద్రియ పదార్థం అధికంగా ఉండడం వల్ల ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండి మొక్కలకు అందుతుంది. సేంద్రియ ఎరువులను భూమికి ఎక్కువగా అందించడం వల్ల మెట్ట పంటలను బెట్ట పరిస్థితుల నుంచి చాలా వరకు కాపాడవచ్చు. అందుబాటులో ఉండే చెరువులలోని ఒండ్రు మట్టిని కూడా పొలాలకు తోలుకొని చల్లుకోవచ్చు. దీని వల్ల మెట్ట భూములు సారవంతం కావడంతో పాటు వర్షపునీరు కూడా పొలంలోకి ఎక్కువగా ఇంకుతుంది. చెరువు మట్టిని వేసేముందు మట్టి లవణ సూచిక మరియు ఉదజని సూచిక తటస్థంగా ఉండే మట్టిని వినియోగించాలి. సాధారణంగా ఎకరాకు రెండు ట్రాక్టర్ల పశువుల ఎరువు లేదా కంపోస్టు ఎరువు వేసుకొని కలియదున్నుకుంటే మెట్టభూముల్లో పంటలను బెట్ట పరిస్థితుల నుంచి చాలా వరకు కాపాడుకోవచ్చు.

### మెట్ట భూముల్లో గట్ల వెంబడి పండ్లు, ఇతర చెట్ల పెంపకం

తొలకరి వర్షాలు పడినప్పుడు మెట్ట పొలాల గట్ల వెంబటి వర్షాధారంగా పెరిగే అనేక రకాలైన పండ్ల మొక్కలు, ఇతర మొక్కలను నాటుకోవాలి. ముఖ్యంగా చింత, సీతాఫలం, వెలగ, నేరేడు, రేగు, పనస, ఉసిరి మొదలైన పండ్ల జాతులను పెంచాలి. అనావృష్టి పరిస్థితుల్లో వ్యవసాయ పంటలు నష్టపోయినా ఈ పండ్ల మొక్కల నుంచి వచ్చే దిగుబడి రైతుకు కాస్త ఊరటనిస్తుంది. వీటితో పాటు సుబాబుల్, గ్లైరిసీడియం, తుమ్మ, వెదురు, వేప, కానుగ, కుంకుడును పెంచడం వల్ల కూడా రైతులకు అదనపు ఆదాయం వస్తుంది.

రైతులకు అండగా అంతరపంటలు/మిశ్రమ పంటలు మారుతున్న నేటి వాతావరణ పరిస్థితుల వల్ల వర్షాధార మెట్ట భూములలో ఒకే పంటసాగు రైతు జీవనాన్ని చిన్నాభిన్నం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో గతంలో మెట్ట రైతాంగం అనుసరించిన అంతరపంటలు, మిశ్రమ పంటల సాగు లాభదాయకంగా ఉంటుంది.

వేరుశనగతో పాటు కంది, జొన్న, సజ్జ, కొర్రలు, ఆముదం, ఆనప, అలసంద వంటి పంటలను అంతరపంటలుగా సాగుకు శాస్త్రవేత్తలు సిఫార్సు చేస్తున్నారు. ఈ పంటల వేరు వ్యవస్థ భూమి లోపలిపొరల్లోకి చొచ్చుకెళ్లి నీటిని తీసుకొని బెట్ట పరిస్థితుల్లో సైతం కొంతవరకు దిగుబడులను ఇవ్వగలిగే శక్తిని కలిగి ఉంటాయి. బెట్ట పరిస్థితుల వల్ల వేరుశనగ పంటను పూర్తిగా నష్టపోయినా ఈ అంతర పంటలు రైతులకు కొంతవరకు ఆదుకుంటాయి.

వర్షాధార మెట్ట భూముల్లో పంట దిగుబడులు ప్రధానంగా పడే వర్షపునీటిని సద్వినియోగం కోసం రైతులు ఆచరించే సేద్యపద్ధతులపైనే ముఖ్యంగా ఆధారపడి ఉంటాయి. కాబట్టి వర్షపునీటి సంరక్షణలోనే మెట్ట భూముల్లో సుస్థిర ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందనే వాస్తవాన్ని రైతులు గ్రహించి తగిన విధంగా సాగు పద్ధతులు చేపట్టాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.





## భారీ వర్షాలు

# ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. ఈ ఉద్యాన పంటల్లో వివిధ రకాల చీడపీడలు, తెగుళ్లు ఆశించి నష్టపరిచే అవకాశం ఉంది. ఈ సమయంలో ఈ పంటలను రక్షించుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం.**

### టమాటా

ఏప్రిల్, మే నెలల్లో నాటుకున్న టమాటా ప్రస్తుతం పూత, కాయ దశలో ఉంది. ఈ పంటలో ప్రస్తుతం కాయకుళ్లు, కాల్షియం లోపం, శనగ పచ్చపురుగు ఉద్ధృతి వంటి సమస్యలు వస్తున్నాయి. శనగపచ్చ పురుగు టమాటా కాయలకు రంధ్రాలు చేయడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుంది. దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అధిక వర్షాలకు నేలను తాకిన కాయలు కుళ్లిపోతాయి. దీని నివారణకు టమాటా మొక్కలను కర్రలు, తాళ్లు కట్టి పైకి పాకించాలి. వర్షం నీరు నిలిచిన వెంటనే రిడోమిల్ 2.5గ్రా. లీటరు నీటికి (లేదా) కార్బండిజమ్ మాంకోజెబ్ 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి 1,2 సార్లు పిచికారీ చేయాలి. నారు దశలో ఉన్న టమాటాకు నారుకుళ్లు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటికి కలిపి వేర్లు తడిచేలా బెడ్లను తడపాలి. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఎకరానికి 30-40 కిలోల యూరియా, 10-15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.



### మిరప

పూత, కాత దశలో ఉన్న పచ్చిమిచ్చిలో శనగపచ్చ పురుగు, కాల్షియం లోపం, వేరుకుళ్లు, సూక్ష్మధాతు లోపం వంటి సమస్యలు ఏర్పడతాయి.

మిరపలో శనగపచ్చ పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా లీటరు నీటికి (లేదా) క్లోరాంట్రానిలిప్రోల్ 0.3మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాల్షియం, ఇతర సూక్ష్మధాతు లోప నివారణకు ఆగ్రోమిన్ మాక్స్ (ఫార్ములా-6) 5 గ్రాములు, కాల్షియం నైట్రేట్ 5 గ్రాములను నీటరు నీటికి కలిపి 2-3 సార్లు పిచికారీ చేయాలి.

నారు దశలో ఉన్న ఎండు మిరపకు నారు కుళ్లు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి వేర్లు తడిచేలా నారు బెడ్లను తడపాలి.



## ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు



నల్లజర్ల (తూర్పుగోదావరి జిల్లా), రేపటి కోసం

మండల పరిధిలోని అనంతపల్లి గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు వారి ఆక్రమణలను క్రమబద్ధీకరించు కునేందుకు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు సూచించారు. మంగళవారం నల్లజర్ల తహశీల్దారు నాయుడుతో కలిసి ఆక్రమణలను జెసి పరిశీలించారు. ఆక్రమణదారులు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

### ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్




తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా), రేపటి కోసం

ఉపాధి హామీ కూలీలకు తక్షణమే వేతనాలు జమ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మంగళవారం పెంటపాడు మండలం ఆకుతీగపాడు, ముదునూరు గ్రామాల్లో పని ప్రదేశంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పని ప్రదేశంలో పనికి తగిన వేతనాలు తక్షణమే ఇవ్వాలని కూలీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారిని ఉద్దేశించి లక్ష్మణరావు మాట్లాడుతూ ఏప్రిల్, మే ప్రస్తుతం జూన్ నెల లో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు ఒక పైసా కూడా కూలీలకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలుకు నగదు జమ అవ్వకపోవడం వలన జీవన ప్రమాణాలు రోజురోజుకు వారి జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే జిల్లా వ్యాప్తంగా కూలీలతో నిరసన చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వంక అప్పారావు, వంక రామకృష్ణ, ములగల శ్రీనివాస్, చిన్నం రాజు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంటలో పడి గొర్రెల కాపరి మృతి

చాట్రాయి (ఏలూరు), రేపటికోసం



వ్యవసాయ భూమిలో తవ్విన ఇంకుడు గుంటలో పడి గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చాట్రాయిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం చాట్రాయి గ్రామానికి చెందిన మందపాటి బసవరెడ్డి పామాయిల్ తోటలో ఇంకుడు గుంట లోతుగా తవ్వారు. గొర్రెలు కాపరి సర్నాల మారేశ్వరరావు (45) గొర్రెలను అటువైపు మేత కోసం తోలుకొని వెళ్ళగా ఒక గొర్రె పిల్ల గుంటలో పడింది. దాన్ని రక్షించేందుకు మారేశ్వరరావు గుంటలోకి దిగగా గుంట లోతుగా ఉండటంతో మునిగిపోయాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు గుంటలో నుండి మారేశ్వరావును బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



తణుకు (పశ్చిమగోదావరి జిల్లా), రేపటికోసం

కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాధితులకు ఆర్థిక సాయం అందించడంతో ఆర్థిక ఇబ్బందులు తొలగుతున్నాయని తణుకు ఏఎంసీ వైస్ ఛైర్మన్ వల్లూరి మోహనరావు అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో 15 మందికి రూ. 8.10 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొండేటి శివ, టిడిపి మండల అధ్యక్షుడు పితాని మోహనరావు, జనసేన తణుకు మండలం అధ్యక్షులు చిక్కాల వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసిపి నుంచి టిడిపి గూటికి



తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా), రేపటి కోసం

నియోజకవర్గంలోని పెంటపాడు మండలం పరిమళ్ల గ్రామానికి చెందిన సర్పంచి ఉప సర్పంచ్, వార్డు సభ్యులు వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు గంధం సతీష్ నాయకత్వంలో వీరంతా టిడిపి ఇన్చార్జి కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి (మల్లికార్జున రావు) సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ ఇందుకూరి నాగరాజు, వార్డు సభ్యులు గేదెల వెంకన్న పురిటి సీతయ్య, మండ జయరాజు, బద్దిరెడ్డి భోజన్న , తమ్మిరి అయ్యప్ప, డొంక రాము, అల్లం పెద్ద శీను, అల్లం శీను, తంగేళ్ల చౌదరి, దిరిశాల మల్లిబాబు 100 మంది టిడిపిలో చేరారు.

## కార్మిక సంక్షేమ బోర్డు నిర్వీర్యం తగదు

### సిఐటియు నాయకుడు వెంకట్రావు

నల్లజర్ల (తూర్పుగోదావరి జిల్లా), రేపటి కోసం

భవన నిర్మాణ కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక సంక్షేమ బోర్డును పాలకవర్గాలు నిర్వీర్యం చేయడం తగదని సిఐటియు నాయకుడు వెంకట్రావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో భవనిర్మాణ కార్మికులు సుదీర్ఘమైన పోరాటాలు చేయడంతో 2005లో కార్మిక సంక్షేమ బోర్డు సాధించుకున్నార తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రమాదపు అంచిన పనులు చేస్తున్నారని పనిచేస్తున్నగా నిత్యం అనేకమంది ప్రమాదాల గురవుతుంటారని, కష్ట కాలంలో ఆ కుటుంబాలను ఆదుకోవడానికి సంక్షేమ బోర్డు ఉపయోగపడేదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థిక లాభం లేకపోయినా కావాలనే సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సిఐటియు నాయకుడు వెంకట్రావు కోరారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

### కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ఏలూరు బ్యూరో, రేపటి కోసం

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి విస్తృతంగా అవగాహన పరచాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశపు మందిరంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిషేధ చట్టానికి సంబంధించిన అవగాహన గోడ పత్రికలను కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ బాల మరియు కౌమార కార్మిక వ్యవస్థ చట్టం- 1986 (సవరణ చట్టం 2016) మేరకు సెక్షన్ 3 కింద ఏ వృత్తి లో అయినా 14 నుంచి 18 ఏళ్ల లోపు బాలలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకొని పనిచేయించినా చట్టప్రకారం నేరమన్నారు. బాల కార్మికులకు ఆస్కారం ఉన్న హాట్ స్పాట్లను గుర్తించాలన్నారు. కార్మిక శాఖ మండల స్థాయిలో పోలీసు, రెవెన్యూ సంబంధిత శాఖలను సమ న్వయం చేసుకొని తనిఖీలు నిర్వహణ చేపట్టడం ద్వారా ఇటుక బట్టీలు, మైనింగ్ పరిశ్రమల వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల వద్ద, డైరీ పరిశ్రమలలో ఉన్న బాల కార్మికులను గుర్తించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. ఈ దిశగా ఈనెల 10వ తేదీ వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఆక్వా పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో బాల కార్మికులను గుర్తించాలన్నారు. జూన్ 12 నుంచి ఏలూరు అర్బన్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించాలన్నారు. పాఠశాలలు తెరిచిన అనంతరం స్కూల్ టైమ్ లో దుకాణాలు, హోటల్స్, తదితర చోట్ల పిల్లలు కనబడితే వారిని విచారించి బాల కార్మికులుగా గుర్తిస్తే ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బడి బయటి పిల్లలను గుర్తించడం తో పాటు వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చేలా విద్యా శాఖ అధికారులు చొరవ చూపాల న్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ సెక్షన్ 3 ఎ కింద 14 ఏళ్లు నిండి 18 ఏళ్లు వయస్సు పూర్తి కాని బాలలతో నిషేధిత ప్రమాదకర వృత్తులు, ప్రక్రియలో పని చేయించుకోవడం లేక పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు.

## ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగనే: ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు (తూర్పుగోదావరి జిల్లా), రేపటి కోసం

గత ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఆస్తులను తాకట్టులు పెట్టి, ఆర్థిక కుంభకోణాలతో రాష్ట్రాన్ని దోచుకున్నారని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు విమర్శించారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించి రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టేసారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం లక్షల కోట్ల అప్పుచేసి రాష్ట్ర ఖజానాన్ని ఖాళీ చేసిందని, ఖాళీ ఖజానాతో అధికార బాధ్యతలు చేపట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తుందన్నారు. దుర్మార్గపు పాలనతో జగన్మోహన్ రెడ్డి మంత్రులు రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. మద్యం కుంభకోణంలో ఇప్పటికే కొందరు అరెస్టులు అయ్యారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 70 శాతం అభివృద్ధి పనులను చేసినట్లు వివరించారు. తండ్రి రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ముఖ్యమంత్రి కావాలన్నా ఆశతో కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచింది నువ్వు కాదా జగన్ మోహన్ రెడ్డి అని ప్రశ్నించారు. చిన్న తండ్రిని గొడ్డలి వేటు వేసి నిందితులను శిక్షించకుండా అడ్డుపడి, కుటుంబానికి వెన్నుపోటు పొడిచింది నువ్వు కాదా జగన్మోహన్ రెడ్డి అని ప్రశ్నించారు. తల్లి నీ చెల్లిని రోడ్డు మీద పడేసి అధికారం కోసం తల్లడిల్లుతున్న నువ్వు చెప్పాలి వెన్నుపోటు కోసం అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టిడిపి నియోజవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ, తెలుగుదేశం పార్టీ కొవ్వూరు పట్టణ అధ్యక్షులు దాయన రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జ్ పెనుమాక జయరాజు, పొట్రు సిద్దు, మాజీ ఎంపీటీసీ మద్దిపాటి సత్యనారాయణ, కలగర సుబ్బారావు పాల్గొన్నారు.

# దివ్యాంగులు, వయోవృద్ధుల ఇంటి వద్దకే రేషన్

### భీమవరంలో రేషన్ పంపిణీని పరిశీలించిన కలెక్టర్ నాగరాణి



భీమవరం (పశ్చిమ గోదావరి జిల్లా), రేపటికోసం

దివ్యాంగులు, దీర్ఘకాలిక అస్వస్థులు, వయోవృద్ధులకు రేషన్ సరుకులను వారి ఇంటి వద్దకే డీలర్లు అందజేస్తున్నారని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం భీమవరం పట్టణం ఏడో వార్డు గాంధీనగర్ లో స్థానిక రేషన్ డీలర్ నారి నరసింహారావు దీర్ఘకాలం అస్వస్థతతో మంచానికే పరిమితమైన గుమ్మళ్ళ రామారావు, వయోవృద్ధులు సిద్ధిరెడ్డి రామారావు కుటుంబాల ఇంటి వద్దకే వెళ్ళి పంపిణీ చేస్తున్న రేషన్ ప్రక్రియను కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ రేషన్ వాహనం ఒక ప్రాంతంలో ఉంచితే అక్కడికి వెళ్లి రేషన్ తీసుకోవాల్సి వచ్చేదన్నారు. అడుగు వేయలేని పరిస్థితిలో ఉన్న దివ్యాంగులు, వయోవృద్ధులైన అయిన తమకు ఆ కాస్త దూరం కూడా చాలా భారంగానే ఉండేదని చెప్పారు. రేషన్ వాహనం కూడా ఒకరోజు మాత్రమే వచ్చేదని, అది ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసే పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉండేదన్నారు. మాలాంటి వారికి రేషన్ అందజేసే భారాన్ని రేషన్ డీలర్ పై ఉంచి, ఇంట్లోకి తెచ్చిఇచ్చే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోవడం చాలా హర్షించదగిన విషయం అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకంగా అమలు చేస్తున్న రేషన్ పంపిణీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రేషన్ పొందడంలో ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారి వెంట భీమవరం తహసీల్దార్ రావి రవికుమార్, డీ.ఎస్.ఓ సరోజ, ఏఎస్ఓ రవిశంకర్, సిఎస్ ఆర్ఐ ఏ.సురేష్, వీఆర్వో ఏ సూర్యకాంతం ఉన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

కొవ్వూరు (తూర్పుగోదావరి జిల్లా) రేపటి కోసం



ఆరోగ్య ఇబ్బందులు పడుతున్న వారిపై ముఖ్య మంత్రి సానుకూ లంగా స్పందించి సాయమంది స్తున్నారని కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ నిర్వహించారు. చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు దాయన రామకృష్ణ, కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ, పొట్రు సిద్దు, క్లస్టర్ ఇంచార్జ్ పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

## రేపు తణుకులో యోగాంధ్ర: ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు (పశ్చిమ గోదావరి), రేపటికోసం



యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో ఈ నెల 5 వ తేదీ గురువారం ఉదయం 6 గంటలకు యోగాంధ్ర-2025 కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్లు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు, కూటమి నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం



తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా), రేపటి కోసం

కొండ్రపోలు భగత్ సింగ్ కాలనీ కి చెందిన దుర్గారావు కుమారుడు జి.శ్రీనివాస్ ఇటీవల రైలు ప్రమాదంలో మరణించాడు. బాధిత కుటుంబ సమస్యలను శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కు ఆ కాలనీ జనసేన పార్టీ ఇన్చార్జి కర్రి సురేష్ వివరించారు. తక్షణమే స్పందించిన రాష్ట్ర విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ. 25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం జనసేన క్రియాశీలక సభ్యుడైన పవన్ కళ్యాణ్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయాలు పాలు కావడంతో సహాయనిధి ద్వారా రూ. 15,700 సాయం అందించారు. కార్యక్రమంలో కర్రీ సురేష్, వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, టి.గురుమూర్తి, వెంకట్రావు, వెంకటేష్, శ్రీను, రవి పాల్గొన్నారు.

## నేడు నల్లజర్లలో భారీ బందోబస్తు

నల్లజర్ల (తూర్పుగోదావరి జిల్లా), రేపటి కోసం

వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం నల్లజర్లలో ఎక్కడా అల్లర్లు లేకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు నల్లజర్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంబాబు తెలిపారు. శాంతియుతంగా కార్యక్రమం నిర్వహించాలని వైసిపి నాయకులను కోరారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై అవగాహన కల్పించండి

### కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ఏలూరు, రేపటి కోసం

జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఉద్యానవన సంబంధిత, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటుపై అవగాహన కలిగించేందుకు ఏజెన్సీ ప్రాంతంలో వర్క్ షాప్ నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉధ్యానవన సంబంధిత, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు నెలకొల్పేలా ఉద్యానశాఖ, ఐటిడిఏ అధికారులు సమన్వయంతో వర్క్ షాప్ నిర్వహించాలన్నారు. పిఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి ప్రగతి తీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ పథకం కింద బ్యాంకు రుణాలు మంజూరైన రుణాలు తీసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడానికి గల కారణాలను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించి రానున్న 15 రోజుల్లో సమగ్ర నివేదిక అందజేయాలని ఎల్డిఎం ను కలెక్టర్ ఆదేశించారు. పిఎంఇజిపిపై కలెక్టర్ సమీక్షిస్తూ సంబంధిత మంజూరైన యూనిట్లు స్థాపనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంను ఆదేశించారు. జిల్లాలో సింగిల్ విండో కింద దరఖాస్తు చేసుకున్న 52 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల్లో 51 మంది పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ సమావేశం ఆమోదం తెలిపింది. మిగిలిన ఒక ధరఖాస్తుకు సంబంధించి లీగల్ అండ్ మెట్రాలజీ వారివద్ద పెండింగ్ లో ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సరైన రీతిలో స్పందించని అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. పరిశ్రమల అభివృద్ధి పాలసీని అనుసరించి ఆరు పరిశ్రమలకు రూ. 44.66 లక్షలు ప్రోత్సాహకాలుగా మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. ఆటోనగర్ సంబంధించి కోర్టు కేసుకు సంబంధించి జిపిని సంప్రదించాలని ఎపిఐఐసి జెడ్ఎం ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు

## 'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ



జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా), రేపటి కోసం

పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం 'వెన్నుపోటు దినం' పోస్టర్ ను చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, మచిలీపట్నం పరిశీలకు జెట్టి గురునాథరావు, మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అమలు చేయాలనే డిమాండ్తో బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి శ్రేణులు, ప్రజలు పాల్గొనాలని కంభం విజయరాజు కోరారు. నిరసన అనంతరం చింతలపూడి ఎమ్మార్వో ఆఫీస్ లో వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

చింతలపూడి (ఏలూరు జిల్లా), రేపటి కోసం

వైసిపి ఆధ్వర్యంలో 4న నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి వైసిపి శ్రేణులు, ప్రజలు తరలిరావాలని వైసిపి నియోజకవర్గ ఇంచార్జ్ కంభం విజయ రాజు కోరారు. బొడ్డు. వెంకటేశ్వరరావు ఇంటి వద్ద నుండి నిరసన ర్యాలీ మొదలవుతుందని తెలిపారు. మంగళవారం చింతలపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బొడ్డు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రాజేష్ నాయుడు, సుబ్బారావు, కొప్పుల నాగు దిలీప్, కాంతారావు, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

## ఆమెన్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



దేవరపల్లి (తూర్పుగోదావరి జిల్లా), రేపటి కోసం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్లతో పాటు, ఉచిత కళ్లజోళ్లు అందజేస్తున్న ఆమెన్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జి.వి.ప్రసాద్ కొనియాడారు. మంగళవారం మండలంలోని దుద్దుకూరులో షాలోమ్ టెంపుల్ ఆవరణలో ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ చేశారు. ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజెలిన్ అశోక్, దుద్దుకూరు మాజీ సొసైటీ అధ్యక్షులు కాంద్రు రామకృష్ణ, పంచాయతీ కార్య నిర్వహణ అధికారి రామచంద్రారావు, షాలోమ్ టెంపుల్ నిర్వాహకులు కొడవటి బుజ్జిబాబు పాల్గొన్నారు.

## తెలికిచర్లలో జెసి చిన్నరాముడు పర్యటన



నల్లజర్ల (తూర్పుగోదావరి జిల్లా), రేపటి కోసం

నల్లజర్ల మండలం తెలికిచర్ల గ్రామంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు పర్యటించారు. ఆ గ్రామంలో 65 ఏళ్ళు దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందజేశారు. ఆయన వెంట తహశీల్దార్ నాయుడు, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారులు సామ్యూల్, శ్రీనివాస్ ఉన్నారు.

## మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా), రేపటి కోసం

మండలం పరిధిలోని గురవాయిగూడెం గ్రామంలో శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకు న్నారు. నిత్యాన్న దాన సత్రంలో సుమారు 2000 మంది భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థానానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ. 2,23,162 ఆదాయం సమకూరిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

దేవరపల్లి (తూర్పుగోదావరి జిల్లా), రేపటి కోసం

గోపాలపురం మండలం ఎక్సైజ్ పోలీసులు మంగళవారం జరిపిన దాడుల్లో కరగపాడు గ్రామానికి చెందిన బుర్రి వెంకటరమణను అదుపులోకి తీసుకుని 400 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నారు. బుచ్చియ్య పాలెం గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న చిక్కాల రామకృష్ణ ను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని దేవరపల్లి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

## కొమ్ముగూడెంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్



తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా), రేపటి కోసం

మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో మంగళవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కె.వి.కె విస్తరణ అధికారి డాక్టర్ వి దీప్తి అధ్యక్షతన నిర్వహించడం నిర్వహించారు. రైతులకు కొబ్బరి, కోకో, ఆయిల్ ఫామ్, వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి, పత్ర ఆకు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఆయిల్ ఫామ్ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు, వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామ సహాయ అధికారి ధర్మరాజు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. అనంతరం ఆయిల్ ఫామ్ క్షేత్రాన్ని సందర్శించి మొవ్వ కుళ్ళు, కాండం కుళ్ళుని గమనించి సూచనలు అందజేశారు.

రేపటి కోసం
తెలుగు దినపత్రిక
www.Repatikosam.com



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను సినీ హీరో అక్కినేని నాగార్జున ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. తన చిన్న కొడుకు అఖిల్ వివాహ ఆహ్వానపత్రికను సీఎం చంద్రబాబుకు నాగార్జున అందించారు.

# సర్వాంగ సుందరంగా సముద్ర తీరం ముస్తాబు



మంగినపూడి బీచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా సముద్ర జీవుల కళాకృతులు

**మచిలీపట్నం ప్రతినిధి (కృష్ణా), రేపటి కోసం**

మచిలీపట్నం మంగినపూడి బీచ్ జూన్ 6, 7, 8 తేదీలలో బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించనున్నారు. ఈ బీచ్ ఫెస్టివల్ సందర్భంగా మంగినపూడి బీచ్ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. చేతి వృత్తి కళాకారులు పెద్ద పెద్ద చేపల ఆకృతులతో పర్యాటకులను ఆకట్టుకునేలా బీచ్ ఫెస్టివల్ లో సముద్ర తీరాన ఏర్పాటు చేశారు. డాల్ఫిన్, రొయ్య, చేప, చిలకా కళాకృతులు పర్యటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పర్యాటకులకు ఎండ తీవ్రత తెలియకుండా సముద్రతీన ప్రాంతాల్లో వివిధ రకాల టెంట్లు వేశారు. ఒకవేళ అనుకోకుండా వర్షం వచ్చిన కార్యక్రమం కొనసాగించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు బీచ్ ఫెస్టివల్ నిర్వాహకులు తెలిపారు. పారాసైక్లింగ్, హెలికాప్టర్ రైడింగ్ పర్యాటకులకు ఆకర్షణగా నిలుస్తోంది. మంచి మంచి రుచులతో వివిధ సముద్ర వంటకాలు ఏర్పాట్లు చేశారు. సంధ్యా సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్స్ ప్రోగ్రాం లు పర్యాటకులకు మంచి వినోదాన్ని కలిగించనున్నాయి. విద్యార్థులు చిన్నారులు ఆడుకునేందుకు సముద్ర తీరాన హార్స్ రైడింగ్, జీప్ డ్రైవింగ్, బోర్డు డ్రైవింగ్ ఇలా అనేక అన్ని సదుపాయాలతో సముద్ర తీరాన్ని ముస్తాబు చేశారు. మూడు రోజులు పాటు జరిగే బీచ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఇతర జిల్లాల నుండి అంతర్ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున పర్యాటకులు పాల్గొననున్నారు. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సముద్ర తీర ప్రాంతంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు బీచ్ ఫెస్టివల్ నిర్వాహకులు తెలిపారు .

## సిక్కిం వరదల నుంచి బయటపడ్డ
# విజయనగరం తహశీల్దార్ కుటుంబం

**అమరావతి, రేపటి కోసం**

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సిక్కిం వరదల నుంచి క్షేమంగా విజయనగరం తహసీల్దార్ కుర్మనాథరావు కుటుంబం బయటపడింది. ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా సిక్కింలోని లాచుంగ్‌లో తహసీల్దార్ కుటుంబం చిక్కుకుంది. కేంద్రం మంత్రి ఆదేశాలతో సిక్కిం అధికారులతో సమన్వయం చేసి తహసీల్దార్ కుటుంబాన్ని ఏపీ భవన్ అధికారులు సురక్షితంగా తరలించారు. సైన్యం, స్థానిక పోలీసుల సహాయంతో తహసీల్దార్ కుటుంబం గ్యాంగ్‌టాక్‌కు చేరుకుంది. గ్యాంగ్‌టాక్ జూన్ 6న తహసీల్దార్ కుటుంబం విజయనగరం చేరుకోనుంది. ఈ సందర్భంగా చొరవ చూపిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ భవన్, కలెక్టర్, సిక్కిం అధికారులకు తహసీల్దార్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

# వెన్నుపోటు..గొడ్డలి వేటు పేటెంట్ జగన్ దే

**ఏపీఐడిసి ఛైర్మన్ దేగల ప్రభాకర్**



**అమరావతి, రేపటి కోసం**

జగన్ రెడ్డి చేసిన కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే వెన్నుపోటు ధర్నాల డ్రామా ఆడుతున్నారని ఏపీఐడీసీ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం అర్బన్ టీడీపీ కార్యాలయంలో దేగల ప్రభాకర్ మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో తొలి ఏడాదిలో 10శాతం హామీలను కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. కానీ, కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలను అమలు చేసిందని తెలిపారు. కాంగ్రెస్‌ను అడ్డం పెట్టు కొని రూ.లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి జగన్ రెడ్డి వైసీపీ పేరుతో పార్టీ పెట్టారన్నారు. శివకుమార్ స్థాపించిన వైసిపిని కబ్జా చేసి శివకుమార్ కు వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. ఎత్తుకొని పెంచిన బాబాయ్ ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ, రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్ రెడ్డి అని ఆరోపించారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే జగన్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

# రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీ కార్డులు

**శాసనసభ పిటిషన్ల కమిటీ ఛైర్మన్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు**



**అమరావతి, రేపటి కోసం**

తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఎన్.టి.ఆర్.ఆరోగ్యశ్రీ కార్డులను జారీచేస్తే రేషన్ బియ్యం స్మగ్లింగ్ ను పూర్తి స్థాయిలో అరికట్టే అవకాశం ఉంటుందని ఏపీ శాసనసభ పిటిషన్ల కమిటీ అభిప్రాయ పడుతున్నట్లు ఆ కమిటీ ఛైర్మన్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘు రామకృష్ణ రాజు తెలిపారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి తమ కమిటీ త్వరలోనే ప్రతిపాదలను పంపనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం రాష్ట్ర శాసన సభలో ప్రాంగణంలోని తమ ఛాంబరులో కమిటీ సభ్యులు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖపట్నం ఉత్తర ఎమ్మెల్యే పి విష్ణు కుమార్ రాజుతో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు మినహా తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఏడాదికి రూ.25 లక్షల వరకూ ఆరోగ్య భీమాని ప్రభుత్వం కల్పిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యశ్రీ కార్డులను పొందేం దుకు ప్రజలకు పెద్ద ఎత్తున మక్కువ చూపుతున్నారన్నారు. ఇందు కోసం వారికి తెల్ల రేషన్ కార్డు అవసరం లేకపోయినా పొందుతున్నారున్నారు. ప్రతి ప్రభుత్వ పథకాని తెల్ల రేషన్ కార్డే ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల తెల్ల రేషన్ కార్డు అవసరం లేని వారు కూడా ఈ కార్డును తీసుకోవడం వల్ల రేషన్ బియ్యం దుర్వినియోగం అవ్వడమే కాకుండా భారీ ఎత్తున రేషన్ బియ్యం స్మగ్లింగ్ కు దారితీస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదే విషయాన్ని ఆయా శాఖల ఉన్నతాధికారులు కూడా ఒప్పుకుంటూ హెల్త్ కార్డు జారీ విషయంలో తెల్ల రేషన్ కార్డును డిలింక్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్న అభిప్రాయాన్ని వారు కూడా వ్యక్తం చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1.70 కోట్ల ప్యామిలీలు ఉన్నాయని, వాటిలో దాదాపు 1.48 కోట్ల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎటు వంటి సహకారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీకై దాదాపు రూ.5,100 కోట్లను వెచ్చిస్తోందని, దీనిలో దాదాపు రూ.2 వేల కోట్ల వరకూ ఆదా చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆ డబ్బులను విద్య, వైద్యంపై ఖర్చుపెట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక్క ఎన్.టి.ఆర్.ఆరోగ్యశ్రీ కార్డులకే కాకుండా ఎన్.టి.ఆర్.భరోసా ఫించన్లు మరియు ఇతర ప్రభుత్వ పథకాల మంజూరు విషయంలో రేషన్ కార్డులను డిలింక్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశాన్ని నెలకు రెండు సార్లు నిర్వహిస్తామని, శాంతి భద్రతల సమస్యలతో పాటు ప్రజలకు, సమాజానికి హితవు చేసే సామూహిక సమస్యలను పరిష్కరించే అంశంపై ఈ కమిటీ ప్రత్యేక శ్రద్ద చూపుతుందని తెలిపారు. ఆయా సమస్యలకు సంబందించి విజ్ఞాపనలను స్థానిక శాసన సభ్యుల ద్వారా ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ అందజేస్తే వాటి పరిష్కానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ సి.ఎస్. ఎం.టి.కృష్ణబాబు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్య దేవర, డిప్యూటీ సెక్రటరీ కె.రాజకుమార్, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# జగనే పెద్ద వెన్నుపోటు దారుడు

**టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి**



**విశాఖపట్నం, రేపటి కోసం**

కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్న జగన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నానని కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు వైసిపికి వెన్నుపోటు దినం నిర్వహించే నైతిక హక్కు లేదని, జగనే పెద్ద వెన్నుపోటు దారుడని పేర్కొన్నారు. శివ కుమార్ కి వెన్నుపోటు పొడిచి పార్టీని జగన్ తీసుకున్నాడని, బాబాయ్ గొడ్డలి పోటు పొడిచి ఇప్పుడు వెన్నుపోటు దినం నిర్వహిస్తావా? అని ఎద్దేవా చేశారు. సొంత చెల్లికి, తల్లికి వెన్నుపోటు పొడిచింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. వైసిపి హయంలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, పెన్షన్ 4 వేలు చేసింది కూటమి ప్రభుత్వం కదా? వైసిపి హయంలో 1000 పెంచడానికి 5 ఏళ్ల సమయం తీసుకోలేదా అని ప్రశ్నించారు. ఉచిత గ్యాస్ అమలు చేశామని, అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పారు. అమరావతిని సర్వ నాశనం చేశారు మూడు రాజ ధానులుని చెప్పి ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని, ఇప్పటికే 70 శాతం హామీలు అమలు చేశామని గండి బాబ్జీ వివరించారు.

# వ్యాపారవేత్తలుగా కుల వృత్తిదారులు: మంత్రి సవిత



**అమరావతి, రేపటి కోసం**

కుల వృత్తిదారులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా మూడో విడత ఆదరణ పథకం కింద అధునాతన పరికరాలు అందివ్వనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్, చేనేత మరియు జౌళి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ జిల్లాలకు ఈడీలతో మంత్రి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ గురించి జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత టైలరింగ్ శిక్షణతో కుట్టు మిషన్లు అందజేస్తోందన్నారు. కుట్టు శిక్షణకు హాజరవుతున్న మహిళలను పథకంపై సంతృప్తి వ్యక్తం చేస్తుండడంపై మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. కుట్టు శిక్షణా కేంద్రాలను తరుచూ సందర్శించాలని ఈడీలకు మంత్రి సవిత ఆదేశించారు. లబ్ధిదారుల హాజరు వంద శాతం ఉండేలా చూడాలని, పకడ్బందీగా ఎఫ్.ఆర్.సి చేయించాలని స్పష్టంచేశారు. మహిళలకు అత్యుత్తమ శిక్షణ అందివ్వడంతో పాటు వారు తయారు చేసే వస్త్రాలకు మార్కెట్ సదుపాయం కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు.

**అధునాతన 'ఆదరణ' పరికరాలు**

మూడో విడత ఆదరణ పథకం కింద కుల వృత్తుదారులకు సంప్రదాయ పరికరాలకు బదులు అధునాతన పరికరాలు అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి సవిత తెలిపారు. కుల వృత్తుదారులను వ్యాపారులుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ఆదరణ-3 అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రాంతాల వారీగా లబ్ధిదారులు ఎటువంటి పరికరాలు ఆశిస్తున్నారో వివరాలు సేకరించాలన్నారు. ఆ వివరాలను రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధికారులకు ఎప్పట 'కప్పుడు అందజేయాలన్నారు. కుల వృత్తుదారులకు సద్వినియోగమయ్యేలా ఆదరణ-3 అమలు చేయబోతున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఉమ్మడి జిల్లాలకు ఈడీలు, బీసీ కార్పొరేషన్ అధికారులు హాజరయ్యారు.

# మచిలీపట్నం 2కె రన్ లో సినీ హీరోల సందడి



**మచిలీపట్నం ప్రతినిధి (కృష్ణా), రేపటి కోసం**

మచిలీపట్నం బీచ్ ఫెస్టివల్ సందర్భంగా భైరవం చిత్ర హీరోలు నారా రోహిత్, మంచు మనోజ్, డైరెక్టర్ విజయ్, చిత్ర యూనిట్ మంగళవారం కోనేరు సెంటర్ లో నిర్వహించిన 2కె రన్ లో పాల్గొన్నారు. కోనేరు సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో సినీ హీరో మంచు మనోజ్ మంచు మనోజ్ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన మచిలీపట్నం రావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. బ్రిటిష్ కాలం నాటి పోర్ట్ మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చేలా మచిలీపట్నం పోర్టు నిర్మిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సెల్యూట్ చేశారు. యువతను తన మాటలతో ఉత్సాహపరిచారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగం ముగించారు. హీరో నారా రోహిత్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పర్యాటక శాఖ కీలకమని వ్యాఖ్యానించారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర కు అభినందనలు తెలియ జేశారు. మసులా బీచ్ ఫెస్టివల్ ద్వారా మచిలీపట్నం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మచిలీపట్నంకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా మంత్రి కొల్లు రవీంద్ర కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇటీవల విడుదలైన మా భైరవం చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోందని దర్శకులు విజయ్ తెలిపారు. అనంతరం గనుల భూగర్భ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మంచు మనోజ్, నారా రోహిత్ తో కలిసి క్రీడా స్ఫూర్తి కాగడాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర చేసిన డాన్స్ ఆకట్టుకుంది.

కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ ఎంపీ బాలశౌరి, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీఆర్ గంగాధర్‌రావు పాల్గొన్నారు.



ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ సిలై జకి, డిప్యూటీ కౌన్సిల్ జనరల్ దేవిడ్ ఈగిల్సన్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. వారు వివిధ అంశాలకు సంబంధించి కొద్ది సేపు సిఎస్ తో చర్చించారు.

# అవినీతి, వెన్నుపోట్లకు బ్రాండ్ అంబాసిడర్ జగన్


**ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ**




**వినుకొండ (పల్నాడు జిల్లా), రేపటి కోసం**

రాష్ట్ర రాజకీయాల్లోనే మోసం, అవినీతి, వెన్నుపోట్లకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ రెడ్డి అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ధ్వజమెత్తారు. జూన్ 4న వెన్నుపోటు దినంగా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుపై జీవి ఆంజనేయులు మంగళవారం స్పందించారు. ఏపీ ప్రజలు 2024 జూన్ 4 ఎన్నికల ఫలితాల్లో జగన్ కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి కూటమికి అఖండ మెజారిటీతో ఆశీస్సులు అందించారన్నారు. మద్యం కుంభకోణం బట్టబయలై అరెస్టు భయంతో కొత్త డ్రామాలకు తెర తీసి వెన్నుపోటు దినం అని పిలుపునివ్వడం పై జీవీ మండిపడ్డారు. ఒక్కఛాన్స్ అన్న మాటల్ని నమ్మి ప్రజలు అధికారం ఇస్తే 85 శాతం హామీలను ఎగనామం పెట్టిన అసలైన వెన్నుపోటుదారుడు జగన్ అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తొలి ఏడాదిలో కనీసం 10 శాతం కూడా సంక్షేమ పథకాలు అమలు చేయలేదని, ఉన్న పథకాలను రద్దు చేసిన విషయం అప్పుడే మరిచి పోతే ఎలా అని ఎద్దేవా చేశారు. సొంత బాబాయి హత్య కేసులో నిందితులను కాపాడడం, ఆస్తి కోసం తల్లి-చెల్లిని గెంటేయడం, వైసిపిని శివకుమార్ నుంచి లాక్కోవడం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులను లక్షల కోట్లలో కొల్లగొట్టడం ఇవేనా జగన్ అర్హతలని చురకలు వేశారు. మద్య నిషేధం అమలు గాలికి వదిలి, అన్న క్యాంటీన్లు రద్దు చేసి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఊసు ఎత్తని జగన్ అసలు ఏ మొహం పెట్టుకుని ప్రజల మధ్యకు వస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు నెరవేర్చి సంక్షేమ పాలనకు నాంది పలికిందని జీవీ ఆంజనేయులు తెలిపారు.

# వికసించిన మే పుష్పం



**ద్వారకాతిరుమల (ఏలూరు జిల్లా), రేపటి కోసం**

ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామంలో మే పుష్పం వికసించింది. ఏటా మే నెలలో మాత్రమే పూసే ఈ పుష్పం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పోలిన శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో మంగళవారం ఉదయం వికసించింది. తమ ఇంట మే పుష్పం పూయడం సంతోషంగా ఉందని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ పుష్పాన్ని చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

Printed, Published and Owned by **BOPPANA VIJAYA KUMAR**, Printed at Prajashakti Printers & Publishers Private Limited. D.NO.14-12-19, Krishnanagar, Tadepalli (P&M), Guntur District, Andhra Pradesh.
Published at 169/1A, FLAT NO.503, Varun Residency, LB Nagar, Ippatam Road, MANGALAGIRI, GUNTUR DISTRICT, Andhra Pradesh-522503. Editor: **Dr. Sakhamuru Srinivasa Prasad.** email:repatikosam.amaravathi@gmail.com,
Phone: 0863-3500207/3509930, RNI No. APTEL/2018/75566.